అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
బుధవారం 26-02-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 సంచిక : 06 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు వెల : 6.50



వామపక్షాలే ప్రత్యామ్నాయం

కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీఎంసీ దుష్పరిపాలనను ఎండగట్టాలి : దంకుని బహిరంగ సభలో సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్‌కరత్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలో బీజేపీని, పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీని ఓడించాలని సీపీఐ(ఎం) సమన్వయ కర్త ప్రకాశ్‌కరత్ పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) పశ్చిమ బెంగాల్ 27వ రాష్ట్ర మహాసభ ముగింపు సందర్భంగా మంగళవారం దంకుని ఫుట్‌బాల్ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రకాశ్‌కరత్ ప్రసంగించారు. ప్రజల మద్దతుతో సీపీఐ(ఎం) ముందుకు సాగుతోందని ఈ ర్యాలీ రుజువు చేస్తోందని అన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రతికూలతలన్నింటినీ ఎదుర్కొని ధైర్యంగా పని చేశారని తెలిపారు. "బీజేపీ మతతత్వ విధానాలకు, తృణమూల్ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా మతతత్వ శక్తులకు, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నాం. దేశ రాజ్యాంగాన్ని అంతం చేయడంలో బీజేపీ పాత్రకు వ్యతిరేకంగా మనం లౌకిక శక్తులతో కలిసి పోరాటం చేస్తున్నాం. రాష్ట్రంలోని తృణమూల్ ప్రభుత్వం అవినీతిమయమైంది. ఈ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక స్వభావానికి వ్యతిరేకంగా, బీజేపీ మతతత్వ రాజకీయాలపై పోరాటం జరుగుతోంది" అని అన్నారు. గత మూడేండ్లుగా బెంగాల్‌లోని ప్రజలకు వంద రోజుల పని లభించడం లేదని, వారి పని హక్కును హరించారని అన్నారు. పని హక్కు చట్టం అందరికీ ఉందని, అయితే మమత ప్రభుత్వం ఆ చట్టాన్ని విస్మరిస్తోందని విమర్శించారు. "రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదు. నాలుగు రోజులుగా ఈ రాష్ట్రంలోని వివిధ వార్తాపత్రికలలో మహిళలపై హింసకు సంబంధించిన వార్తలు చూశాను. ఈ జిల్లా (హుగ్లీ)కు చెందిన ఓ మహిళ వేధింపుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో సోమవారం మరణించింది" అని అన్నారు. "ఈ గూండా రాజ్‌కు వ్యతిరేకంగా పార్టీ ముందుండి పోరాడుతోంది. తొలుత మన కార్యకర్తలపై గూండాలను ప్రయోగించారు. నేడు ప్రజలపై ఉపయోగిస్తున్నారు" అని ప్రకాశ్‌కరత్ అన్నారు. "రాష్ట్రంలో వామపక్షాలు అధికారంలో ఉన్నప్పుడు ఏ మతతత్వ శక్తి కూడా తల ఎత్తలేకపోయింది. నేడు తృణమూల్ కారణంగా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తివంతంగా మారే వాతావరణం ఏర్పడింది. ఈ రాష్ట్రాన్ని హిందూ మత శక్తికి స్థావరంగా మార్చాలని ఆర్‌ఎస్‌ఎస్ కోరుకుంటోంది. మోడీ ప్రభుత్వం తాము హిందువులమని ...3లో

లైఫ్‌సైన్సెస్ పాలసీ తెస్తాం

త్వరలో 10 ఫార్మా విలేజీల ఏర్పాటు

- 5లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలు
- ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహిస్తాం
- ఆవిష్కరణలకు కేరాఫ్ హైదరాబాద్
- రాష్ట్రంలో మెగా డ్రైపోర్ట్ ఏర్పాటు
- ఏపీలోని సీ పోర్ట్‌తో అనుసంధానం : బయో ఆసియా సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి



బయో ఆసియా సదస్సులో ప్రొఫెసర్ పాట్రిక్ టాన్‌కు జినోమ్ వ్యాలీ ఎక్సెలెన్స్ అవార్డు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"హైదరాబాద్ నగరాన్ని కొత్త ఆవిష్కరణలు, తయారీ, నైపుణ్యాల కేంద్రంగా మార్చడమే మా ప్రభుత్వ లక్ష్యం. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ సహా భారీ ప్రాజెక్టులు వస్తున్నాయి. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య 10 ఫార్మా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నాం. రాబోయే రోజుల్లో ఐదు లక్షలకుపైగా కొత్త ఉద్యోగాలు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దేశంలోనే మొట్ట మొదటి 'లైఫ్ సైన్సెస్ పాలసీ'ని అందుబాటులోకి తెస్తున్నాం. హైదరాబాద్ ఎలక్ట్రిక్ వాహనాల రాజధానిగా అవతరించింది. 3,000 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీలో ప్రవేశపెడుతున్నాం. చైనా ప్లస్ వన్ అవసరాలు తీర్చే కేంద్రంగా దీన్ని అభివృద్ధి చేస్తాం. తెలంగాణ భూ పరివేష్టిత రాష్ట్రం. ఒక మెగా డ్రై పోర్టును ఏర్పాటు చేసి.. ఇక్కడి నుంచి ఏపీలోని సీ పోర్ట్‌కు అనుసంధానం ఉండేలా ప్రత్యేక రైలు, రోడ్డు రవాణా సదుపా యాలు అభివృద్ధి చేస్తాం." అని సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఏర్పాటు చేసిన బయో ఆసియా సదస్సు-2025ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి మంగళవారం ప్రోత్సహించాలనే దార్శనికతతో తమ ప్రభుత్వం పని చేస్తోందని రేవంత్ వివరించారు. రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ ఎకానమీ సామర్థ్యం గల స్టేట్‌గా మార్చాలనేదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఫార్మా రంగం అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తోందని వివరించారు. ఏఐ, క్వాంటమ్, రోబోటిక్స్ సాయంతో వైద్య రంగం రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. ఇక్కడి ఎకో సిస్టమ్ అంతర్జాతీయ కంపెనీలను ఆహ్వానిస్తోందని పేర్కొన్నారు. దేశంలోనే ఎక్కువ పెట్టుబడులు ఆకర్షించే రాష్ట్రంగా తెలంగాణ మారిందని గుర్తు చేశారు. "అత్యల్ప ద్రవ్యోల్బణం, అత్యధిక ఉద్యోగాల కల్పనకు రాష్ట్రం కేరాఫ్‌గా నిలిచింది. ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణ రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది. విభిన్న రంగాల్లో దాదాపు 50,000 ఉద్యోగాలు రానున్నాయి. గతేడాది లైఫ్ సైన్సెస్ రంగంలో రూ.40,000 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించాం. పారిశ్రామిక వేత్తలకు, పెట్టుబడి దారులకు తెలంగాణ రెడ్ కార్పెట్ పరుస్తోంది. చిన్న పరిశ్రమల నుంచి భారీ పరిశ్రమల వరకు అనేక రాయితీలను అందిస్తున్నాం. ఈ అవకాశాలను అందిపుచ్చుకుని రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టండి" అని సదస్సులో పాల్గొన్న ప్రతినిధులను సీఎం కోరారు.

మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధి కల్పనలో లైఫ్ సైన్సెస్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ప్రత్యక్షంగా 51వేల మందికి, పరోక్షంగా 1.5 లక్షల మంది ఉపాధి పొందుతున్నారని వివరించారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య, మానవ వనరులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని గుర్తు చేశారు. పరిశ్రమల ఏర్పాటు తోనే ఆగిపోకుండా వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న జనరిక్ మందులు, వ్యాక్సిన్లలో తెలంగాణ వాటా రోజురోజుకీ పెరుగుతోందని వ్యాఖ్యానించారు. దాదాపు 200కు పైగా దేశాలకు ఏటా ఐదు బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టి... రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డ్ 2025ను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రిసిషన్ హెల్త్ రీసెర్చ్ (ప్రిసైస్) సింగపూర్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొ. పాట్రిక్ టాన్‌కు బహూకరించారు.

ఈ కార్యక్రమంలో ప్రపంచ దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, దేశ, విదేశాలకు చెందిన సంస్థలతో పాటు ఆ రంగంలో నిపుణులు, నిష్ణాతులు, తెలంగాణ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

11 కంపెనీలతో ఒప్పందాలు

బయో ఆసియా సదస్సు మొదటి రోజు రాష్ట్ర ప్రభుత్వం 11 కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. గ్రాన్యూల్స్, ఆర్బిక్యులర్, ఐజాంట్, బయోలాజికల్ ఇ, విర్చో, విరూపాక్ష, జూబిలెంట్, విమ్టా, అరజెన్, భారత్ బయోటెక్, సాయి లైఫ్ సైన్సెస్‌లు తమ పెట్టుబడులను పెట్టేందుకు అంగీకరించారు. కాగా ఇప్పటికే గ్రీన్ ఫార్మా సిటీలో 6 కంపెనీలతో ఒప్పందాలు కుదిరాయి.

ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

- నేడు ప్రధాని మోడీతో భేటీ
- ఏఐసీసీ అగ్రనేతలతోనూ సమావేశం

వివరాలు 10లో

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై తలోదారి

ఐరాస భేటీలో బట్టబయలైన విభేదాలు 11లో





కిం కర్తవ్యం?

కెనడా వీసా ని'బంధనాల'తో భారతీయుల ఇబ్బందులు

వివరాలు 11లో

సర్వశక్తులూ ఒడ్డుతాం

టన్నెల్‌లో సహాయ చర్యలను పరిశీలించిన మంత్రులు | అధికారులు, ప్రతినిధులతో సమీక్షా సమావేశం

- ఆ ఎనిమిది మందిని కాపాడేందుకు అత్యున్నత పరిజ్ఞానం వినియోగం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- సహాయ చర్యలకు ఆటంకంగా నీటి ఊట, బురద
- 15 అడుగుల ఎత్తులో 200 మీటర్ల బురద
- కన్వేయర్ బెల్ట్ మరమ్మతులు పూర్తయితే వేగంగా బయటకు పంపింగ్
- టన్నెల్‌లో 11 కిలోమీటర్ల తర్వాత నీరు
- 11.5 కిలోమీటర్ల దూరం వరకు వెళ్లిన రక్షణ బృందాలు
- 13.50 కిలోమీటర్ల వద్ద టన్నెల్ బోరింగ్ మిషన్



నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి / అచ్చంపేట

ఎస్ఎల్‌బీసీ సొరంగం టన్నెల్ ప్రమాదంలో చిక్కుకుపోయిన ఎనిమిది మందిని సురక్షితంగా బయటకు తీసుకు రావడానికి సర్వశక్తులూ ఒడ్డుతామని మంత్రులు చెప్పారు. దేశంలో అందుబాటులో ఉన్న అత్యున్నత పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు అన్నారు. వారు మంగళవారం ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సహాయ కార్యక్రమాలను అంచనా వేశారు. అనంతరం మంత్రులు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ప్రాజెక్టు స్థలంలోని జేపీ కార్యాలయంలో అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ సహా సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ, సహాయ కార్యక్రమాల్లో పాల్గొం టున్న వివిధ ఏజెన్సీల ప్రతినిధులు సహాయ చర్యలపై వివరించారు.

అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రమాద స్థలంలో 40 నుంచి 50 మీటర్ల మేర బురద నిండుకుందని తెలిపారు. ఈ బురద నీటిని వెలికి తీయడానికి అన్ని ప్రయత్నాలూ చేస్తున్నామని వివరించారు. ఎడమ కాల్వ టన్నెల్‌లో ...10లో



అలుపెరుగని పోరాటం చేస్తా

ఉపాధ్యాయ అధ్యాపకుల సమస్యలు పరిష్కరిస్తా


- మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి: ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

రేపు (గురువారం) జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే.. శాసనమండలిలో మరోసారి ప్రశ్నించే గొంతుకనవుతానని వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హనుమకొండ జిల్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 మార్చి 22న జరిగిన ఎన్నికల్లో తనను గెలిపించారని, నాటి నుంచి నేటివరకు ఉపాధ్యాయుల, అధ్యాపకుల గొంతుకగా పనిచేశానని అన్నారు. రాష్ట్రంలో 30శాతం ఫిట్మెంట్‌తో పీఆర్‌సీ సాధనలో తన కృషి ఉందని గుర్తు చేశారు. ప్రమోషన్లు, గిరిజన సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేయించానని, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు 2020 పీఆర్సీ, లీవుల మంజూరు, బదిలీలు, తదితర సమస్యలను పరిష్కరించినట్టు చెప్పారు. కేజీబీవీ ఉపాధ్యాయులు, జూనియర్ లెక్చరర్స్, కాంట్రాక్ట్ లెక్చరర్లు, గెస్టు లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్టు తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు, నిరసనలు, దీక్షలు చేపట్టామని అన్నారు. 2023 డీఎస్సీ ఉపాధ్యాయులతో సహా సెప్టెంబర్ 2004 నుంచి ఉద్యోగాల్లోకి వచ్చిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేయించి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. మండల విద్యాధికారులు, ఉప విద్యాధికారులు, డైట్ లెక్చరర్స్, జూనియర్ లెక్చరర్స్ పోస్టులలో ప్రమోషన్స్ అమలు చేయించాలన్నారు. ఐదు రకాల గురుకులాల సమస్యలు, డిప్యూటీ వార్డెన్ పోస్టులను మంజూరు చేయాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు ...11లో

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

ఇండ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి



- ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేసేలా ఆరోగ్యకార్డులివ్వాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

వివరాలు 3లో

48 గంటల్లో ఏడుగురు రైతుల ఆత్మహత్య

టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులు



- సీఎం రేవంత్ ఢిల్లీ చక్కర్లు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ

వివరాలు 10లో


'రోజురోజుకీ ఖర్చులు పెరిగి పోతున్నాయి.. చాలీచాలని సంపాదనతో ఇంటిని ఎలా నడపాలో? భవిష్యత్ అవసరాల కోసం ఎలా పొదుపు చేయాలో అర్థం కావటం లేదు...' ప్రఖ్యాత బీమా సంస్థకు సంబంధించి ప్రతీరోజూ టీవీల్లో వచ్చే వ్యాపార ప్రకటనలో ఓ బాధితుడి ఆవేదన ఇది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి కూడా అచ్చం ఇలాగే ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, వాటికి వడ్డీలు ఒకవైపు.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, వాటికి నిధుల సర్దుబాటు మరోవైపు.. రాష్ట్రంపై కక్షగట్టినట్టుగా పైసా విదల్చని కేంద్రం తీరు ఇంకో వైపు... ఈ నేపథ్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకోసం ఆదాయాన్ని రాబట్టుకోవటం ఎలా? అన్నది రాష్ట్ర ప్రభుత్వానికి ఓ సవాలుగా మారింది వెరసి 'పైసా.. కైసా...?' అనే విధంగా పరిస్థితి తయారైంది. చాలినన్ని నిధుల్లేకపోవటం, బడ్జెట్‌లో వేసుకున్న ఆదాయ అంచనాలను చేరుకోలేకపోవటం తదితర కారణాల రీత్యా వివిధ శాఖలు, విభాగాలకు సంబంధించిన దస్త్రాలు... సంబంధిత డిపార్టుమెంట్ల నుంచి ఆర్థిక శాఖకు, అక్కడి నుంచి సీఎస్, సీఎం కార్యాలయాలకు వెళుతున్నాయి తప్ప నిర్ణీత సమయంలో పనులు కావటం లేదనే విమర్శలొస్తున్నాయి. వాటిని పరిష్కరించాలంటే నిధులు కావాలి కాబట్టి ఉన్నతాధికారులు నెలల తరబడి పెండింగ్‌లో పెడుతుండటం పరిపాటిగా మారింది.

పైసా.. కైసా...?

సర్కారుకు హామీల సవాళ్లు

ఆసరా సహా అనేక పథకాల కోసం జనం ఎదురుచూపులు

బి.వి.యన్.పద్మరాజు



'ఖజానా' కష్టాలతో కాలయాపన
ప్రధానమైన వాగ్దానాల అమలెప్పుడో?

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో అనేక తరగతులకు హామీలనిచ్చింది. వీటిలో ముఖ్యమైంది, ప్రజలు ఆశగా ఎదురు చూసేది 'ఆసరా' పింఛన్లు. రాష్ట్రంలో ప్రస్తుతం 15.25 లక్షల మంది వృద్ధులు, 15.26 లక్షల మంది వితంతువులు, 4.92 లక్షల మంది వికలాంగులు పింఛన్ పొందుతున్నారు. ఈ క్రమంలో 'ఆసరా' పథకం కింద వయో వృద్ధులకు నెలకు రూ.2,016, వితంతువులకు రూ.2,106, వికలాంగులకు రూ.4,016 పింఛన్ వస్తోంది. వీటన్నింటినీ రెట్టింపు చేస్తామంటూ కాంగ్రెస్ హామీనిచ్చింది. ఈ మూడు రకాల పింఛన్లకు కలిపి నెలకు సగటున రూ.వెయ్యి కోట్లు అవసరమవుతున్నాయి. అంటే ఏడాదికి పింఛన్ల కోసం రూ.12 వేల కోట్లను సర్కారు ఖర్చు చేస్తోందన్నమాట. వీటిని రెట్టింపు చేస్తే నెలకు అదనంగా మరో రూ.వెయ్యి కోట్లు, ఏడాదికి మరో రూ.12 వేల కోట్లను వెచ్చించాల్సి ఉంటుంది. ఆ రకంగా ఇప్పుడున్న పింఛన్లను రెట్టింపు చేయాలంటే ఏడాదికి రూ.24 వేల కోట్లను కేటాయించాలి. ప్రస్తుతానికి ఈ మొత్తాన్ని భరించే స్థితి లేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాగా బీఆర్ఎస్ హయాంలో 2022 ఆగస్టు నుంచి కొత్తగా ఆసరా పింఛన్లు ఇవ్వలేదు. అప్పటి నుంచి ఇప్పటిదాకా సుమారు 15 లక్షల మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిని వెరిఫికేషన్ చేసి, స్క్రూటినీ చేస్తే 12 లక్షల వరకూ అప్లికేషన్లు మిగులుతాయని అధికారులు భావిస్తున్నారు. ఇప్పుడున్న పింఛన్లకు అదనంగా వీటిని ఇవ్వాలనుకుంటే నెలకు అదనంగా రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకూ కావాల్సి ఉంటుందంటూ ఆర్థికశాఖ లెక్క లేసింది. ఈ మొత్తాన్ని ...11లో

హామీలు ప్రభుత్వం నెరవేర్చాలి...

ఇవేగాక మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం, 50 ఏండ్లు నిండిన జానపద కళాకారులకు నెలకు రూ.3 వేల పింఛన్, రేషన్ డీలర్లకు రూ.5 వేల గౌరవ వేతనం, మరణించిన జర్నలిస్టు కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం, మత బోధకులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.12 వేల గౌరవ వేతనం, వధువులకు (కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్) రూ.1.6 లక్షల ఆర్థిక సాయం తదితర ముఖ్యమైన హామీలను ప్రభుత్వం నెరవేర్చాల్సి ఉంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో సర్కారు వీటి జోలికే పోవటం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి 14 నెలలు పూర్తయింది. ఇప్పుడే కాసులకు 'కటకట'గా ఉంటే ముందు ఆర్థిక పరిస్థితి ఎలా ఉంటుందోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అన్ని బడుల్లో 'తెలుగు' తప్పనిసరి

- సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ పాఠశాలల్లో అమలు చేయాల్సిందే
- విద్యాశాఖ ఉత్తర్వులు



వివరాలు 11లో

ఆ 11 కుటుంబాలకే ఇండ్లు మంజూరు

ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోయడానికొచ్చిన అధికారుల అడ్డగింత

పట్టా పేపర్లు చించివేత
గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట లబ్దిదారుల ఆందోళన



నవతెలంగాణ-చివ్వెంల
సొంత గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పేరుతో పట్టాలిచ్చిన అధికారులు.. అందులో సగం మంది పేర్లే తుది జాబితాలో వచ్చాయని చెప్పడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టాలు పొందిన 28కుటుంబాల్లో 11 కుటుంబాలకు మాత్రమే ఇండ్లు మంజూరయ్యాయంటూ ముగ్గు పోయడానికి వచ్చిన అధికారులను మిగతా లబ్దిదారులు అడ్డుకున్నారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని భీమ్లాతండాలో జరిగింది. భీమ్లా తండా గ్రామంలో గ్రామసభ నిర్వహించి ఇందిరమ్మ ఇండ్లకు 28 మందిని అర్హులుగా గుర్తించారు. గత నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ పథకాల ప్రారంభ కార్యక్రమంలో భాగంగా వారికి ఇండ్ల పట్టాలు అందజేశారు. తుది జాబితాలో మాత్రం 11 మంది పేర్లే వచ్చాయి. ఈ క్రమంలో మంగళవారం తండాలో ధరావత్ ప్రమీల ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి శంకుస్థాపన చేయడానికి వచ్చిన అధికారులను గ్రామస్తులు నిలదీయడంతో వాగ్వాదం జరిగింది. గత నెల మండల ప్రత్యేక అధికారి జగదీశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా 28 మందికి పట్టాలు పంపిణీ చేసి.. నేడు తుది జాబితాలో 11 మందికి మాత్రమే ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయనడంతో.. పనికిరాని ఈ పట్టాలు మాకెందుకంటూ అధికారుల ముందే చింపేశారు. గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామ సిబ్బంది, మండల అధికారులు రాత్రి సమయంలో గుట్టు చప్పుడు కాకుండా సర్వే చేసి 11 మందిని మాత్రమే గుర్తించడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరగకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. చివరకు హౌసింగ్ ఏఈ రాంబాబు, ఎంపీవో దయాకర్, పంచాయతీ కార్యదర్శి గౌతమి, ఇతర అధికారులు వెనుదిరిగారు.



వికలాంగుడిని.. నా పేరు తొలగించారు: ధరావత్ రాజు

వికలాంగుడిని అని చూడకుండా జాబితా నుంచి నాపేరు తొలగించారు. నేను పుట్టుకతో నిరుపేద వికలాంగుడిని. జీవనోపాధి గడవని పరిస్థితి. కూడు గుడ్డకు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. గత నెలలో నాకు ఇల్లు వచ్చిందంటే చాలా ఆనందం వ్యక్తం చేశా. తుది జాబితాలో పేరు లేకపోవడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

మాటల్లో రక్షణ... చేతల్లో భక్షణ

రాజ్యాంగాన్ని పరిహసిస్తున్న కాంగ్రెస్ : మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజల హక్కులను హరించిందని మాజీ మంత్రి హరీశ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. మాటల్లోనే రాజ్యాంగ రక్షణ, చేతల్లో రాజ్యాంగ భక్షణ అన్న విధంగా పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశత్వానికి, మానవ హక్కుల ఉల్లంఘనలకు అద్దం పడుతున్నాయని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ రాజ్యం..పోలీసు రాజ్యమైందనీ, బీఆర్‌ఎస్ శ్రేణులపై అక్రమ కేసులు, వేధింపులు సర్వసాధారణమై పోయాయని పేర్కొన్నారు. కొందరు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. "గతంలో జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఇప్పుడు వనపర్తిలో చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.. బీఆర్‌ఎస్ నాయకులపై నిరాధారమైన కేసులు పెట్టటంలో చూపించే అత్యుత్సాహం, కాంగ్రెస్ నేతల అవినీతి, అక్రమాలపె ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాజ్యాంగం చేతిలో పట్టుకొని తిరిగే రాహుల్ గాంధీ, ఈడీ, సీబీఐ, ఐటీలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లో తాగునీటి కష్టాలు

హైదరాబాద్ తాగు నీటి కష్టాలపై హరీశ్ ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు."వేసవి రాకముందే బోర్లు ఎండిపోతున్నాయి, ప్రజలు భారీ మొత్తంలో డబ్బు వెచ్చించి వాటర్ ట్యాంకర్లను తెప్పించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇంతకుముందెప్పుడూ హైదరాబాద్‌లో ఇలాంటి తాగునీటి సంక్షోభం లేదు. సర్కార్ తగిన చర్యలు తీసుకోవాలి" అని హరీశ్ డిమాండ్ చేశారు.

సిరిసిల్ల కలెక్టర్‌పై చర్యలు తీసుకోండి

సీఎస్‌కు బీఆర్‌ఎస్ నేతల ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
సిరిసిల్ల కలెక్టర్ తీరుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి బీఆర్‌ఎస్ ఫిర్యాదు చేసింది. ఈ మేరకరా పార్టీ మండలి విపక్ష నేత మధుసూదనా చారి, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద సీఎస్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు సచివాలయం మీడియాపాయింట్ వద్ద విలేకర్లతో మాట్లాడుతూ సిరిసిల్లలో కేటీఆర్ పేరుతో ఓ వ్యక్తి టీ షాప్ నిర్వహిస్తున్నారనీ, అధికారులు ట్రేడ్ లైసెన్స్ లేదనే సాకుతో మూసేయడమే కాకుండా... వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కొంత మంది అధికారులు కాంగ్రెస్‌కు తొత్తులుగా వ్యవహరిస్తూ బీఆర్‌ఎస్ శ్రేణులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. సిరిసిల్ల కలెక్టర్‌తో పాటు అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని సీఎస్‌ను కోరినట్టు తెలిపారు. చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఘోర రోడ్డు ప్రమాదం

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి
మృతుల్లో తల్లి, కొడుకు, కోడలు
కన్నీరు మున్నీరవుతున్న చిన్నారులు

నవతెలంగాణ-మునిపల్లి
గుర్తు తెలియని ఓ వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఈ ఘోర రోడ్డు ప్రమాదం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని బుదేరాలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానిక ఎస్‌ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మునిపల్లి మండలంలోని అంతారం గ్రామానికి చెందిన పిచ్చుకుంట్ల రవి(36) అతని తల్లి లక్ష్మి(54), భార్య శోభ(28)తో కలిసి ముంబై హైవే రహదారిపై గల బుదేరా చౌరస్తాలోని ఫ్లై ఓవర్ పై వెళుండగా.. గుర్తు తెలియని వాహనం వారి బైక్‌ను ఢీకొట్టింది. దాంతో వారు ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడు రవికి ఇద్దరు కొడుకులు (చిన్నపిల్లలు) ఉన్నట్టు స్థానికులు తెలిపారు.

ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ వాయిదా

మార్చి 1 నుంచి ప్రారంభం : కన్వీనర్ డీన్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ వాయిదా పడింది. మంగళవారం సాయంత్రం 4.45 గంటల నుంచే ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కావాల్సిన విషయం తెలిసిందే.
ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఏప్రిల్ 29 నుంచి మే ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తారు. ఏప్రిల్ 29,30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు, మే రెండు నుంచి ఐదో తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు జరుగుతాయి. ఇతర వివరాల కోసం https://eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

పెండ్లి ఇష్టం లేక.. ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య


(ఫైల్)

నవతెలంగాణ-భువనగిరి
పెండ్లి ఇష్టం లేక ఏఆర్ కానిస్టేబుల్ మామిడాల అనూష (కీర్తి)(30) ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన యదాద్రి జిల్లా భువనగిరి పట్టణంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా కొహెడ మండలం వరూకోలు గ్రామానికి చెందిన అనుష 2020 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్. నాలుగేండ్లుగా భువనగిరిలో విధులు నిర్వహిస్తోంది. స్థానిక విద్యానగర్‌లో ఓ ఇంట్లో మరో మహిళా కానిస్టేబుల్‌తో కలిసి అనూష అద్దెకు ఉంది. ఈనెల 22వ తేదీన తన పుట్టిన రోజు వేడుకను సహచరులతో కలిసి చేసుకుంది. అయితే, కొహెడ మండలానికి చెందిన ఓ వ్యక్తితో ఈనెల 14న ఆమెకు నిశ్చితార్థం అయింది. కుటుంబీకులు మార్చి 6వ తేదీన వివాహం నిర్ణయించారు. కాగా తనకు ఆ పెండ్లి ఇష్టం లేకపోవడంతో అద్దెకు ఉన్న ఇంట్లోనే ఉరేసుకుంది. మృతురాలి తల్లిదండ్రులు మామిడాల పద్మ, లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ లక్ష్మినారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏండ్ల జైలు శిక్ష

తీర్పు వెలువరించిన రంగారెడ్డి జిల్లా కోర్టు



నవతెలంగాణ-కందుకూరు
బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితునికి 20 ఏండ్ల శిక్ష పడింది. నిందితుడికి శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని కందుకూరు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరు మండలం పులి మామిడి గ్రామానికి చెందిన తిమ్మగళ్ళ శ్రీనాథ్ ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ కేసులో అతనిపై క్రైమ్ నెంబర్ 236 / 2017 కేసులో కందుకూరు పోలీస్ స్టేషన్‌లో యూ/ఎస్ 376, 417 ఐపీసీ సెక్షన్ నెంబర్ 749/ 2018 ప్రకారం కేసు నమోదైంది. ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మంజులాదేవి వాదనలు వినిపించారు. ఇరువురి వాదనలు విన్న జడ్జి నిందితునికి శిక్ష విధించారు. 20 ఏండ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా, బాధితురాలికి రూ.3 లక్షల పరి హారం ఇవ్వాలని న్యాయమూర్తి తీర్పు నిచ్చారు.

కుక్కల దాడిలో 16 గొర్రెలు మృత్యువాత

పది గొర్రెలకు తీవ్ర గాయాలు
సిద్దిపేట జిల్లా ములుగులో ఘటన



నవతెలంగాణ-ములుగు
గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 16 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో 10 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ములుగు మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరి ఎక్కాల మల్లయ్య సోమవారం రాత్రి ఇంటి సమీపంలోని కొట్టంలో గొర్రెలను తోలాడు. అర్ధరాత్రి సమయంలో వీధి కుక్కలు గుంపుగా వచ్చి గొర్రెల మందపై దాడి చేశాయి. ఈ దాడిలో 16 గొర్రెలు మృత్యువాత పడగా.. 10 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం ఉదయం తెల్లవారుజామున కొట్టం వద్దకు వచ్చే సరికి గొర్రెలు మృత్యువాత పడి ఉండటం చూసి మల్లయ్య కన్నీటిపర్యం తమయ్యాడు. మిగతా 10 గొర్రెలు కూడా బతికే అవకాశం లేదని, సుమారు రూ.3.20 లక్షల వేలపైగానే నష్టం జరిగిందని వాపోయాడు. ప్రభుత్వం తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నాడు.







వామపక్షాలే ప్రత్యామ్నాయం

కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీఎంసీ దుష్పరిపాలనను ఎండగట్టాలి : ప్రకాశ్‌కరత్

(మొదటి పేజీ తరువాయి)

చెప్పుకుంటుంది. కానీ వాస్తవానికి వారు అదానీ, అంబానీల కోసం పని చేస్తున్నారు. ఈ రాష్ట్రానికి బీజేపీ వస్తే, ఈ కార్పొరేట్ శక్తి బెంగాల్‌ను దోచుకుంటుంది. రాష్ట్ర ప్రజలు వామపక్ష ప్రత్యామ్నాయ శక్తిని చూడాలనుకుంటున్నారని ఈ ర్యాలీ రుజువు చేస్తుంది" అని స్పష్టం చేశారు.

ప్రతి రోజూ ఒక పోరాటమే : ఎండీ సలీం

"ఈ ర్యాలీ సీపీఐ(ఎం) ఉనికిలో ఉందని, ఉంటుందని నిరూపిస్తోంది. కొన్ని ఎన్‌జీవోలు, మీడియా వామపక్షాలు తుడిచిపెట్టుకు పోయాయని ప్రచారం చేశాయి. కానీ అది ఎన్నటికీ జరగదు. జరగబోదు. ఎర్రజెండా అమరవీరుల రక్తంతో తయారు చేయబడింది. రైతులు, కార్మికులు, మహిళలు, దళితులు, గిరిజనులు, విద్యార్థులు, యువజనులు, మైనారిటీలు, ప్రతి ఒక్కరి కోసం పోరాటానికి సీపీఐ(ఎం) ఏర్పడింది" అని సీపీఐ(ఎం) పశ్చిమబెంగాల్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ సలీం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "బుద్ధదేవ్ భట్టాచార్య రాష్ట్ర ప్రజల ప్రతిభను ఉపయోగించి రాష్ట్రాన్ని నిర్మించాలనుకున్నారు. లెఫ్ట్ ఫ్రంట్ కాలంలో పాఠశాలలు నిర్మించారు. కానీ తృణమూల్ వాటిని కూల్చివేస్తోంది. బీజేపీ అభివృద్ధి అంటోంది. ఆర్జీకర్ కేసు కోల్‌కత్తా పోలీసులు, సీబీఐ దాని నిజ స్వరూపాన్ని బయటపెట్టింది. ఢిల్లీ, కోల్‌కత్తా నిజాన్ని వెల్లడించడానికి ఇష్టపడవు. ప్రతిదీ బహిర్గతం చేయాలని కోరుతున్నాం. మనం గత మూడేండ్లుగా ప్రజలను ఐక్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. కానీ వారు ప్రజలను విభజించాలనుకుంటున్నారు. అల్లర్లు చెలరేగుతున్నాయి. అల్లర్లు చేసిన వ్యక్తికి మోడీ పద్మశ్రీ ఇచ్చారు. ఈ రాష్ట్రంలో గూండాలకు, అల్లర్లకు చోటు ఉండకూడదని మేము చెబుతున్నాం. మతం, రాజకీయాలను వేరుగా ఉంచాలి" అని ఎండీ సలీం అన్నారు. "బంగ్లాదేశ్‌లో మతపరమైన మతతత్వ శక్తులు అధికారంలోకి వచ్చిన తరువాత మైనారిటీలు, ప్రతిపక్ష సభ్యులపై దాడులు జరుగుతున్నాయి. ఈ సంఘటనలు మన దేశంలో కూడా చూస్తున్నాం. బంగ్లాదేశ్‌లోని పేదల హక్కుల కోసం పోరాడుతున్న వారితో మేము నిలబడతాం. ఈ రాష్ట్రంలో మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా మనం పోరాడాలి. మన దేశం బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆర్‌ఎస్‌ఎస్ దేశం మొత్తాన్ని మత ప్రాతిపదికన విభజిస్తోంది. మమత బీజేపీతో కలిసి మనకు వ్యతిరేకంగా పోరాడతానని అంటోంది. ఈరోజు వారు కలిసి కూర్చున్నారు. ప్రతిరోజూ ఒక పోరాటం. సీపీఐ(ఎం)ను బలోపేతం చేయాలి. వామపక్ష ఐక్యతను నిర్మించాలి. మనం ప్రజలతో కలిసి ముందుకు సాగాలి. ప్రజలు మన వైపు వచ్చారు" అని పేర్కొన్నారు. ఈ బహిరంగ సభలో సీపీఐ(ఎం) నేతలు డెబ్లినా హెంబ్రామ్, మీనాక్షి ముఖర్జీ, దేబబ్రతా ఘోష్ తదితరులు మాట్లాడారు.





యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు తీసుకోవాలి

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న వలస కార్మికుల కోసం సీఐటీయూ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్‌–ఎల్‌బీసీ) టన్నెల్ చిక్కుకున్న ఎనిమిది మంది వలస కార్మికులను రక్షించడం కోసం యుద్ధ ప్రాతిపాదికన సహాయ చర్యలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సీఐటీయూ విజ్ఞప్తి చేసింది. అలాగే పని ప్రదేశంలో సరైన భద్రతా చర్యలు చేపట్టని నేరపూరిత నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేసింది.

ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. టన్నెల్ నిర్మాణంలో బురద, నీరు వెల్లువెత్తడం కొత్తకాదని, ఇది సాధారణంగా జరిగేదనని, వీటిని నివారించడానికి ముందగానే చర్యలు తీసుకుంటారని సీఐటీయూ తెలిపింది. అయితే తెలంగాణలోని దోమలపేటకు సమీపంలో ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ఘటనలో కార్మికులు లోపలికి ప్రవేశించిన 30 నిమిషాల్లోనే నీరు, బురద సొరంగంలో పేరుకుపోవడం కాంట్రాక్టర్‌కు సరైన ఇంజినీరింగ్ నైపుణ్యం లేకపోవడాన్ని వెల్లడిస్తుందని, ఇది కాంట్రాక్టర్, ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యమని సీఐటీయూ విమర్శించింది. ఈ నిర్లక్ష్యం వలన కార్మికుల జీవితాలను విషాదంలోకి నెట్టివేసిందని, వారి కుటుంబాలను కష్టాల్లోకి పడేసిందని సీఐటీయూ ఆవేదన వ్యక్తం చేసింది.

ఈ నిర్లక్ష్యంలో ప్రజా పనుల శాఖ, కార్మిక శాఖల పాత్ర సమానంగా ఉందని పేర్కొంది. చిక్కుకున్న కార్మికులు ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్), ఈఎస్ఐ పథకాల్లో ఉన్నారా లేదా అనే విషయాన్ని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ సమాధానం ఇవ్వాలని సీఐటీయూ తెలిపింది. కార్మికులకు సరైన పరిహారాన్ని ఇవ్వాలని కోరింది.

ప్రలోభాలకు ఎర

ఓటర్లకు నగదు పంపిణీ మొదలెట్టిన ఎమ్మెల్సీ అభ్యర్థులు

తాయిలాలను తిరస్కరించాలి: ఉపాధ్యాయులు, అధ్యాపకులకు టీఎస్‌యూటీఎఫ్ పిలుపు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగియడంతో కొందరు ఎమ్మెల్సీ అభ్యర్థులు ప్రలోభాలకు తెరతీశారని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఓటర్లకు నగదు పంపిణీ మొదలుపెట్టారని తెలిపింది. తాయిలాలను తిరస్కరించాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులకు పిలుపునిచ్చింది. ఈ మేరకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక ఎమ్మెల్సీ అభ్యర్థి పక్షాన గుర్తుతెలియని వ్యక్తులు రూ.రెండు వేలు ఫోన్ పే చేసి పూలు అని మెసేజ్ పంపారని వివరించారు. కొందరు ఓటర్లు వాటిని తిరస్కరించి వెనక్కి పంపారని తెలిపారు. మరో ప్రముఖ సంఘం (పీఆర్టీయూ) అభ్యర్థి పక్షాన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రూ.వెయ్యి, ఖమ్మంలో రూ.రెండు వేలు, మహబూబాబాద్ జిల్లాలో రూ.ఐదు వేలు పంపిణీ చేసినట్టు సమాచారమని పేర్కొన్నారు. అధికార పార్టీ అధికార ప్రతినిధి అని చెప్పుకునే అభ్యర్థి పక్షాన కొన్ని పాఠశాలల్లో ఓటరుకు రూ.రెండు వేల చొప్పున పంపిణీ చేసినట్టు తెలిసిందని వివరించారు. జాతీయ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థి ద్వారా ఇంటింటికీ రూ.రెండు వేల నుంచి ఐదు వేలు పంపిణీ చేస్తున్నట్టు సమాచారముందని తెలిపారు. పలువురు ఉపాధ్యాయులు నగదు తీసుకోకుండా తిరస్కరించారనీ, వారిని అభినందిస్తున్నామని పేర్కొన్నారు.పోటీలో ఉన్న ఎమ్మెల్సీ అభ్యర్థులు తాము దిగజారి ఉపాధ్యాయుల విలువను దిగజార్చడం పట్ల చావ రవి, ఎ వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు తాము చేసిన సేవలను వివరించి ఓట్లడగటం కాకుండా డబ్బు పంపిణీ చేసి గెలవాలనుకోవటాన్ని తీవ్రంగా ఖండించారు. ఎన్నికల కమిషన్ డబ్బు పంపిణీని అడ్డుకోవాలనీ, పంపిణీ చేసే ఎమ్మెల్సీ అభ్యర్థులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

గాజాలో ప్రతికూల వాతావరణంలో ఆరుగురు చిన్నారులు కన్నుమూత

- మానవతా సాయం అనుమతించనందువల్లనే ఈ పరిస్థితి
- ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో విధ్వంసకాండ, 85శాతం ప్రజలు నిర్వాసితులు



గాజా : గాజాలో నెలకొన్న అత్యంత శీతల వాతావరణం కారణంగా గత రాత్రి నవజాత శిశువుతో సహా ఆరుగురు చిన్నారులు మృతిచెందారు. వీరిలో ఐదుగురు గాజాలోని రీమల్ ప్రాంతంలోని ఆస్పత్రిలో మరణించారు. ఖాన్ యూనిస్ నగరంలో ఆరవ చిన్నారి కన్నుమూసిందని వైద్య వర్గాలు తెలిపాయి. కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా స్వస్థలాలకు తిరిగివచ్చిన వేలాదిమంది పాలస్తీనియన్లు శిధిలమైన తమ ఇళ్ళ వద్దనే రాళ్ళు రప్పల్లో తాత్కాలికంగా వేసుకున్న శిబిరాల్లో నివసిస్తున్నారు. అయితే బలంగా వీచే గాలులు, భారీ వర్షాలతో ఆ శిబిరాలు నివాస యోగ్యంగా వుండడం లేదు. పైగా పాలస్తీనా భూభాగంలోకి శిబిరాలను, మొబైల్ ఇళ్లను రానివ్వకుండా ఇజ్రాయిల్ కట్టుదిట్టం చేస్తుండడంతో పరిస్థితులు మరింత దారుణంగా తయారయ్యాయి. మరోవైపు ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో కూడా గాజాలో ఉపయోగించిన యుద్ధ ఎత్తుగడలనే ఇజ్రాయిల్ అమలు చేస్తోందని పాలస్తీనియన్లు వాపోతున్నారు. ఇజ్రాయిల్ ఆంక్షల కారణంగా గాజాలో మానవతా సంక్షోభం పెచ్చరిల్లుతోందని విమర్శిస్తున్నారు. ఇదిలావుండగా ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ దాడుల ప్రభావం పట్ల ప్రపంచ ఆరోగ్య సంస్థ తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తోంది. డబ్ల్యుహెచ్‌ఓ ప్రతినిధి రిక్ పీపర్‌కార్న్ విలేకర్లతో మాట్లాడుతూ వెస్ట్ బ్యాంక్‌లో ఆరోగ్య సంరక్షణ అనేది తీవ్రమైన ముప్పులో పడిందని చెప్పారు. ఈ ఏడాది ఈ రెండు నెలల కాలంలో 44 దాడులు జరిగాయని తెలిపారు. నాలుగు ఆస్పత్రులు దెబ్బతిన్నా యన్నారు. అంబులెన్సు కోసం వేచి చూస్తూ నలుగురు రోగులు మరణించారు. అలాగే రోగుల కోసం వెళ్ళే ప్రయత్నంలో 8మంది ఆరోగ్య సంరక్షనా కార్మికులు గాయపడ్డారని తెలిపారు. వెస్ట్ బ్యాంక్ అంతటా రాకపోకలపై తీవ్రమైన ఆంక్షలు వున్నాయని డబ్ల్యుహెచ్‌ఓ తెలిపింది. దీనివల్ల అంబులెన్సులు, ఆరోగ్య కార్మికులు రాకపోకలు కూడా ప్రభావితమయ్యాయని పేర్కొంది. ఉత్తర వెస్ట్ బ్యాంక్‌లో తుల్కారెమ్ శరణార్థ శిబిరంలో ఇజ్రాయిల్ ఆర్మీ దాడుల కారణంగా 12వేల మంది ఇండ్ల నుంచి పారిపోయారని స్థానిక అధికారులు తెలిపారు. తుపాకీతో బెదిరించి అక్కడున్న వారిని ఇండ్లనుంచి తరిమేశారని డిప్యూటీ గవర్నర్ ఫైజల్ తెలిపారు. ఇండ్లు, వీధులు, శిబిరాల్లోని అన్ని సదుపాయాలను సైనికులు విధ్వంసం చేస్తున్నారని ఆయన తెలిపారు. వందకు పైగా అపార్ట్‌మెంట్లు గల 40భవనాలను గత నెల రోజుల కాలంలో ధ్వంసం చేశారు. శిబిరంలోని పది ఇండ్లను తగలబెట్టారు, దాదాపు 300 దుకాణాలను కూల్చివేశారని ఆయన తెలిపారు. దాదాపు 85శాతం మంది ప్రజలను నిర్వాసితులను చేశారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించకుండా ఇజ్రాయిల్‌ను నిలువరించేందుకు మధ్యవర్తులు తక్షణమే చర్యలు తీసుకోవాలని హమాస్ డిమాండ్ చేసింది.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

ఇండ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి

ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేసేలా ఆరోగ్యకార్డులివ్వాలి

సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి వారు కృషి చేస్తు న్నారని తెలిపారు. వారికి ఇండ్ల స్థలాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం ఆయన లేఖ రాశారు. జర్న లిస్టులు చాలీచాలని వేతనాలతో జీవితాలను అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరముందని సూచించారు. అనేక ఉద్యమాల్లో పాత్రికేయుల పాత్ర మరువలేనిదని గుర్తు చేశారు. గత పదేండ్లుగా వివిధ కారణాలతో దాదాపు 500 మందికి పైగా జర్నలిస్టులు మరణించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది జనవరిలో సంగారెడ్డిలో జరిగిన సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించామని తెలిపారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తెస్తున్నామనీ, వాటిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల సమస్యలు

ఇండ్లస్థలాలు

ఈ సమస్య గత నాలుగు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉంది. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పుతో సమస్య మరింత జఠిలమైంది. ప్రభుత్వాలు మారుతున్నాయి గానీ జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు మాత్రం రావడం లేదు. జర్నలిస్టులకు వెంటనే ఇండ్లస్థలాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

పెన్షన్ పథకం

రిటైరైన జర్నలిస్టులకు కేరళ, తమిళనాడు సహా ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్టుగా పెన్షన్ పథకం ప్రవేశపెట్టాలి.

అక్రిడిటేషన్లు


ప్రతి రెండేండ్లకోసారి ఇవ్వాల్సిన అక్రిడిటేషన్లు ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ కొత్త కార్డులను ఇవ్వలేదు. ఉన్న వాటినే ప్రతి మూడు నెలలకోసారి గడువును పొడిగిస్తున్నారు. అర్హులైన జర్నలిస్టు లందరికీ అక్రిడిటేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలి.

హెల్త్ కార్డులు

రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో, నిమ్స్‌లో తప్ప ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులు జర్నలిస్టుల ఆరోగ్య కార్డుల ద్వారా సేవలను అందించడం లేదు. నిమ్స్‌లో కూడా మందులు బయట నుంచి తెచ్చుకోవాల్సి వస్తున్నది. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టు ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెట్టాలి. వెల్‌నెస్ సెంటర్లను బలోపేతం చేయాలి.

మహిళా జర్నలిస్టులు

మీడియాలో మహిళా జర్నలిస్టుల సంఖ్య పెరుగుతున్నది. పత్రికా, ఎలక్ట్రానిక్, ఇతర సంస్థల్లో వారికి తగు సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని మీడియా సంస్థలను ప్రభుత్వం ఆదేశించాలి.



వేజ్‌బోర్డు, ఉద్యోగ భద్రత

జర్నలిస్టులకు తగిన ఉద్యోగ భద్రత లేదు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. మండల, జోన్ విలేకర్ల పరిస్థితి మరీ దారుణం. మీడియా సంస్థల్లో వేజ్ బోర్డు అమలుకావడం లేదు. జర్నలిస్టులకు కనీస వేతనాలను ఇవ్వడం లేదు. జస్టిస్ గురుభక్షి మజీథియా కమిటీ చేసిన సిఫారసుల మేరకు ఒక ఐఏఎస్ అధికారిని నియమించి అవి అమలయ్యేలా చూడాలి.

ప్రత్యేక రక్షణ చట్టం

జర్నలిస్టులపై భౌతిక దాడులు జరుగుతున్నాయి. జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం ఉద్యోగుల తరహాలో తేవాలి. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రెస్ కౌన్సిల్ ఉన్నా దాన్ని మోడీ సర్కారు తన రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నది. తమిళనాడు, కర్నాటక తదితర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న చట్టాన్ని అధ్యయనం చేసి రాష్ట్రంలో ప్రత్యేక చట్టాన్ని తేవాలి.

మీడియా కమిషన్

రాష్ట్రంలోని మీడియాలో నెలకొన్న పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేయడానికి సీనియర్ ఉన్నతాధికారులు, మేధావులు, జర్నలిస్టులతో కమిషన్ వేసి సమస్యలను గుర్తించాలి. ఆ కమిషన్ సిఫారసు మేరకు జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

మీడియా అకాడమీ

తెలంగాణ అకాడమీ చేపడుతున్న స్వల్ప సంక్షేమ పథకాలు సరిపోవు. జర్నలిస్టులకు శిక్షణా తరగతులను నిర్వహించాలి. చనిపోయిన జర్నలిస్టులకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. జర్నలిస్టు బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలి.



ఉద్రిక్తతలకు మరింత ఊతం

యూసీసీపై గుజరాత్‌లో ఆందోళన

అహ్మదాబాద్ : ఉమ్మడి పౌరస్మృతిపై (యూసీసీ) చర్చించి ముసాయిదాను రూపొందించేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు గుజరాత్ ప్రభుత్వం ప్రకటించింది. యూసీసీని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలిచిన విషయం తెలిసిందే. ఉన్నత స్థాయి కమిటీకి నేతృత్వం వహించేందుకు ఉత్తరాఖండ్‌లో యూసీసీ బిల్లును రూపొందించడంలో కీలక పాత్ర పోషించిన సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి రంజనా దేశాయ్‌ని గుజరాత్ ప్రభుత్వం ఎంపిక చేసింది. నివేదికను సమర్పించేందుకు కమిటీకి 45 రోజుల సమయం ఇచ్చారు. కాగా రాష్ట్రంలో యూసీసీ అమలుపై సామాజిక కార్యకర్తలు, పౌర సమాజ నేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. అసలే మతపరమైన ఉద్రిక్తతలతో అట్టుడికిపోయే గుజరాత్‌లో యూసీసీ అమలుతో ఘర్షణలు మరింత పెచ్చరిల్లుతాయని పలువురు సామాజిక కార్యకర్తలు, స్థానికులు, మేధావులు ఆందోళన వ్యక్తం చేశారు. భారత ప్రజాస్వామిక స్వభావాన్ని యూసీసీ విచ్ఛిన్నం చేస్తుందని సామాజిక, సాంస్కృతిక కార్యకర్త హిరేన్ గాంధీ చెప్పారు. 'గుజరాత్ ఇప్పటికే పూర్తిగా ఫాసిస్టుల లేబొరేటరీగా మారిపోయింది. 1980వ దశకం నుండి ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తున్నారు. 1980ల నుండే రాష్ట్రంలో యూసీసీ మూలాలు కన్పిస్తున్నాయి. అప్పటి నుండి అది బీజేపీ అజెండాలోనే ఉంది' అని ఆయన అన్నారు. యూసీసీ అమలుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను గుజరాత్‌లోని పలు మితవాద సంస్థలు ఇప్పటికే సమర్థిస్తున్నాయి. మైనారిటీలు మాత్రం తమ మతపరమైన గుర్తింపును కోల్పోతామని, హక్కులకు భంగం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. కాగా ఇది ఉమ్మడి పౌరస్మృతి కాదని, లక్షిత పౌరస్మృతి అని మైనారిటీ సమన్వయ కమిటీ కన్వీనర్ ముజాహిద్ నఫీస్ వ్యాఖ్యానించారు.

ఉత్తరాఖండ్‌లో యూసీసీ అమలులోకి వచ్చిన రెండు వారాలకే ప్రభుత్వానికి అనేక సవాళ్లు ఎదురయ్యాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా పౌరులు అందించే వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని, తృతీయ పక్షానికి అందుబాటులో ఉంచబోమని ప్రభుత్వం నచ్చచెబుతోంది. గుజరాత్‌లో ప్రజల్లో భయాందోళనలు ఇంకా ఎక్కువగానే ఉన్నాయి. చట్టాలను ఆయుధాలుగా చేసుకొని ముస్లిం సమాజాన్ని ప్రాసిక్యూట్ చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాల్లో యూసీసీ కూడా భాగమేనని పీయూసీఎల్ సభ్యుడు ప్రసాద్ చాకో విమర్శించారు. ముస్లింల ప్రాబల్యాన్ని తగ్గించే దిశగా చట్టాలను రూపొందిస్తున్నారని, విద్వేష ప్రసంగాలు, వ్యాఖ్యలతో కించపరుస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇలాంటి తరుణంలో యూసీసీ అవసరం ఉన్నదా అని ప్రశ్నించారు.

సంపాదకీయం

'రక్తహీనత ముక్త్‌భారత్‌' ఇంకెప్పుడు?

గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉంటేనే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారు. అప్పుడే మన భావి భారతం ఆరోగ్యంగా ఎదుగుతుంది. ఇది ఎవ్వరూ కాదనలేని సత్యం. కానీ మన దేశంలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నం. దేశంలో 15 నుంచి 49 ఏండ్ల లోపు గర్భిణుల్లో సగానికన్నా ఎక్కువ మంది రక్తహీనతతో బాధపడుతున్నారని తాజా లెక్కలు చెబుతున్నాయి. ఇవేవో ప్రయివేటు సంస్థలు చెప్పిన లెక్కలనుకుంటే పప్పులో కాలేసినట్టే. స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ఇటీవల ప్రకటించిన పచ్చినిజాలు. అయిదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (2019-21) ప్రకారం మన దేశంలో గర్భం ధరించిన మహిళల స్థితి పై విధంగా ఉంది. అంతేకాదు రాష్ట్రాల వారీగా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల శాతాన్ని కూడా ఈ నివేదిక బయటపెట్టింది. వీటిలో గుజరాత్, త్రిపుర వంటి బీజేపీ పాలిత రాష్ట్రాలే అగ్రభాగాన ఉండటం గమనార్హం.

ఇక తెలంగాణలోనూ మహిళల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటోందని అనేక లెక్కల సారాంశం. 15 నుంచి 45 ఏండ్లుగల మహిళలు మన రాష్ట్రంలో 57.6 శాతం ఉండగా, వీరిలో అత్యధిక శాతం పౌష్టికాహార లోపం వల్ల రక్తహీనతతో బాధపడుతున్నారని తేలింది. నిజానికి 2014-15తో పోల్చితే 2018-19లో సమస్య మరింత పెరిగింది. దీన్ని బట్టి సమస్య ఎంత తీవ్రంగా ఉందో, బీజేపీ తీసుకొచ్చిన రక్తహీనత ముక్త్‌భారత్ ఏ మేరకు పని చేస్తుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.

బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశం నుంచి రక్తహీత సమస్యను తరిమేస్తామంటూ 2018లో 'రక్తహీనత ముక్త్‌భారత్' (రక్తహీనత రహిత భారతం) అనే విధానాన్ని ఎంతో గొప్పగా ప్రవేశపెట్టింది. ఇది అమల్లోకి వచ్చి ఏడేండ్లు గడుస్తున్నా ఫలితాల్లో పెద్దగా తేడాలు కనిపించడం లేదని తాజా సర్వేలే చెబుతున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్యసర్వే 5 ప్రకారం కూడా మహిళలు, కౌమార దశలో ఉన్న బాలికల్లో, గర్భిణుల్లో రక్తహీనత ఎక్కువగా ఉందని తేలింది. నిజానికి రక్తహీనత ముక్త్‌భారత్ అన్న సంకల్పంతో మొత్తం ఆరు లక్ష్యాలతో నివారణ మార్గాలను కేంద్రం సూచించింది. ఆ మేరకు ఆహార విధానం, వైద్య చికిత్స, ఐరన్ లోపాన్ని నివారించడం, తీవ్రమైన రక్తహీనత ఉన్న గర్భిణులను గుర్తించి వారికి తగిన చికిత్స అందించడం, దీని కోసం మెడికల్ ఆఫీసర్లకు, ఫ్రంట్‌లైన్ వర్కర్లకు శిక్షణ ఇవ్వడం వంటి విధానాలను ఎంతో ఆర్భాటంగా తీసుకొచ్చింది. కానీ ఇవేవీ ఆచరణలో మాత్రం కనిపించడం లేదు.



మన తెలుగు రాష్ట్రాల్లో కూడా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతూనే ఉంది. ఇక తెలంగాణలోనూ మహిళల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటోందని అనేక లెక్కల సారాంశం. 15 నుంచి 45 ఏండ్లుగల మహిళలు మన రాష్ట్రంలో 57.6 శాతం ఉండగా, వీరిలో అత్యధిక శాతం పౌష్టికాహార లోపం వల్ల రక్తహీనతతో బాధపడుతున్నారని తేలింది. నిజానికి 2014-15తో పోల్చితే 2018-19లో సమస్య మరింత పెరిగింది. దీన్ని బట్టి సమస్య ఎంత తీవ్రంగా ఉందో, బీజేపీ తీసుకొచ్చిన రక్తహీనత ముక్త్‌భారత్ ఏ మేరకు పని చేస్తుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.

గర్భిణి దశలో పోషకాహారం తీసుకోక పోవడం వల్ల తల్లీబిడ్డలపై దుష్ప్రభావం చూపుతోందని ఎన్నో నివేదికలు చెబుతున్నాయి. నాడీ సంబంధిత సమస్యలు, తక్కువ బరువు, నెలలు నిండకుండా పిల్లలు పుట్టడం, మృతశిశువు జన్మించడం వంటి సమస్యలకు గర్భిణులు ఎదుర్కొంటున్న రక్తహీనతే ప్రధాన కారణం. రాష్ట్రంలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లోని గర్భిణులకు పౌష్టికాహార సరుకులు అందడం గగనంగా మారిపోయిందనేది ఎవ్వరూ కాదనలేని వాస్తవం. ప్రభుత్వాలు ఏండ్లుగా ఎన్ని విధానాలు తీసుకొచ్చినా రక్తహీనతను నివారించలేకపోతున్నాయి. పైగా నేడు మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా గర్భిణుల ఆరోగ్యం మరింత అధ్వాన్నంగా తయారవుతోంది.

దేశంలోని పెద్ద రాష్ట్రాల కేటగిరిలో అత్యధికంగా పశ్చిమబెంగాల్‌లో 71.7 శాతం మంది రక్తహీనత బాధితులు నమోదయ్యారు. ఈ దుస్థితికి పౌష్టికాహార లోపమే ప్రధాన కారణమనేది నిపుణుల మాట. అలాగే ప్రసవ సమయంలో అధిక రక్తస్రావమైనప్పుడు రక్తహీనత ప్రాణాంతకంగా కూడా మారుతోంది. బాలింత మరణాలకు దాదాపు 70 శాతం ఇదే ప్రధాన కారణం. వీటికి తోడు విటమిన్ బి12, ఫోలేట్, ఎ విటమిన్ లోపాలు, వాయు కాలుష్యం కూడా తోడై సమస్యను మరింత జఠిలం చేస్తున్నదని నిపుణులు చెబుతున్నారు. కనుక పాలకులు సమస్య పరిష్కారం కోసం ఈ వైపుగా కూడా తక్షణం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

సమస్య మూలాల్లోకి వెళ్లకుండా పరిష్కరించడం సాధ్యంకాదు. ఆరోగ్య భారతం నిర్మితమవ్వాలంటే గర్భిణులకు పౌష్టికాహారం అందుబాటులో ఉండాలి. రక్తహీనతకు గురికాకుండా వారు ఆరోగ్యంగా ఉండేలా చూడాలి. ఇది ప్రభుత్వాల కనీస బాధ్యత. దేశంలో మహిళల ఆరోగ్యాన్ని, భావిభారతాన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా గర్భిణుల్లో రక్తహీనత సమస్యను పరిష్కరించాలి. అభివృద్ధిని ప్రజల అవసరాలు తీర్చడంలో, వారి జీవన ప్రమాణాలను పెం పొందించే విధంగా చూడాలి. తాజా నివేదికలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో తక్షణ చర్యలు చేపట్టాలి.

ఐరాసలో ఉక్రెయిన్ తీర్మానాలు - వివాదాస్పదమవుతున్న ట్రంప్ నిర్ణయాలు!



ఎం కోటేశ్వరరావు
8331013288

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన రెండవ పదవీ కాలం తొలి నెల రోజుల్లో చేసిన ప్రకటనలు, తీసుకున్న నిర్ణయాల పరిణామాలు, పర్యవసానాల గురించి పరిపరి కథనాలు వెలువడుతున్నాయి. నిజంగా ఏం జరిగేది ఎవరూ చెప్పలేని స్థితి. రష్యాను దగ్గరకు తీసుకొని చైనాకు వ్యతిరేకంగా నిలపాలనే ఎత్తుగడతో అమెరికా ఉందని చెబుతున్నారు. సోమవారం నాడు ఐరాసలో జరిగిన పరిణామాలు ఆసక్తి కలిగిస్తున్నాయి.తమపై నాలుగో ఏడాదిలో ప్రవేశించిన రష్యా సైనిక చర్యలను ఖండిస్తూ దాడులు నిలిపివేయాలని ఐరాస సాధారణ అసెంబ్లీలో ఉక్రెయిన్ సోమవారం నాడు ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. దానికి అనుకూలంగా 93, వ్యతిరేకంగా 18 దేశాలు ఓటు చేయగా, భారత్, చైనాతో సహా 65 దేశాలు తటస్థంగా ఉన్నాయి. గతంలో 140దేశాలు రష్యా చర్యను ఖండించే తీర్మానానికి మద్దతు ఇవ్వగా ఈసారి 93కు తగ్గాయి. ఉక్రెయిన్ తన తీర్మానాన్ని వెనక్కు తీసుకుని " త్వరగా సంక్షోభాన్ని ముగించాలని " తాను ప్రతిపాదించిన దానికి మద్దతు ఇవ్వాలని అమెరికా ఒత్తిడి చేసింది. మరోవైపున రష్యా మీద ఎలాంటి విమర్శ చేయకుండా సంక్షోభాన్ని ముగించాలని కోరుతూ భద్రతా మండలిలో అమెరికా ప్రవేశపెట్టిన తీర్మానానికి మద్దతుగా పది ఓట్లు రాగా ఐదుదేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. వాటిలో వీటో హక్కు కలిగిన బ్రిటన్, ఫ్రాన్సు కూడా ఉండటం విశేషం.

తమకు నాటో సభ్యత్వమిస్తే పదవి నుంచి వైదొలగటానికి కూడా సిద్ధమే అని, తమ ప్రాంతాలను ఆక్రమించిన పుతిన్ అక్కడే తిష్టవేయటాన్ని అంగీకరించేది లేదని జెలెన్‌స్కీ అంతకుముందు చెప్పాడు. తాము చేసిన ప్రతి డాలరు మిలిటరీ సాయానికి రెండు డాలర్లు చెల్లించాలని అమెరికా డిమాండ్ చేస్తోందన్నాడు. ఐదువందల బిలియన్ డాలర్ల ఖనిజాలను అప్పగించాలన్న వాషింగ్టన్ ఒత్తిడికి లొంగేది లేదని కూడా చెప్పాడు, అవసరమైతే వచ్చే పదితరాల వారు తమ రుణాలను తీర్చుకుంటారని అన్నాడు. విలువైన ఉక్రెయిన్ ఖనిజాల్లో 350 బిలియన్ డాలర్ల విలువ గలవి రష్యా అధీన ప్రాంతాల్లోనే ఉన్నాయని ఉపప్రధాని యులియా చెప్పాడు. ఉక్రెయిన్‌కు మద్దతు తెలిపేందుకు సోమవారం నాడు అనేక మంది ఐరోపా నేతలు కీవ్ చేరుకున్నారు. ఉక్రెయిన్‌పై ఒక నిర్ణయం తీసుకొనేందుకు, ఐరోపా రక్షణ గురించి చర్చించేందుకు మార్చి నెల ఆరోతేదీన సమావేశం కానున్నారు. రానున్న రెండు వారాల్లో రెండవసారి సమావేశమయ్యేందుకు అమెరికా, రష్యా ప్రతినిధులు సన్నద్ధమవుతున్నారు. తప్పుడు సమాచార బుడగలో ట్రంప్ ఇరుక్కు పోయాడని అన్న జెలెన్‌స్కీని నియంత అని ట్రంప్ వర్ణించటాన్ని అర్థం చేసుకోదగినదే అని రష్యా సమర్థించింది.

రష్యాను దగ్గరకు తీసుకొని చైనాకు వ్యతిరేకంగా నిలపాలని నిజంగా ట్రంప్ భావిస్తే అది ఇప్పటికైతే ఊహాజనితమే. ఒకవేళ అదే జరిగితే ఇప్పటికే మరోవైపు ఉన్న భారత్, మూడో వైపు ఉన్న జపాన్‌తో కథ నడిపించి చైనాను దెబ్బ తీయా లన్న వ్యూహం ఉందన్నది ఒక దృశ్యం. ఇది కార్యరూపం దాలిస్తే ఐరోపాలో అమెరికా ప్రాబల్యం తగ్గి చైనా పలుకుబడి పెరుగుతుందని మరికొందరి హెచ్చరిక. ఉక్రెయిన్‌ను ఫణంగా పెట్టి రష్యాతో ఒప్పందం కుదుర్చుకుంటే ప్రపంచంలో అమెరికాను నమ్మే పరిస్థితి ఉంటుందా? ట్రంప్‌ను నమ్మి రష్యా ముందుకు పోతుందా అన్నది ప్రశ్న. గతంలో ఇదే అమెరికన్లు జి7 కూటమిని జి8గా మార్చి రష్యాను చేర్చుకొనేందుకు చూశారు. అది బెడిసికొట్టడంతో రష్యాను వ్యతిరేకించటమే గాదు, దానికి ముప్పు తెచ్చేందుకు చూశారు. ఉక్రెయిన్ సంక్షోభానికి కారణం అదే కదా!

రష్యాను దగ్గరకు తీసుకొని చైనాకు వ్యతిరేకంగా నిలపాలని నిజంగా ట్రంప్ భావిస్తే అది ఇప్పటికైతే ఊహాజనితమే. ఒకవేళ అదే జరిగితే ఇప్పటికే మరోవైపు ఉన్న భారత్, మూడో వైపు ఉన్న జపాన్‌తో కథ నడిపించి చైనాను దెబ్బ తీయా లన్న వ్యూహం ఉందన్నది ఒక దృశ్యం. ఇది కార్యరూపం దాలిస్తే ఐరోపాలో అమెరికా ప్రాబల్యం తగ్గి చైనా పలుకుబడి పెరుగుతుందని మరికొందరి హెచ్చరిక. ఉక్రెయిన్‌ను ఫణంగా పెట్టి రష్యాతో ఒప్పందం కుదుర్చుకుంటే ప్రపంచంలో అమెరికాను నమ్మే పరిస్థితి ఉంటుందా? ట్రంప్‌ను నమ్మి రష్యా ముందుకు పోతుందా అన్నది ప్రశ్న. గతంలో ఇదే అమెరికన్లు జి7 కూటమిని జి8గా మార్చి రష్యాను చేర్చుకొనేందుకు చూశారు. అది బెడిసికొట్టడంతో రష్యాను వ్యతిరేకించటమే గాదు, దానికి ముప్పు తెచ్చేందుకు చూశారు. ఉక్రెయిన్ సంక్షో భానికి కారణం అదేకదా! గడచిన మూడేండ్లుగా ఆంక్షలతో ఆర్థికంగా దెబ్బతీసేందుకు చూసిన తీరు, ఉక్రెయిన్ పోరులో సంభవించినట్లు చెబుతున్న ప్రాణ, ఆర్థిక నష్టాలను మరచి రష్యన్లు కొత్త బాటలో నడు స్తారా? కష్ట సమయంలో ఆదుకున్న చైనాకు వ్యతిరేకంగా జట్టు కడుతుందా? పుతిన్ లేదా పాలకవర్గం లొంగిపోయినా జనం సమ్మతిస్తారా ? అమెరికాయే చేతగాక బేరసారాలకు దిగుతుంటే రష్యన్లు చైనాను కట్టడి చేయగలరా? ఇలాంటి అనేక ఊహాజనిత దృశ్యాలను కొందరు ఆవిష్కరిస్తున్నారు.



చరిత్రను చూస్తే నాటి సోవియట్-చైనా కమ్యూనిస్టు పార్టీల మధ్య తలెత్తిన సైద్ధాంతిక వివాదాలు, దేశాల మధ్య విబేధాలకు దారితీశాయి.1969లో ఆరు నెలలకు పైగా సరిహద్దులో ఇరు సైన్యాలను మోహరించటమే గాదు, స్వల్ప ఘర్షణలు కూడా చోటుచేసుకున్నాయి. దాన్ని వినియోగించుకొని సోవియట్‌ను దెబ్బతీసేందుకు అమెరికన్లు ప్రజా చైనాను గుర్తించి భద్రతా మండలిలో ప్రాతినిధ్యానికి అంగీకరించారన్నది ఒక అభిప్రాయం. తమ సమస్యల నుంచి బయటపడేందుకు విదేశాలకు మార్కెట్‌ను తెరిచే సంస్కరణలు అవసరమని చైనా కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించింది. ఈ అవకాశాన్ని అక్కడ ఉన్న విస్తారమైన శ్రమశక్తిని కారుచౌకగా పొందేందుకు, మార్కెట్లో ప్రవేశించేందుకు అమెరికా విని యోగించుకుందన్నది మరొక సూత్రీకరణ. అంతిమంగా నాలుగు దశాబ్దాల అనుభవంలో ఎవరు ఎవరిని వినియోగించుకున్నారని బేరీజు వేస్తే ఎగుమతులతో చైనా దిగుమతులతో అమెరికా, ఐరోపా లబ్ధిపొందాయి. కొన్ని లాటిన్ అమెరికా దేశాలు ఎగుమతి ఆధారిత వ్యవస్థలతో కొనసాగిన మాదిరి చైనా కూడా అలాగే ఉంటుందని భావించిన అమెరికా ఘోరంగా దెబ్బతిన్నది. అన్ని రంగాలలో తననే సవాలు చేసే విధంగా మారుతుందని అది అంచనా వేయ లేక పోయింది, గుర్తించేసరికే తమ చేతులు దాటిపోయినట్లు గమనించింది. దాని పర్యవసానమే డోనాల్డ్ ట్రంప్ తొలి పాలనా కాలంలో ప్రారంభించిన వాణిజ్య యుద్ధం. ఇప్పుడు దాని కొనసాగింపుతో మరోసారి ముందుకు పోనున్నట్లు సూచనలు.

చైనా గురించి మరోసారి అమెరికా అంచనాలు తప్పనున్నాయా? అట్లాంటిక్ పత్రిక వ్యాఖ్యాత కథనం చైనాకు ప్రపంచాన్ని అప్పగించనున్న ట్రంప్ అంటూ సాగింది. ఇది సామ్రాజ్యవాదుల కోణంలో ఆలోచిస్తున్నవారి బుర్రలో పుట్టిన బుద్ధి అని చెప్పవచ్చు." అమెరికా ప్రపంచ నాయకత్వం ముగుస్తున్నది. ఇది అమెరికా దిగజారి లేదా బహుధ్రువ ప్రపంచం ఉనికిలోకి వచ్చికాదు లేదా అమెరికా ప్రత్యర్థుల చర్యలతో జరుగుతున్నది కాదు. నాయకత్వ ముగింపు, ఎందుకంటే అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దానికి ముగింపు పలకాలని కోరుకుంటున్నాడు గనుక. ఇంటా బయటా ట్రంప్ విధానాలు అత్యంత వేగంగా అమెరికా అధికార పునాదులను నాశనం చేస్తున్నాయి. ప్రపంచ అగ్రశక్తిగా ప్రస్తుతం అమెరికాను పక్కకు నెట్టి దాని స్థానాన్ని ఆక్రమించాలని చూస్తున్న చైనా నేత షీ జిన్‌పింగ్ ప్రధాన లబ్ధిదారు అవుతాడు. ప్రపంచాన్ని హ్రస్వదృష్టితో చూస్తున్న ట్రంప్‌కు తానేం చేస్తున్నదీ తెలియటం లేదు, అతడి చర్యలు అంతర్జాతీయ భద్రతకు ముప్పు తెస్తున్నాయని, అమెరికా భవిష్యత్ కూడా దానితోనే ముడిపడి ఉందని తెలుసుకోలేక పోతున్నాడు, అమెరికా వదలిన ఖాళీలో చైనా ప్రవేశాన్ని ఇతర ధనిక దేశాలు అడ్డుకోవలేవంటూ ఆ పత్రిక విశ్లేషణ కొనసాగింది.

వాణిజ్య యుద్ధం గురించి అమెరికా గతంలో వేసుకున్న అంచనాలు తప్పాయి. 2024లో అమెరికా వాణిజ్య లోటు లక్ష కోట్ల డాలర్లుగా ఉంటే చైనా వాణిజ్య మిగులు కూడా అంతే ఉంది. అమెరికా, ఐరోపాలో కోల్పోయిన మార్కెట్లను మరోచోట పొందేందుకు చైనా ముందుకు పోతున్నది.ట్రంప్ ప్రకటించినట్లుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ వంటి వాటి నుంచి అమెరికా వైదొలిగినా, యూఎస్ఎయిడ్ ఆకస్మికంగా నిలిపివేసినా ఆ స్థానాన్ని చైనా ఆక్రమిస్తుందని కొందరు ఇప్పటికే హెచ్చరించారు. ఇప్పటివరకు ఉద్ధరించే పేరుతో సాయం బిస్కెట్లతో పలు దేశాల్లో పాగా వేయాలని చూసిన అగ్రదేశపు అమెరికా ఎత్తుగడ ఫలించలేదు. అలాంటిది అంతశక్తిలేని చైనా వల్ల అవుతుందా? నిజానికి చైనా నేరుగా అప్పులిస్తున్నది తప్ప అమెరికా, జపాన్, మరొక ధనిక దేశం మాదిరి సాయం పేరుతో షరతులతో కూడిన నిధులు ఇవ్వటం లేదు, అలాంటి ఏర్పాట్లు కూడా లేవు. అమెరికా సాయం పొంది బాగుపడిన దేశాలేమిటంటే ఎవరూ చెప్పలేరు, కానీ అనేక దేశాల్లో మౌలిక సదుపాయాల్లో చైనా పెట్టుబడుల ఫలితాలు కనిపిస్తున్నాయి. చరిత్రలో మార్కెట్ల కోసం ఏకంగా దేశాలనే ఆక్రమించుకోవటం తెలిసిందే. తొలి వాణిజ్య యుద్ధం చైనా-బ్రిటన్ మధ్య నల్లమందు దిగుమతుల మీద జరిగింది. రెండవది కూడా అదే సమస్య మీద బ్రిటన్, ఫ్రాన్స్ కలసి చేశాయి. తొలి యుద్ధంలో నల్లమందును ధ్వంసం చేసినందుకు చైనా నష్టపరిహారం చెల్లించటంతో పాటు హాంకాంగ్ దీవులను బ్రిటన్‌కు 99 సంవత్సరాల పాటు కౌలుకిచ్చేందుకు ఒప్పందం జరిగింది. రెండవ యుద్ధంలో నల్లమందు విక్రయాలను చట్టపరంచేసేందుకు ఒప్పందాన్ని రుద్దారు. వర్తమాన వాణిజ్య యుద్ధాన్ని చైనా మీద అమెరికా 2018లో ప్రారంభించింది.ట్రంప్ దిగిపోయినా బైడెన్ కొన సాగించాడు, తిరిగి ట్రంప్ వచ్చాడు. అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటంటే అప్పుడూ చైనా కుంగిపోలేదు, ఇప్పుడు మరింత సమర్థవంతంగా ఎదుర్కొనే బలాన్ని కలిగి ఉంది.వాణిజ్యపోరు కరెన్సీ పోరుకు విస్తరించింది.

కెనడా, మెక్సికోల మీద 25శాతం పన్ను విధిస్తానన్న ట్రంప్ చైనా దగ్గరకు వచ్చేసరికి పదిశాతమే అన్నాడు.నిజానికి 2024లో జో బైడెన్ చైనా నుంచి దిగుమతి చేసుకునే విద్యుత్ వాహనాలపై 100, సోలార్ సెల్స్, సెమీ కండక్టర్ల మీద 50, లిథియం అయాన్ బాటరీలపై 25శాతం చొప్పున దిగుమతి సుంకాలు విధించాడు. తాజాగా ట్రంప్ చేసిన ప్రక టనను అసలు చైనా పట్టించుకోలేదనే చెప్పాలి. కొన్ని నామమాత్ర చర్యలు తీసుకుంది. అవి అమెరికా నుంచి దిగుమతయ్యే వాటిలో పదో వంతు వస్తువుల మీదనే అని వార్తలు.పెద్ద మొత్తంలో సుంకాలు విధిస్తే ఎక్కువగా నష్టపోయేది అమెరికాయే గనుక ఎంతవరకు ముందుకు పోతుందో చూద్దాం అన్నట్లుగా చైనా ఉంది.

కెనడా, మెక్సికోల మీద 25శాతం పన్ను విధిస్తానన్న ట్రంప్ చైనా దగ్గరకు వచ్చేసరికి పదిశాతమే అన్నాడు.నిజానికి 2024లో జో బైడెన్ చైనా నుంచి దిగుమతి చేసుకునే విద్యుత్ వాహనాలపై 100, సోలార్ సెల్స్, సెమీ కండక్టర్ల మీద 50, లిథియం అయాన్ బాటరీలపై 25శాతం చొప్పున దిగుమతి సుంకాలు విధించాడు. తాజాగా ట్రంప్ చేసిన ప్రక టనను అసలు చైనా పట్టించుకోలేదనే చెప్పాలి. కొన్ని నామమాత్ర చర్యలు తీసుకుంది. అవి అమెరికా నుంచి దిగుమతయ్యే వాటిలో పదో వంతు వస్తువుల మీదనే అని వార్తలు.పెద్ద మొత్తంలో సుంకాలు విధిస్తే ఎక్కువగా నష్టపోయేది అమెరికాయే గనుక ఎంతవరకు ముందుకు పోతుందో చూద్దాం అన్నట్లుగా చైనా ఉంది. ఎనిమిదేండ్ల నాటితో పోలిస్తే తాజా బెది రింపు లెక్కలోది కాదని భావిస్తోంది. అందుకే ట్రంప్ ప్రకటనలను అది ఖాతరు చేయటం లేదు.దీని అర్థం అసలేమీ ప్రతికూల ప్రభావాలు ఉండవని కాదు.

ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదమవుతున్న పూర్వరంగంలో అమెరికా పాలకవర్గం చూస్తూ ఊరుకుంటుందా? శత్రువుగా పరిగణించే చైనాతో పాటు తన కనుసన్నల్లో నడిచే కెనడా, మెక్సికో, ఐరోపా దేశాలు, చేతులు కలిపేందుకు తహతహలాడుతున్న భారత్ మీద కూడా బస్తీమే సవాల్ అన్నట్లుగా మాట్లాడుతున్నాడు. ఆయా దేశాలతో బేరమాడేందుకు అయితే సరే, మొదటికే మోసం వస్తే పాలకవర్గం సహించే సమస్యే లేదు. దాని డిఎన్ఏలో ఎలాంటి మార్పులు ఉండవు. ఎన్నికల్లో ఓటర్లు ఎక్కువగా పాల్గొనేందుకు ప్రోత్సహించటానికి మనమెందుకు డబ్బు ఇవ్వాలంటూ ట్రంప్ చేసిన ప్రకటన అమెరికా సామాన్యులను ఆకట్టుకుంటుందనటంలో ఎలాంటి సందేహం లేదు. కానీ సాయం పేరుతో జరుపుతున్న కార్యకలాపాలు వేరు. ఇప్పటి వరకు జరిపిన వాటితో ఫలితం లేకపోతే సమీక్షల తరువాత కొత్త రూపాలతో అమెరికా రంగంలోకి దిగుతుంది తప్ప వెనక్కు తగ్గే అవకాశం లేదు !

'అందరికీ విద్య' అందని ద్రాక్షేనా?

ఒకప్పుడు ఎంతగానో ఆరాధించిన ప్రభుత్వ విద్య రానురానూ ప్రజాధారణ కోల్పోతున్నదేమోననే ఆందోళన కలుగుతున్నది. మరోపక్క ప్రయివేటు రంగంలో విద్యావ్యాపారం వెర్రితలలు వేస్తున్నది. లాభసాటిగా ఉన్న ఈవ్యాపారంలో కాంట్రాక్టర్లు, పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులు కూడా నేరుగా భాగస్వాములవుతున్న పరిస్థితి నేడు నెలకొంది. విద్యాశాఖలో పటిష్టమైన చట్టాలున్నా, అమలు చేయ గలిగిన సామర్థ్యంగల అధికారగణం ఉన్నా పరిస్థితి అగమ్యగోచరంగా మారుతున్నది. వాస్తవంగా చూస్తే ఒకనాడు ప్రభుత్వ పాఠశాలలే తప్ప ప్రయివేటు బడుల్లేవు. ఎక్కడో పట్టణాల్లో, నగరాల్లో ఇవి నడిచేవి. వాటిలో కూడా వ్యాపార ధోరణులు కన్పించేవికావు. లాభ నష్టాలతో సంబ ంధం లేకుండా కేవలం సేవా దృక్పథంతో విద్యనందించేవి. నిర్వాహకులు సామాజిక బాధ్యతగా భావించి బడులు నడిపేవారు. అందువల్ల ఆనాటి ప్రయివేటు పాఠశాలలను అరికట్టే అవసరం లేకుండా పోయింది. అందుకే చట్టాల అవసరం అప్పట్లో తలెత్త లేదు. ఇక ప్రభుత్వరంగంలో కూడా ఆనాడు ఎంతో ప్రతిష్టంగా నడిచేవి. రాజకీయ జోక్యం ఉండేది కాదు. కానీ రానురానూ పరిస్థితులు మారిపోయాయి. పాలకుల అశ్రద్ధ, అరకొర నిధులు, అవినీతి, వీటన్నింటిని మించిన రాజకీయ జోక్యంతో విద్యాప్రమాణాలు అడుగంటి పోతున్నాయి.



రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందనే ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. బీదాబిక్కి జనం కూడా నాణ్యమైన విద్య ప్రయివేటు పాఠశాలల్లోనే దొరుకుతుందనే నమ్మకంతో ఆ వైపే మొగ్గు చూపుతున్నారు. ఏమాత్రం ఆర్థిక వసతులు లేనివారు, మరోదారి లేక విధిలేని పరిస్థితుల్లోనే ప్రభుత్వ పాఠశాలల బాటపడుతున్నారు. ఇటీవల కాలంలో గ్రామాలకు కూడా ఈ ప్రయివేటు విద్యావ్యాపారం విస్తరించింది. ఇక ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా కన్పిస్తున్నది. ఏడాదికేడాది చదువుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంటే ప్రయివేటు రంగంలో పెరిగిపోతున్నది.

ఇటీవల సాక్షాత్తూ తెలంగాణ సర్కార్ పాఠశాలల విద్యకు సంబంధించిన వివరాలు అసెంబ్లీలో వెల్లడించింది. 2021-22 విద్యా సంవత్సరంలో ప్రభుత్వబడుల్లో చదివే విద్యార్థులు 30లక్షల 78వేల 109 మంది ఉండగా ప్రయివేటులో 20లక్షల67వేల 597 మంది ఉన్నారు. అయితే 2022-23 విద్యా సంవత్సరం నాటికి ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల సంఖ్య తగ్గి ప్రయివేటు రంగంలో పెరిగిపోయింది. సర్కారు బడులకంటే ప్రయివేటు స్కూల్లో దాదాపు రెండు లక్షల మందికి పైగా విద్యార్థులు అదనంగా అడ్మిషన్లు తీసుకున్నారు. 2023-24 సంవత్సరంలో ప్రభుత్వ స్కూళ్లలో చేరేవారి సంఖ్య మరింత తగ్గిపోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇరవైఆరు లక్షల ముప్పైఆరువేల ఆరువందల ముప్పైకి పరిమితం కాగా, ప్రయివేటు బడుల్లో ముప్పైనాలుగు లక్షలకుపైగా ప్రవేశాలు పెరిగిపోయాయి. అంటే దాదాపు ప్రభుత్వ స్కూళ్ల కంటే ఏడు లక్షలకుపైగా ఎక్కువమంది చేరారు. ఈ ఏడాది విద్యాసంవత్సరం కూడా అదే పరిస్థితి. ఇలాగే ప్రభుత్వరంగంలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంటే ఆ పాఠశాలల పరిస్థితి ఎటువైపు దారిస్తుందో? ఎందుకు ఈ పరిస్థితి? కారకులెవరు? కారణాలేమిటి? అనేది అటు అధికార వర్గాలకు కానీ, పాలకులకు కానీ తెలియనిది కాదు. 'మధ్యాహ్న భోజనం పెడతాం, పుస్తకాలు ఉచితంగా ఇస్తాం, బోధన ఫ్రీగా చేస్తామంటూ' సకల విధాల ప్రాధేయపడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేందుకు ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఆ ప్రయత్నాలు ఫలితాలనివ్వడం లేదు.దానికి కారణం ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులకు పాలకులు సరైన అవగాహన కల్పించకపోవడమే.

భరించలేని ఫీజులు ప్రయివేటు రంగంలో కట్టాల్సివస్తున్నా అటువైపే మొగ్గు ఎందుకు చూపుతున్నారో ఇప్పటికైనా సర్కార్ ఆలోచించాలి. ప్రభుత్వ పథకాలు, ఆశయాలు కాగితాల వరకు బాగానే ఉన్నా, ఆచరణకొచ్చేసరికి అసలు సమస్యలే గుదిబండలా మారుతున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా పాఠశాలల్లో కనీసవసతుల కొరత తీవ్రంగా కన్పిస్తున్నది. మన రాష్ట్రం వరకు పరిశీలించినా వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మంచినీరు, మరుగుదొడ్ల వంటి కనీస వసతులు లేక పోవడం ప్రత్యేకంగా బాలికలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా అందరికి విద్య అందించాలనే లక్ష్యం కనుచూపుమేరలో కన్పించడం లేదు. దేశాభివృద్ధికే కాదు మానవజాతి అభ్యున్నతికి విద్య పునాది అనేది నిర్వివాదాంశం. 06 నుంచి 14 యేళ్ల బాలబాలికలందరికీ ఉచిత విద్య అందించాలనే కార్యక్రమాన్ని పదేండ్లలోనే పూర్తి చేయాలని స్వాతంత్య్రం రాగానే పెద్దలు నిర్ణయించారు. ఆ సంకల్పం కాగితాల్లోనే 'కన్నుమూసింది'. ఇక డిపెప్, ఎపెప్ సర్వశిక్ష అభియాన్ వంటి కార్యక్రమాలు చేపట్టి దేశవ్యాప్తంగా లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ప్రభుత్వ విద్యా వ్యవస్థ సంక్షోభంలోకి నెట్టబడుతుంటే ప్రేక్షక పాత్ర వహించ డం ఏమాత్రం సరికాదు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. ప్రభుత్వ విద్యను పరిరక్షించాలి.

- సభావట్ కళ్యాణ్, 9014322572

పాటలు పుట్టిన తావుల్లో 'ప్రజా సంస్కృతి'



భూపతి వెంకటేశ్వర్లు
9490098343

మనిషి బతికేందుకు గాలి, నీరు, ఆహారం ఎంత అవసరమో, వాటి సమానస్థాయికి సరితూగ గలిగేది ఏదైనా ఉందంటే అది మన 'సంస్కృతి'. మూఢనమ్మకాల సుడిగుం డంలో కొట్టుకు పోతున్న నేటి సమాజానికి ఇది చాలా ముఖ్యం. దీనికి కావాల్సింది ధనమో, దర్పమో కాదు, ఒక మహత్తరమైన సాంఘిక శక్తి సమహారం. 'అబద్ధాల ఫ్యాక్టరీ'లో, 'వాట్సాప్ యూనివర్సిటీ'లో తమకు కావాల్సిన భావజాలాన్ని ఉత్పత్తి చేసుకున్నట్టుగా ఇది ఉండదు. శ్రమైక జీవన సౌందర్యపు చెమటచుక్కల నుంచి పుట్టు కొచ్చేది. సామాజిక అవసరాలకు ఉప యోగపడే వృత్తుల నుంచి ఉద్భవించేది. పొలంలో పని చేస్తున్న కూలీల గొంతులో కడలి స్వరంలా ఉప్పొంగేది. ఒక్కటేమిటి? చూసే కోణం ఉండాలి గానీ, అది మనతో, ప్రకృతితో ముడి వేసుకున్న బంధం. అందులో అణువణువునా దాగి ఉన్నదే 'ప్రజాసంస్కృతి'. దీన్ని నియమ బద్ధంగా, శాస్త్రీయంగా వర్ధిల్లేలా చూస్తేనే పురోగమన భావాల వైపు ప్రజా చైతన్యంగా పురోగమిస్తుంది. లేదంటే చైతన్య హీనమై చతికిల పడుతుంది.ఇది మానవ జాతికి అతిపెద్ద ప్రమాదకరం.

ఈ దశాబ్దకాలంగా జరుగుతున్న ఘటనల్ని చూస్తే మనం దేశం ఎటువైపు పయనిస్తోందో తెలుస్తూనేవుంది. కలంపై దాడి, గళంపై దాడి, మతంపై దాడి, విశ్వాసంపై దాడి, చివరకు సంస్కృతిపైన కూడా దాడే. చిమ్మ చీకట్లో కూడా ప్రశ్న బతికి బట్టకట్టాలన్నా, మనిషి స్వేచ్ఛగా జీవించాలన్నా ఒక మహా ప్రయత్నమే చేయాల్సిన అవసరం ఉన్నది. అందుకు యువతీయువకుల్లో సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించడం ఒక్కటే మార్గం. మానవ జీవితాలను ముందుకు నడిపించే జ్ఞానమే సంస్కృతి. ఈ జ్ఞానమే లేనప్పుడు అశాస్త్రీయ వాదనలు, అన్యాయాలు, పుణ్యం, పాపం, స్వర్గం, నరకం, కర్మ, రాత ఇలాంటివే ముందుకొస్తాయి. దేశంలో అలుముకుంటున్న ఒక తీవ్ర జాతీయవాద నిరంకుశ వాతా వరణాన్ని ఏదో ఒక స్థాయిలో నిలువరించాలి. దానికో సువిశాల వేదిక ఏర్పడాలి. అలాంటి బాధ్యతను భుజాల మీదేసుకుని ప్రజలిన చైతన్యపరుస్తున్నది తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టీపీఎస్‌కే).

దేశంలో రాజకీయ అనిశ్చితి పరిస్థితులు, వాటికి కొమ్ముకాస్తున్న ఆధిపత్య శక్తులు, తిరోగమనం వైపు నడిపించే 'పరివార్' కుట్రల గురించి సమాజానికి నిరంతరం తెలియజేస్తూ వారిని జాగరుకత పరుస్తున్నది టీపీఎస్‌కే. ఇటీవల కాలంలో సుద్దాల హనుమంతు పేరుమీద ప్రజా సాంస్కృతిక ఉత్సవాలను మహబూబ్‌నగర్ పట్టణంలో రెండురోజుల పాటు వైభవంగా నిర్వ హించింది. పండుగ సాయన్న, మీర సాయబ్, దున్న ఇద్దస్, సురవరం లాంటి మహనీయులకు ప్రఖ్యాతి గాంచిన నేల పాలమూరు. ఎక్కడెక్కడో సెలయేళ్లలో వర్షపు నీరంతా వచ్చి మహా సముద్రంలో మమేకమైన ట్టుగా విద్యార్థి, యువజనులంతా ప్రజా సంస్కృతిలో భాగమై ఒక్కటిగా నిలిచారు. ఏకకాలంలో భారత రాజ్యాంగంలోని ప్రధాన సూత్రాలైన ప్రజాస్వామ్య, సార్వభౌమ, గణ తంత్ర, స్వేచ్ఛా సమానత్వం పేర్లతో ఏర్పాటైన నాలుగు వేదికలపై, ఇరవైఆరు కళాశాలల నుంచి వచ్చిన పన్నెండు వందల మంది ఏకధాటిగా సంస్కృతిని ఎలుగెత్తి చాటారు. పరీక్షలకు పదినిమిషాలుండగా కూడా వేదికపై ఆడి పాడి పరీక్షలు ప్రశాంతంగా రాసి ఆటాపాటలు చదువుకు అడ్డుకాదని నిరూపించారు. జానపద సాహిత్యం ద్వారా జాతి సంస్కృతిని తెలిపారు. వీరుల చరిత్రను, ధిక్కార వారసత్వాన్ని కాపాడుకోవాలని సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా గుర్తుచేశారు. సహేతుకమైన సత్యాలను కళల ద్వారా అందించారు.



తెలంగాణ భూమి పండిన "పంట పొలం" వంటిది. ఎన్నో రకాల జానపద కళల్ని సుసంపన్నం చేసిన చరిత్ర ఈ తెలుగు నేలది. దానికి తగినట్టుగానే కట్టిపడేసే కళారూపాలు, గిరిజనుల నృత్యాలు, అలరించే ఆటలు, పట్టణ ప్రజల్ని ఆలోచింపజేసి అడుగడుగునా వారి అభిమానాన్ని ఈ ఉత్సవాల్లో చురగొన్నారు. శాంతి సామరస్యం, ఐక్యత, సృజనాత్మకత, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఆఫ్రికా ఖండం నమిభియా దేశ ఆరోగ్య శాఖ మంత్రి బెర్నాడ్, స్థానిక ఎమ్మెల్యే, సినీ సంగీద దర్శకుడు సుద్దాల అశోక్ తేజ వంటి ప్రముఖులు హాజరై ఉత్సవాలకు మరింత శోభను తీసుకొచ్చారు. ఉర్దూ పాఠశాల విద్యార్థినులు స్వయంగా రాసి ప్రదర్శించిన లఘునాటిక 'ఊడలు దిగిన వికృత సంస్కృతి' అందర్నీ ఆకట్టుకుంది. ఈ నాటికలో దేశాలకు సరిహద్దులుంటాయి, ప్రపంచ ప్రజల మధ్య అసమానతలుంటాయి, విశ్వమానవాళి ఇంటర్‌నెట్‌కి ఏ హద్దుల్లేవు, అంతర్జాలాన్ని ముంచెత్తుతున్న అశ్లీల దృశ్యాల నడుమ బాల్యం బాధాకరంగా మారిందని మొబైల్‌కు "బై" చెప్పి, పుస్తకాలకు "హాయ్" చెప్పే చక్కటి సందేశాన్నిచ్చారు. మరోవైపు "నేనెప్పుడూ రాజ్యానికి ప్రతిపక్షమే " అంటూ కవులు, కవయిత్రులు కవి సమ్మేళనం నిర్వహించారు. చిత్రకారులు "మేమంతా ఒక్కటే " అంటూ దేశ సమైక్యత చిత్రాలు గీసారు. శాస్త్రీయ నృత్యాలు, బతుకమ్మ, కోలాటం, లఘు నాటికలు, భజన, జానపద కళారూపాలు, తీరొక్క వేషాలు, సాహిత్య, సాంస్కృతికంగా కోలాహలంగా.. గుంపులు గుంపులుగా తరలివచ్చారు. సుద్దాల వేదిక అంటేనే పాటల యుద్ధాల, ప్రగతిశీల ప్రభాత దృక్పథాన్ని ప్రతిబింబించాయి. మైనార్టీ పిల్లలు, ఆదివాసీ గిరిజన విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. విదేశీ సంస్కృతి అన గానే..? చెత్త అని స్వదేశీ సంస్కృతి అంతా బంగా రమని, అలాంటి వివాదాలకు పోకుండా విదేశీ, స్వదేశీ అనేవి కలగలిసిపోయాయి. వాటి వర్గ సారాన్ని బట్టి మన వైఖరి ఉండాలని బ్రేక్ డ్యాన్స్, వెస్ట్రన్ డాన్స్, పాప్ సంగీతం, భరతనాట్యం, శాస్త్రీయ సంగీతం అన్ని రూపాలను ప్రజలకు చక్కటి సందేశాన్ని అందించే భావజాలంతో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. సమానత్వ అవగాహనను శక్తివంతంగా చూపించారు. ప్రత్యామ్నాయ భావజాలాన్ని బలంగా చెప్పారు. లౌకిక భావాలు, ప్రజాస్వామిక విలువలు, సామాజిక వివక్షలు, పురుషాధిక్య భావజాలంతో ముడిబడ్డ సమస్యలు, వినిమయతత్వం, వ్యక్తి వాదంతో వచ్చే పర్యావ సానాల వంటి అంశాలను కళారూపాల్లో వ్యక్తం చేశారు. భావ సారూప్యత గలిగిన వ్యక్తులు, అనేక సంస్థలు కలగలిసిన కార్యక్రమమిది. "ఆట పాటలు సమాజంలో మంచి, చెడ్డల విచక్షణ విప్పి చెప్పే ఆయుధాలు. వాటిని ధరించిన యువకులతో అడు గులు కలపడమే నేటి ప్రత్యామ్నాయం, సుద్దాల సాంస్కృతిక ఉత్సవాలు ప్రశ్నించే ధైర్యాన్ని ఇచ్చినవి. ప్రజా సంస్కృతిని పాదుకొల్పేలా ఊతమిచ్చినవి. ఇలాంటివి గల్లీ గల్లీనా, పల్లెపల్లెనా, ఊరుఊరునా ఈ ఉత్సవాలు నిరంతరం నిర్వహించాలి. 'సముద్రం విషపూరితం కానంత వరకే జలచరాల మనుగడ' ఇది సమాజంలోని ప్రతి ఒక్కరి గమనంలో ఉండాలి. మనువాద సాహిత్యం ఎక్కడ జడలు విప్పుతుందో.. నిజమైన సాహి త్యం, ప్రజాసంస్కృతి అక్కడ పుట్టుకు రావాలి.ఫాసిస్టు ఆధిపత్యపు రెక్కల్ని విరిచేలా ప్రజల్లో మానసికతను చైతన్యాన్ని పెంపొందించాలి. 'ఇక చీకటి యుగం ముగుస్తుంది.. పోరాడే వారు గెలుస్తారు' అన్న భరోసా, ఆత్మవిశ్వాసం ఈ ఉత్సవాల్లో పాల్గొన్న యువతరంలో కనిపించింది. యువజనుల కలయికలో కలవరం వుంది, ఇది వాస్తవం. వాళ్ల సాంస్కృతిక పోరాటంలో న్యాయం ఉంది, ఇది చైతన్యం. వారి పాటలో నైతికత ప్రకటన ఉంది, ఇది దాని మౌలిక స్వరూపం. ఈ విష యాల న్నీ సాంస్కృతిక ఉద్యమాల కిందకు వచ్చే విధంగా చూడాలి. వాళ్ల సృజనకు తగిన వేదికలు ఆ పోరా టాలే కల్పించాలి. అంధకారంలో జీవిస్తున్న ప్రజా నీకాన్ని సాంస్కృతికరంగం వైపు మళ్లించాలి. ఇది ఆరంభం కాదు, ముగింపు అంతకన్నా కాదు, ఒక అనుభవం మాత్రమే. దీన్ని అణచివేయబడుతున్న వారి బాటల్లో విస్తరించే బాధ్యత లౌకిక సమాజానిదే.

'ఇక చీకటి యుగం ముగుస్తుంది.. పోరాడే వారు గెలుస్తారు' అన్న భరోసా, ఆత్మవిశ్వాసం ఈ ఉత్సవాల్లో పాల్గొన్న యువతరంలో కనిపించింది. యువజనుల కలయికలో కలవరం వుంది, ఇది వాస్తవం. వాళ్ల సాం స్కృతిక పోరాటంలో న్యాయం ఉంది, ఇది చైతన్యం. వారి పాటలో నైతికత ప్రకటన ఉంది, ఇది దాని మౌలిక స్వరూపం. ఈ విష యాల న్ని సాంస్కృతిక ఉద్యమాల కిందకు వచ్చే విధంగా చూడాలి.

స్త్రీ టీ కేంద్రం పరిశీలన



నవతెలంగాణ - బోనకల్

బోనకల్ - ఖమ్మం ప్రధాన రహదారి పక్కనే స్థానిక తహసిల్దార్ కార్యాల యం వద్ద ఏర్పాటు చేసిన స్త్రీ టీ కేంద్రాన్ని హైదరాబాద్‌కు చెందిన న్యూస్ మీటర్ సంస్థ కరస్పాండెంట్ దక్షిణామూర్తి, డిపిఎం దొడ్డ శ్రీనివాసరావు, తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్, ఎంపీడీవో రురావత్ రమాదేవి, ఐకెపి ఎపిఎం కట్ట సురేంద్రబాబుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఐకెపి రుణం ద్వారా మండల పరిధిలోని రావినూతల గ్రామానికి చెందిన షేక్ రెహనా స్త్రీ టీ కేంద్రాన్ని నిర్వహించుకుంటుంది. స్త్రీ టీ కేంద్రం ప్రతిరోజు ఎలా జరుగుతుందని నిర్వాహకురాలు రెహనాను దక్షిణామూర్తి అడిగి తెలుసుకున్నారు. స్త్రీ టీ కేంద్రాన్ని విస్తరించుకునేందుకు అవసరమైతే ఐకేపీ ద్వారా మరింత ఆర్థిక సహకారం అందిస్తామని తెలిపారు. వారి వెంట సిసి లావూరి ఝాన్సీ రాణి, మండల సమైక్య అధ్యక్షురాలు మందరేఖ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

- 4,089 ఓటర్ల కోసం 24 పోలింగ్ కేంద్రాలు

ఏర్పాటు : కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ కోసం ఖమ్మం జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని, మొత్తం 4089 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు 9 సెక్టర్ అధికారులు, 28 ప్రిసైడింగ్ అధికారులు, 27 అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 58 ఇతర పోలింగ్ సిబ్బంది, 28 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని అన్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాటు చేశామని, బుధవారం ఇక్కడి నుండి ఎన్నికల విధుల సిబ్బంది పోలింగ్ సామాగ్రితో పాటు పోలింగ్ కేంద్రాలకు వెళతారని, ఎన్నికల తర్వాత పోలింగ్ కేంద్రాల నుంచి నేరుగా నల్గొండలోని రిసెప్షన్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు చేరుకుంటాయని అన్నారు. 8 రూట్లలో పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది సామాగ్రిని తరలిస్తున్నామని, వీటి కోసం 8 ఆర్టీసీ బస్సులను సన్నద్ధం చేశామని అన్నారు. ఫిబ్రవరి 27న ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ప్రతి ఓటర్ ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొని తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటుకు చొరవ తీసుకోవాలి

- కనీస మద్దతు ధర క్వింటాకు రూ.25వేలు నిర్ణయించాలి
- కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్ కొనుగోలుకు కృషి చేయాలి
- ఎంఎల్‌ఏకి రైతు సంఘాల వినతి



నవతెలంగాణ-వైరా

ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటుకు కనీస మద్దతు ధర క్వింటాకు రూ. 25 వేలు నిర్ణయం చేయాలని, కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్ కొనుగోలుకు కృషి చేయాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని మంగళవారం వైరా శాసన సభ్యులు మాలోతు రాందాస్ నాయక్‌కి అఖిల పక్ష రైతు సంఘాల ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. వైరా నియోజకవర్గ పరిధిలో జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో మిర్చి సాగు అవుతుందని, మిర్చి రైతులకు వైరస్, తెగుళ్ళు, నల్లి మూలంగా నష్టం జరిగిందన్నారు. మరోవైపు మార్కెట్లో సరైన ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. అంతర్జాతీయ ఎగుమతులపై ఆధారపడి మిర్చి సాగు చేయాల్సి వచ్చిన నేపథ్యంలో అంతర్జాతీయ ఎగుమతులు దిగుమతులపై రైతులకు సరైన అవగాహన లేకపోవడం, నూతన వైరస్, తెగుళ్ళు, వాతావరణ మార్పులు మూలంగా సంభవిస్తున్న నష్టం, సరైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరల నియంత్రణ లేకపోవడం రైతులను బలితీసుకుంటున్న పరిస్థితుల్లో సమగ్ర మిర్చి సాగు విధానం రూపొందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పైన ఉందన్నారు. మిర్చి పంటను ఆహార పంటగా కేంద్ర ప్రభుత్వం గుర్తించి వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరల పంటల జాబితాలో చేర్చి క్వింటాకు ఇరవై ఐదు వేల రూపాయలు మద్దతు ధర నిర్ణయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నా ఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని, మిర్చి క్వింటాళ్లకు ఇరవై ఐదు వేల రూపాయలు మద్దతు ధర నిర్ణయించి ప్రభుత్వం కొనుగోలుకు ప్రత్యేక కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, కిసాన్ కాంగ్రెస్ నాయకులు శీలం వెంకట నర్సిరెడ్డి, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఎస్ కె ఖాసిం, గిరి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు గారపాటి అశోక్, తోట నాగేశ్వరరావు, సంక్రాంతి పురుషోత్తం, వడ్లమూడి మధు, యనమద్ది రామకృష్ణ, వైరా మార్కెట్ మాజీ ఛైర్మన్ బానోతు నరసింహారావు, చెరకుమల్లి నాగేశ్వరరావు, పమ్మి అశోక్, వీరయ్య చౌదరి, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఐటీ-ఎస్ఆర్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం

- సాంకేతికత పరస్పర అభివృద్ధికి దోహదపడుతుంది
- ప్రిన్సిపాల్ డాక్టర్ ఊటుకూరి శేషారత్నకుమారి
- నైపుణ్యాల పెంపుదలకు ఇరు కళాశాలలకు అవకాశం
- సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకరరెడ్డి
- సాంకేతిక జ్ఞాన సముపార్జనకు దోహదపడుతుంది
- రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి



నవతెలంగాణ-సత్తుపల్లి

హన్మకొండలోని ఎస్ఆర్ యూనివర్సిటీతో తమ కళాశాల అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుందని సత్తుపల్లి మండలం గంగారం సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఊటుకూరి శేషారత్నకుమారి తెలిపారు. ఎస్ఆర్ విశ్వవిద్యాలయం ప్రతినిధులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, షేక్ మహమ్మద్ మధ్య అవగాహన పత్రాలను మంగళవారం తమ కళాశాలలోని కాన్ఫరెన్స్‌లో హాలులో పరస్పరం మార్చుకున్నట్లు ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం ఇరు కళాశాలలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థులు పేపరు ప్రెజెంటేషన్ (పీపీటీ), పరిశోధన పేపర్లు, పేపరు పబ్లికేషన్లు, సాంకేతిక విద్య నైపుణ్యాలు, పీహెచ్‌డీలు చేయడంలోనూ పరస్పర అవగాహన పెంపొందించుకోవడం వంటి అనేక విషయాలు ఈ రెండు కళాశాలలు ఉపయోగించుకోవడం జరుగుతుందన్నారు. ఎస్ఆర్ యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ షేక్ మహమ్మద్ మాట్లాడుతూ తమ యూనివర్సిటీ విద్యను ఆధునిక నైపుణ్యాలతో పాటు పాఠ్యాంశాలు విద్యార్థులకు వాస్తవిక ప్రపంచం అనుభూతిని అందిస్తాయన్నారు. వినూత్న అభ్యాసాలతో ఇక్కడ అందించే ప్రతి కోర్సు వాస్తవ ప్రపంచ సవాళ్లకు సైద్ధాంతిక భావాలను అన్వయించడం, ఆలోచనలను సులభతరం చేస్తుందన్నారు. డిసిప్లినరీ లెర్నింగ్ విద్యార్థుల బహుళ విషయాలపై జ్ఞానం, దృక్పథం పొందేలా చేస్తుందని వారన్నారు.

నైపుణ్యాల పెంపుదలకు ఇరు కళాశాలలకు అవకాశం
: సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకరరెడ్డి


విద్య నైపుణ్యాలు, బోధన నైపుణ్యాలను ఇరు కళాశాలలు ఉపయోగించుకోవడం జరుగుతుందని సాయిస్ఫూర్తి కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకరరెడ్డి అన్నారు. విద్యార్థులతో పాటు ఫ్యాకల్టీ సభ్యులు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఇరు కళాశాలలు అవగాహన ఒప్పందం చేసుకోవడం ద్వారా ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడం తమ కళాశాల విద్య నైపుణ్యాలకు ఉపయోగ పడుతుందని ప్రభాకరరెడ్డి తెలిపారు.

ఈ ఒప్పందం సాంకేతిక జ్ఞాన సముపార్జనకు దోహదపడుతుంది
: రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి

ఇరు కళాశాలల మధ్య పరస్పర అవగాహన ఒప్పందం వల్ల విద్యార్థుల ఆధునిక సాంకేతిక జ్ఞాన సముపార్జనకు దోహదపడుతుందని రాజ్యసభ సభ్యులు, హెటిరో గ్రూప్ సంస్థల అధినేత, సాయిస్ఫూర్తి కళాశాల ఛైర్మన్ డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ బండి అన్విద వర్చువల్‌గా అన్నారు. ఇరు కళాశాలల విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో ఈసీఈ, సీఎస్సీ, సీఎస్ఎం విభాగాధిపతిపతులు డాక్టర్ పాముల శేఖర్‌బాబు, డాక్టర్ షేక్ యాకూబ్, తోటకూర వీరన్న, అడబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎండుతున్న సాగర్ ఆయకట్టు పంటలను కాపాడాలి

- గోదావరి జలాలను యుద్ధ ప్రాతిపదికపై సాగర్ ఆయకట్టుకు తరలించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



నవతెలంగాణ-ఖమ్మం

నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలో సుమారు రెండు లక్షల ఎకరాలలో మొక్కజొన్న, వరి, మిరప, పెసర తదితర పంటలు ఎండుతున్నాయని, పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా మొక్కజొన్న పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారని, గింజ దశకు చేరిందని, సకాలంలో నీళ్ళు అందకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎడమ కాలువ పరిధిలో వైరా నుండి దిగువకు గోదావరి జలాలను యుద్ధ ప్రాతిపదికపై సాగర్ కాల్వకు అనుసంధానించి పంటలను కాపాడాలన్నారు. గత సంవత్సరం ఆగస్టులోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించినా, ఇంత వరకు సీతారామ ప్రాజెక్టును అనుసంధానం చేయలేకపోవటం ప్రభుత్వ యంత్రాంగం యొక్క అసమర్థతకు నిదర్శనం అన్నారు. మంత్రులు, అధికారులు స్పందించి సాగునీరు అందించకుంటే రైతాంగం రోడ్ల మీదకు వస్తారని హెచ్చరించారు.

సైలో బంకరు బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం

- జిల్లా మంత్రులతో చర్చించి సీఎంకు నివేదిక అందిస్తాం
- ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి
- సైలో బాధితుల దీక్షల శిబిరాన్ని సందర్శించిన ఆర్ఆర్ఆర్



నవతెలంగాణ-సత్తుపల్లి

పేద ప్రజలకు ప్రాణ సంకటంగా మారిన కాలుష్య కారక సైలో బంకరు బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని, ఇందుకోసం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులతో చర్చించి నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందించి ఆదుకోవడం జరుగుతుందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి సత్తుపల్లి మండలం కిష్టారంలోని అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీ సైలో బంకరు బాధితులకు హామీ ఇచ్చారు. సైలో బంకరును తీసెయ్యాలని డిమాండ్ చేస్తూ బాధితులు గత 16 రోజులుగా చేపట్టిన రిలే దీక్షల శిబిరాన్ని టీడీపీ ఛైర్మన్ మువ్వా విజయబాబుతో కలిసి ఎంపీ రామసహాయం మంగళవారం సందర్శించారు. దీక్షపరులకు సంఘీభావం వ్యక్తం చేశారు. ప్రజల ఉసురు తీస్తున్న సైలో బంకరు బాధితులకు త్వరలోనే న్యాయం జరిగేలా చూడటం జరుగుతుందని ఆర్ఆర్ఆర్ అన్నారు.

16వ రోజుకు చేరిన సైలో బాధితుల దీక్షలు

కాలుష్యాన్ని వెదజల్లుతున్న సైలో బంకరును తీసెయ్యాలని కిష్టారం అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీ బాధిత ప్రజలు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారంతో 16వ రోజుకు చేరింది. ఎమ్మెల్సీ కోడ్ అయ్యాక సైలో బంకరు సమస్యకు పరిష్కారం దొరుకుతుందనే గంపెడాశతో బాధిత ప్రజలు ఎదురు చూస్తున్నారు. కార్యక్రమంలో దీక్షల కమిటీ సభ్యులు మారోజు శ్రీను, పాలకుర్తి నాగేశ్వరరావు, మారోజు నాగేశ్వరరావు, పాలకుర్తి ప్రభాకర్, పాలకుర్తి రాజు, పాలకుర్తి ప్రభుదాసు, కొండా నాగరత్నం, వాడపల్లి నాగమణి, వాడపల్లి అరుణ, రామాల నాగమణి, ఎస్కే జాన్‌బీ, చల్లా ఏసమ్మ, కమలమ్మ, పాలకుర్తి ప్రవీణ్, తాళ్ల నాగేంద్ర, బర్రెగడ నరేంద్రతో పాటు పెద్ద సంఖ్యలో సైలో బాధితులు పాల్గొన్నారు.

నిబద్ధత గల కమ్యూనిస్టును కోల్పోయాం

- పోటు ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించిన నారాయణ

నవతెలంగాణ-ఖమ్మం

సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మృతితో నిబద్ధత, అంకితభావం కలిగిన కమ్యూనిస్టును కోల్పోయామని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తెలిపారు. విద్యార్థి దశ నుంచి అంచలంచెలుగా కమ్యూనిస్టు పార్టీలో ఎదగడంతో పాటు ఎదిగిన కొద్ది ఒదుగుతూ అంకితభావంతో కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు, ప్రజా ఉద్యమ నిర్మాణాలకు కృషి చేశారని ఆయన తెలిపారు. మంగళవారం పోటు ప్రసాద్ కుటుంబాన్ని నారాయణ పరామర్శించారు. ప్రసాద్ సతీమణి నిర్మల, కుమారుడు సాత్విక్‌ను కుటుంబ వ్యవహారాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ప్రసాద్ కుటుంబంతో అనేక దశాబ్దాలుగా అనుబంధం ఉందని, అమెరికాలో ఉన్న నాకు పోటు ప్రసాద్ మరణించారన్న విషయం తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. పోటుప్రసాద్ ఆశయ సాధనకు పునరంకితం కావాలని నారాయణ కోరారు. పోటు ప్రసాద్ కుటుంబానికి అండగా నిలుస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ సోదరి పోటు కళావతి, సోదరుడు పోటు పూర్ణచంద్రరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, యర్రాబాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్, ప్రజా సంఘాల నాయకులు గాదె లక్ష్మి నారాయణ, దూసరి శ్రీరాములు, కూచిపూడి రవి, మడుపల్లి లక్ష్మణ్, ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమర్థవంతంగా పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ - బోనకల్



ఈనెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బోనకల్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు మండల తహసిల్దార్ అనిశెట్టి పున్నం చంద్ర తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం మండల విద్యాశాఖ అధికారి దామల పుల్లయ్యతో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు తీసుకోవలసిన మౌలిక వసతులను, పోలింగ్ కేంద్రంలో గల వసతులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయిలో, సమర్థవంతంగా ఎన్నికల నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వారి వెంట బోనకల్ పంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి, బోనకల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అట్లూరి గోపీచంద్ ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు గాను ఒక ఏపీఓ, మరో పిఒ, మరో ఇద్దరు అదనపు సిబ్బందిని ఎన్నికల సంఘం నియమించినట్లు ఆయన తెలిపారు. బోనకల్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో మొత్తం 34 ఓట్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. 27 న జరిగే పోలింగ్ సందర్భంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు ఎందుకోసం ఎనిమిది మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

జాతరకు ముస్తాబైన కోటిలింగాల

- ఆదివాసీల ఆధ్వర్యంలో జాతర
- నేటి నుంచి మూడు రోజుల జాతర
- భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నాం
- ఆలయ ఛైర్మన్ అలెం వెంకటేశ్వర్లు
- శివ కళ్యాణానికి సిద్ధమైన ఆలయాలు



నవతెలంగాణ-కారేపల్లి

ఇల్లందు - సింగరేణి ప్రాంతంలో రెండోవ అతిపెద్ద జాతర కోటిలింగాల జాతర. ప్రతి ఏడాది శివరాత్రిరోజు ప్రారంభమై మూడు రోజులు నిరాటంకం జరిగే ఈ జాతర పూర్తిగా ఆదివాసీల ఆధ్వర్యంలో జరగటం గమనార్హం. ఈనెల 26 నుండి మూడు రోజులు జరగనున్న జాతరకు ఆలయ కమిటీ ఆలయాన్ని ముస్తాబు చేసింది. ప్రతి ఏడాది కోటిలింగాలలో జరుగు జాతరకు చుట్టుపక్కల జిల్లాల నుండి వేలాది మంది భక్తుల రాకతో ఆప్రాంతం శివనామస్మరణలతో మారుమోగిపోతుంది. కోటిలింగాల ఏరు వద్ద కాకతీయుల కాలం నుండి శివుడు స్వయంభుడుగా వెలిశారు. ఈప్రాంతంలో జలం భూమి నుండి పైకి ఉబికి వస్తుండటం ఆ నీటి కోసం భక్తులు పోటీపడితుంటారు. ఆలయ ప్రాంగణంలో గజంతో కూడిన శివలింగం, 108 శివలింగాలు, నాగేంద్రుడు, సాలేపురుగు, భక్తకన్నప్ప శివలింగానికి పూజలు చేస్తున్న వంటి ఆకృతులు దాతల సహకారంతో ప్రతిష్ఠించి ఆలయ విశిష్టతను ఇనుమడింపజేశారు.

ఆదివాసీల నిర్వహించే కోటిలింగాల జాతర

కోటిలింగాల జాతరను పోలంపల్లి ప్రాంతానికి చెందిన ఆదివాసి గిరిజనులు నిర్వహించటం ఆనవాయితీ. ఆదివాసీల స్థలంలో ఈ దేవాలయం ఉండటంతో వారి ఆధ్వర్యంలో ఆదివాసీలు కమిటీ సభ్యులుగా ఏర్పడిజాతర ఏర్పాట్లు చూస్తుంటారు. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతరకు ఆలయ కమిటీ భక్తులు క్యూలో నిల్చోవటానికి చలువ పందిళ్లు వేశారు. భక్తుల స్నానాలకు ఏరు నుండి నీటి సరఫరాకు మోటర్లకు బిగించారు. లైట్లను ఏర్పాటు చేశారు. ఆలయం ప్రాంగణంలోని విగ్రహాలకు రంగులను అద్దారు.

జాతరను పట్టించుకోని ప్రభుత్వ శాఖలు

ఆదివాసీల ఆధ్వర్యంలో మూడురోజుల పాటు జరిగే కోటిలింగాల జాతరకు ఇల్లందు, సింగరేణి, కామేపల్లి, గార్ల, బయ్యారం మండలాల నుండి వందలాది మంది వస్తుంటారు. ఏజన్సీలో జరిగే పెద్ద జాతరను ప్రభుత్వ శాఖలు పట్టించుకోక పోవటం విచారకరం. జాతరకు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టే ప్రభుత్వం గిరిజనుల ఆధ్వర్యంలో నడిచే జాతర పట్ల చిన్నచూపుచూపు ఉందని విమర్శ ఉంది. కనీసం జాతరకు వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలైన తాగునీరు. స్నానాల ఘట్టాల ఏర్పాటు లేక భక్తులు ఇబ్బందులతోనే దేవుడి దర్శించుకునే స్థితి ఇక్కడ కనిపిస్తుంది. జాతరలో కేవలం పోలీసులు శాఖ, వైద్య శాఖ తప్ప ఇతర శాఖలు పట్టనట్లు వ్యవహరిస్తుంటాయని భక్తులు ఆరోపిస్తున్నారు. కారేపల్లి, కామేపల్లి మండలాలకు చెందిన భక్తులు కోటిలింగాలకు వెళ్లటానికి పేరుపల్లి-పోలంపల్లి రహదారి మీదిగా ఆలయ సమీపంలో కోటిలింగాల వాగు దాటి జాతరకు చేరుకోవాలి. ఈ వాగుపై బ్రిడ్జీ నిర్మాణం చేస్తామని సింగరేణి కాలరీస్ సంస్థ వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ కు హామీ ఇచ్చి వాగు ప్రాంతాన్ని ఇల్లందు జీఎం సైతం పరిశీలించారు. అటు తర్వాత సింగరేణి సంస్థ బ్రిడ్జీ నిర్మాణ ప్రతిపాధన పక్కన పెట్టింది.

భక్తులకు కనీస వసతులు కల్పిస్తున్నాం-ఆలయ ఛైర్మన్ అలెం వెంకటేశ్వర్లు

కోటిలింగాల జాతరకు వచ్చే భక్తులకు కనీస వసతులు కల్పిస్తున్నామని ఆలయ కమిటీ ఛైర్మన్ అలెం వెంకటేశ్వర్లు తెలిపారు. తాగునీటి అవసరాలు తీర్చటానికి మంచినీటి ట్యాపులు, స్నానాలకు కోటిలింగాల ఏరు నుండి మోటర్లు పెట్టినాము. ఇల్లందు మున్సిపాలిటీ వారి సహకారంతో జాతర ప్రాంతంలో లైట్లు ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఆలయం సమీపంలోని బావుల వద్ద మోటర్ల పెట్టి భక్తుల స్నానాలకు ఇబ్బంది లేకుండా చేస్తున్నామన్నారు.



మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి

నవతెలంగాణ-ఖమ్మం

రోజురోజుకి ఎండల తీవ్రత పెరుగుదలను దృష్టిలో పెట్టుకొని మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మొహమ్మద్ సలాం డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మంలోని లెనిన్ నగర్లో ఎస్కే చాన అధ్యక్షతన ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పుడే 3రోజులకు 2రోజులకు ఒక సారి 20 నిమిషాలు మాత్రమే నీళ్ల వస్తున్నాయని, రానున్న రోజుల్లో పరిస్థితి ఏట్ల ఉంటుందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. అందుకోసమే అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి, త్రీ టౌన్ ఏరియా కార్యదర్శి నూనె శశిధర్, జల నరసింహారావు, ఎమ్‌డి రెహమాన్, ఎస్కే కలేశ, ఎస్కే రఫీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్‌లో సత్తా చాటిన రెజొనెన్స్ విద్యార్థులు

- విద్యార్థులను అభినందించిన డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు



నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్ విద్యార్థులు ఎన్.భువనచంద్ర, డి.జస్మితలు ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ పోటీ పరీక్షలలో తమ సత్తా చాటి ఖమ్మం జిల్లా టాపర్స్‌గా విజయకేతనం ఎగరవేసి రాష్ట్ర స్థాయికి ఎంపికైన సందర్భంగా వారిని స్కూల్ డైరెక్టర్స్ కొండా శ్రీధర్ రావు, కొండా కృష్ణవేణి అభినందించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులను అన్ని పోటీ పరీక్షలలో టాపర్స్‌గా నిలబెట్టడానికి అద్భుతమైన ప్రణాళిక, నిరంతర అన్వేషణ, నిష్ణాతులైన ఉపాధ్యాయ బోధన బృందంతో రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను, నైపుణ్యాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఇంగ్లీష్ స్కిల్స్, మ్యాథ్స్, సైన్స్ స్కిల్స్ను అందిస్తున్నామని తెలిపారు. జిల్లా టాపర్స్‌గా నిలిచిన భువనచంద్ర, జస్మితలు అభినందించి ఆశీర్వదించారు. డైరెక్టర్ కొండా కృష్ణవేణి మాట్లాడుతూ జిల్లా టాపర్స్‌గా ఎంపికావడం పట్ల ఆనందం వ్యక్త పరుస్తూ ప్రతి విద్యార్థిలోని శక్తిసామర్థ్యాలను వెలికితీస్తూ వారి లక్ష్యాలు సాధించేలాగా తీర్చిదిద్దుతున్నామని తెలియజేస్తూ విజయం సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
6
బుధవారం | ఫిబ్రవరి 26, 2025 | www.navatelangana.com

కుర్నవల్లిలో పలు కుటుంబాలను పరామర్శించిన ఎంపీ



నవతెలంగాణ-తల్లాడ
మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలో పలు కుటుంబాలను ఖమ్మం ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి మంగళవారం పరామర్శించారు. పైలూరి వెంకట కోటారెడ్డి మరదలు చనిపోగా వారి కుటుంబ సభ్యులను, సేలం పిచ్చిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీజీబిడిసి చైర్మెన్ బువ్వ ముప్వ విజయ్ బాబు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు తెరలేపిన అభ్యర్థులు- తాయిలాలను తిరస్కరించాలి

- ఉపాధ్యాయ, అధ్యాపకులకు యూటీఎఫ్ పిలుపు

నవతెలంగాణ-ఖమ్మం
ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగియడంతో కొందరు అభ్యర్థులు ప్రలోభాలకు తెరతీశారు. ఓటర్లకు నగదు పంపిణీ మొదలుపెట్టారు. ఒక అభ్యర్థి పక్షాన గుర్తుతెలియని వ్యక్తులు రూ.2000 ఫోన్ పే చేసి పూలు అని మెసేజ్ పంపారు. కొందరు ఓటర్లు వాటిని తిరస్కరించి వాపసు చేశారు. మరొక ప్రముఖ సంఘం అభ్యర్థి పక్షాన జిల్లాలో రూ 2000 పంపిణీ చేసినట్లు సమాచారం. మరికొందరు ఇంటింటికీ రూ.2 నుండి 5 వేలు పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది. పలువురు ఉపాధ్యాయులు నగదు తీసుకోకుండా తిరస్కరించారు. వారిని అభినందిస్తున్నామనిటిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్. రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులు తాము దిగజారి ఉపాధ్యాయుల విలువను దిగజార్చడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు తాము చేసిన సేవలను వివరించి ఓట్లడగటం కాకుండా డబ్బు పంపిణీ చేసి గెలవాలనుకోవటాన్ని టిఎస్ యుటిఎఫ్ తీవ్రంగా ఖండించిందన్నారు. ఎన్నికల కమిషన్ డబ్బు పంపిణీని అడ్డుకోవాలని, పంపిణీ చేసే అభ్యర్థులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

వారబందీ విధానం ఎత్తివేయాలి

లేదా అదనంగా రెండు రోజులు ఇవ్వాలి : రైతులు

- నాలుగు రోజులలో సాగర్ నీటిని విడుదల చేస్తారు
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య
- రైతుల ఆందోళనతో దిగివచ్చిన అధికారులు
- 'నవతెలంగాణ'కు రైతులు అభినందనలు



నవతెలంగాణ-బోనకల్
మూడు, నాలుగు రోజులలో సాగర్ నీటిని విడుదల చేస్తారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య రైతులకు తెలిపారు. వారబందీ విధానం ఎత్తివేయాలని లేదా అదనంగా రెండు మూడు రోజులపాటు సాగర్ నీటిని ఇవ్వాలని అన్నదాతలు ఆయనను కోరారు. లేత మొక్కజొన్న పంట మొత్తం కంకి దశలో ఉందని ఈ సమయంలో సాగునీరు అందకపోతే పంటకు చేతికి వచ్చే పరిస్థితి లేదని అన్నదాతలు వ్యవసాయ శాఖ అధికారుల ముందు తమ గోడును వెళ్ళబుచుకున్నారు. తమ సమస్యను, ఆందోళనను వ్యవసాయ అధికారులకు సమగ్రంగా కథనం ఇచ్చి తమకు అండగా ఉన్న నవతెలంగాణకు నారాయణపురం రైతులు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

కలకోట మేజర్ కింద సాగు చేసిన మొక్కజొన్న పంట సాగునీటి సమస్యతో ఎండిపోతున్నాయని నారాయణపురం రైతులు సోమవారం మండల కేంద్రంలో ఆందోళన చేసిన సంగతి విధితమే. దీంతో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి మొక్కజొన్న పంటలను పరిశీలించడానికి నారాయణపురం వెళ్లారు.

గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య, మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు స్వర్ణ విజయ్ చంద్ర, బోనకల్ నీటి పారుదల శాఖ డీఈఈ తమ్మారపు వెంకటేశ్వర్లు కలకోట మేజర్ సాగునీటి ఎద్దడితో దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను మంగళవారం పరిశీలించారు. మొక్కజొన్న ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆలస్యంగా వేసిన మొక్కజొన్న పంటకు త్వరగా నీరు విడుదల చేసినట్లయితే సమస్య ఏమి వుండదని రైతుల వారికి వివరించారు. కంకి వేసే దశలో సాగునీరు లేకపోతే పంట మొత్తం చేతికి వచ్చే పరిస్థితి ఉండదని రైతులు అధికారులకు వివరించారు. వారబంధి విధానంలో నీటిని విడుదల చేస్తూ ఒకటి లేదా రెండు రోజులు అదనంగా సాగర్ నీరు ఇస్తే ఇబ్బంది ఉండదని వివరించారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య మాట్లాడుతూ రాబోయే 3 లేదా 4 రోజుల్లో నీటిని విడుదల చేస్తారని, ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తాము నీటిపారుదల శాఖ అధికారులు తీసుకెళ్లినట్లు తెలిపారు. ఒకవేళ ఎక్కడైనా పంట వడలినట్లు అనిపిస్తే 2 శాతం యూరియా ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఎరువుల వినియోగంలో యూరియా అవసరం మేరకు, సిఫారసు చేసిన మోతాదులో మాత్రమే రైతులు వినియోగించుకోవాలని సూచించారు. మన భూముల్లో అధికంగా బాస్వర నిల్వలు ఉన్నాయని, అందువల్ల పై పాటుగా మాత్రమే కాంప్లెక్స్ ఎరువులు వినియోగించాలని రైతులకు సూచించారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో అర్హులైన రైతుల ఫిజికల్ వెరిఫికేషన్ సకాలంలో పూర్తి చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు.

మండల కేంద్రంలో గల రైతు వేదిక నందు ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఏఈ పిల్లలమర్రి ఏడుకొండలు, వ్యవసాయ విస్తరణ అధికారులు షేక్ హుస్సేన్ సాహెబ్, నాగినేని నాగసాయి, గ్రామ రైతులు కోట నాగరాజు, సూర్యదేవర సుధాకర్ బాబు, బత్తినేని సుబ్బారావు, మొడితోక వెంకటరత్నం, గూడేల్లి లక్ష్మణ్, కోట చిరంజీవి, జింగుపల్లి గోపి, తదితరులు పాల్గొన్నారు.

- ప్రతీ మసీదు వద్ద పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ
- తాగునీటి సరఫరా, విద్యుత్ సంబంధిత మరమ్మతులు ఏదైనా ఉంటే వెంటనే పూర్తి చేయాలి
- ముస్లిం మత పెద్దలు, సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం



- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ప్రశాంత వాతావరణంలో
రంజాన్ మాసం నిర్వహణకు ఏర్పాట్లు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్
ప్రశాంత వాతావరణంలో పవిత్ర రంజాన్ మాసం నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్, ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో రంజాన్ మాసం ప్రశాంత వాతావరణంలో నిర్వహణకు, చేపట్టాల్సిన ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ సునీల్ దత్, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ముస్లిం మత పెద్దలు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచనలు జారీ చేస్తూ, రంజాన్ మాసం ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ముస్లిం ప్రతినిధులకు సూచించారు. ప్రతీ మసీదు దగ్గర పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, ఏదైనా మసీదు దగ్గర తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరాకు సంబంధించి ఏదైనా పనులు ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. గ్రామ పంచాయతీలలో ఉన్న మసీదుల జాబితా తయారు చేసి రెగ్యులర్ గా అక్కడ పారిశుధ్య పనులు జరిగేలా పంచాయతీ అధికారి చర్యలు తీసుకోవాలన్నారు. సాయంత్రం ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మసీదు చుట్టు పక్కల ఉన్న వీధిలైట్లు, హైమాస్ లైట్లు వెలగాలని, రంజాన్ పర్వదినం నాడు ఈద్గా వద్ద చెత్త తొలగించే విధంగా ఏర్పాట్లు చేయాలని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు.

పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ రంజాన్ మాసం నేపథ్యంలో పటిష్ట బందోబస్తు చేయడంతో పాటు, ఎక్కడా కూడా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు, రాత్రిపూట పెట్రోలింగ్ ముమ్మరం చేయనున్నట్లు తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే పోలీస్ శాఖ దృష్టికి తీసుకొని రావాలని, ప్రతి మసీదు పరిసరాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ముస్లిం మత పెద్దలకు సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డా.బి.పురంధర్, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, ఆర్డీఓలు నరసింహారావు, ఎల్. రాజేందర్, నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమీషనర్ షఫీ ఉల్లా, ముస్లిం మత పెద్దలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




న్యూవిజన్‌లో ఫేర్వెల్ పార్టీ



నవతెలంగాణ-ఖమ్మం టౌన్
నగరంలోని న్యూవిజన్ పాఠశాలలో పదవతరగతి 2024-25 బ్యాచ్ ఫేర్వెల్ పార్టీ ఈ మంగళవారం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎమ్.డి.అబాద్ అలీ తెలిపారు. ఈ సందర్భంగా న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సి.హెచ్.జి.కె. ప్రసాద్ మాట్లాడుతూ విద్యను అభ్యసించే ప్రయాణంలో 10వ తరగతి మైలురాయి అనీ, దీనిని దాటే సమయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రణళికతో చదివితే మంచి మార్కులు సాధిస్తారని తెలిపారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతి ఏడాది ఉత్తమ గ్రేడ్ పాయింట్ల తో తెలంగాణ రాష్ట్రంలోనే న్యూవిజన్ బెస్టు స్కూల్ గా నిలించిందని తెలిపారు. విద్యార్థులు జీవితంలో ఎదగాలంటే మొదటిగా ఎదుర్కొబోయే 10వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో విజయం సాధిస్తే మిగత పరీక్షల్లో కూడ విజపదంలో ప్రయాణిస్తారని పాఠశాల అకాడామిక్ డైరెక్టర్ సి.హెచ్.కార్తీక్ తెలిపారు.

ఎస్.ఎస్.సి 2024-25 పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థినీ విద్యార్థుల విజయం కాంక్షిస్తూ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని ఆశిస్తూ... పాఠశాల దశ నుండి కళాశాల దశకు వెళ్ళే విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ నిర్వహించే ఈ ఆత్మీయ సమ్మేళనం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది.

పాఠశాల ప్రిన్సిపాల్ అబాద్ అలీ మాట్లాడుతూ విద్యార్థి దశలో అత్యంత కీలకమైన పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకొని పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధించడం సులభమని తెలిపారు. న్యూవిజన్ విద్యాసంస్థతో మరియు ఉపాధ్యాయులతో వారికున్న అనుబంధాన్ని, అనుభవాలను ఈ సందర్భంగా విదార్థులు గుర్తు చేసుకున్నారు. తదనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో న్యూవిజన్ విద్యాసంస్థల ఛైర్మన్ సి.హెచ్.జి.కె. ప్రసాద్, అకాడమిక్ డైరెక్టర్ సి.హెచ్.కార్తీక్, డైరెక్టర్ సి.హెచ్.గోపిచంద్, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ అబాద్ అలీ, జె.వి.మైఖేల్, సి.హెచ్.మాధవి, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలి

సీఐటీయూ రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్ పిలుపు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్
ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్, వై. విక్రమ్‌లు అన్నారు. సీఐటియు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం త్రీ టౌన్‌లో ఆర్‌జెసి కాలేజీలో ప్రయివేట్ టీచర్స్‌ని కలిసి వారిని ఓటు వేయవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం- నల్గొండ- వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో అలుగుబెల్లి నర్సిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని వారు కోరారు. ఆరు సంవత్సరాలు నర్సిరెడ్డి ఎమ్మెల్సీగా కొనసాగారని, ఆయనను ఎమ్మెల్సీగా ఎన్నుకున్న తర్వాత ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం శాసనమండలిలో వారి గళాన్ని వినిపించడంలో ముందున్నారన్నారు. విద్యారంగ సమస్యలను కూడా ఆయన వెలికి తీసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేశారన్నారు. కాబట్టి ఇక ముందు కూడా ఎన్నికలలో నర్సిరెడ్డిని గెలిపిస్తే ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండి అంతా మంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హమాలీ యూనియన్ నాయకులు భూక్య శ్రీనివాసరావు, వజేనేపల్లి శ్రీనివాసరావు, షేక్ హిమామ్, యర్రా రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

మార్తి రంగయ్య ఆశయ సాధనకు ఉద్యమించాలి

- సీపీఐ(ఎం) జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు

నవతెలంగాణ-నేలకొండపల్లి
ప్రజా కళాకారుడు సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు మారుతి రంగయ్య ఆశయ సాధనకు ప్రతీ కార్యకర్త ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి మండలంలోని గువ్వలగూడెం గ్రామంలో పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో మార్తి రంగయ్య 24 వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతి రంగయ్య చిన్ననాటి నుండి కళా రంగం పట్ల ఆసక్తితో ప్రజా నాట్యమండలిలో చేరి తన కళారూపాలతో జిల్లా వ్యాప్తంగా అనేక ప్రదర్శనలు చేసి ప్రజలను చైతన్యవంతం చేశారన్నారు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమ స్ఫూర్తిని రగిలించాడన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై కళారూపాలను రూపొందించి అందుకు అనుగుణంగా వందలాదిమంది కళాకారులను తయారుచేసి ఉద్యమ బాట పట్టించారన్నారు. ప్రజానాట్యమండలిలో తన చివరి శ్వాస వరకూ ప్రదర్శనలు చేస్తూ కళా రంగానికే వన్నెతెచ్చారన్నారు. నేడు భౌతికంగా ఆయన లేకపోయినా కళ్లకు కట్టినట్లుగా రంగయ్య ప్రదర్శించిన అనేక కళారూపాలు ప్రజల మదిలో మెదులుతూనే ఉంటాయన్నారు. రంగయ్య ఆశయ సాధనకు ఆయన కళాస్ఫూర్తిని నేటితరం యువత కళాకారులు కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు దండా సూర్యనారాయణ, మారుతి కొండలరావు, శాఖ కార్యదర్శి మారుతి సూర్యనారాయణ, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొని నివాళులర్పించారు.



సీతారత్నానికి ఘన సన్మానం

నవతెలంగాణ-కల్లూరు
ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగి క్రమశిక్షణకు, విద్యా ప్రమాణాలు పెంచడం కోసం ఎనలేని కృషి చేసి ఉద్యోగ విరమణ సందర్భంగా మేకల సీతారత్నం పారా కొండలరావు దంపతులను మంగళవారం మర్లపాడు ప్రాథమికొన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమ్లా నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మండల పరిధిలోని మర్లపాడు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మేకల సీతారత్నం ఈనెల 28న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు ముందస్తుగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. 28 సంవత్సరాలు పాటు ఉద్యోగ బాధ్యతలు అంకిత భావంతో చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చిన్న కోరుకొండి కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు రమణ, యుూటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు రాయల నాగేశ్వరరావు, కే.విజయ్ కుమార్, పిఆర్‌టియు నాయకులు నంద్యాల వెంకటేశ్వరరావు, నామ కృష్ణమూర్తి, టిపిటిఎఫ్ నాయకులు ఉపాధ్యాయులు విద్యార్థులు బంధుమిత్రులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.



వార బంధీ సడలించి సాగర్ ఆయకట్టు చివరి భూములకు సాగు నీరు అందించాలి

- ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌కి తెలంగాణ రైతు సంఘం వినతి

నవతెలంగాణ-ఖమ్మం
సాగర్ ఆయకట్టు చివరి భూముల్లో పంటలు ఎండిపోకుండా కాపాడాలంటే వార బంధీ సడలించి, పూర్తి స్థాయిలో సాగు నీరు అందించాలని తెలంగాణ రైతు సంఘం బృందం ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌కి విజ్ఞప్తి చేసింది. మంగళవారం తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ అధ్యక్షులు మాదినేని రమేష్, కార్యదర్శి బొంతు రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ కె మీరా, నీటి సంఘం మాజీ చైర్మెన్ తోట వెంకటరెడ్డి తదితరులు ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ రమేష్ బాబు, ధనకుమార్ రెడ్డిలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ రబీ సీజన్లో గంత కంటే ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు కావడం, మొక్కజొన్న గింజ అవుతున్న దశలో సాగు నీరు ఎక్కువ అవసరం అవుతుందన్నారు. దానితో పాటు ఎండల తీవ్రత పెరగడంతో నీరు ఒత్తిడి పెరుగుతుందని అన్నారు. వార బంధీ సడలించి బిబిసి, మధిర బ్రాంచి పరిధిలో అన్ని మేజర్లుకు అవసరమైన నీరు అందించాలని కోరారు. సాగర్ ఆయకట్టు పరిధిలో పంటలు ఎండిపోకుండా నీరు సరఫరా చేస్తామని

నర్సిరెడ్డిని గెలిపించాలి

- యుూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్.నాగేశ్వరరావు



నవతెలంగాణ-ఏన్కూరు
ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డికి అత్యధిక మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిపించాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్.నాగేశ్వరరావు కోరారు. నర్సిరెడ్డి గెలిస్తేనే ఓటర్లు గెలిచినట్లని, ఇంకెవరు గెలిచినా వారు వెంటనే అధికార పార్టీ చేరిపోయే అవకాశం ఉందని అప్పుడు ఓటర్ ఓడిపోతాడని అన్నారు. నర్సిరెడ్డి మాత్రమే గత ఆరేళ్ళుగా నిజమైన ఉపాధ్యాయ ప్రతినిధిగా వ్యవహరిస్తూ నిత్యం నియోజకవర్గంలో పర్యటిస్తూ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారాని, నర్సిరెడ్డి చొరవతోనే టెట్ నివాదం పరిష్కారమైందని, వేలాది మంది ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతలు వచ్చాయన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిమ్మరావుపేట పాఠశాలలో బి.రాంచంద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నెల మొదటి తేదీన వేతనాలు ఇస్తామన్న హామీ మోడల్ స్కూల్స్, గురకులాలు, కేజీబీవీల్లో అమలు జరగడం లేదన్నారు. రెండేళ్లుగా ఉపాధ్యాయుల సప్లమెంటరీ బిల్లులు, సెలవు జీతాలు, మెడికల్ రీయింబర్స్మెంట్, జిపిఎఫ్, జిఎల్ఐ తదితర బకాయిలు ట్రెజరీలో ఆమోదం పొందినప్పటికీ ఇ-కుబేర్ లో పెండింగ్ లో ఉన్నాయని, రిటైరైన ఉద్యోగుల గ్రాట్యుటీ, కమ్యుటేషన్ తదితర రిటైర్మెంట్ బెనిఫిట్స్ సంవత్సర కాలంగా విడుదల కాకపోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మూడ్ పుల్లయ్య, యుూటీఎఫ్ నాయకులు నర్సింహారావు, గోపాల్, రవికుమార్, వై.నాగేశ్వరావు, సింగ్యా తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యను పెంపొందించాలి

సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్



- ఘనంగా వికాస్ స్కూల్ వార్షికోత్సవం

నవతెలంగాణ-ఖమ్మం
విద్యార్థులకు శాస్త్రీయ విద్యను పెంపొందించాలని సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ అన్నారు. మంగళవారం రాత్రి జరిగిన వికాస్ స్కూల్ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. స్కూల్ చదువు విద్యతో పాటు శాస్త్రీయత కూడిన విద్య కూడా నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియా హవా నడుస్తున్న కాలంలో చిన్నప్పుడే నుంచి విద్యార్థులను జాగ్రత్తగా గమనించాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు ప్రశ్నించే ధైర్యం పెంచాలని కోరారు. ర్యాంకులే జీవితం కాకుండా సమాజంలో జరుగుతున్న విషయాలను కూడా విద్యార్థులకు నేర్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికాస్ స్కూల్ యాజమాన్యం వై.లావణ్య, కిషోర్, ఎమ్మెల్సీ తాతా మధు, వివిధ పార్టీల నాయకులు క్రాంతి శ్రీనువాసురావు, కాంతారావు, మిక్కిలినేని మంజుల తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత తల్లాడకు కృషి చేద్దాం

నవతెలంగాణ-తల్లాడ
తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రామచంద్రాపురం గ్రామపంచాయతీలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారి నుండి కళ్లే నమూనాలు సేకరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భాస్కర్ మాట్లాడుతూ.. తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రతి పంచాయతీని టీబీ ఫ్రీ పంచాయతీగా మార్చేందుకు, టీబీ నిర్మూలన విభాగంలోని సూపర్వైజర్ వై.సురేష్, ల్యాబ్ సూపర్వైజర్ సంజయ్ కుమార్, వైద్య సిబ్బంది సహకారంతో పనిచేస్తున్నారన్నారు. రామచంద్రాపురం గ్రామ పంచాయతీని టీబీ ఫ్రీ పంచాయతీగా మార్చడం కోసం ప్రజలకు అవగాహన కల్పించి, వ్యాధి లక్షణాలున్న వారి నుండి శాంపిల్స్ సేకరించామన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు కర్చీఫ్ నోటికి అడ్డు పెట్టుకోవడం వల్ల, వ్యాధి పక్కవారికి వ్యాపించకుండా నిర్మూలించవచ్చు అన్నారు.

స్నానాల లక్ష్మీపురం జాతరకు పూర్తిస్థాయి బందోబస్త్

- వైరా సీఐ సాగర్



నవతెలంగాణ-వైరా
మండలంలోని స్నానాల లక్ష్మి పురం గ్రామంలో మంగళ వారం అర్ధరాత్రి నుండి జరిగే శివరాత్రి జాతరకు 9 మంది ఎస్ఐలు, 110 మంది పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వైరా సిఐ నున్నావత్ సాగర్ తెలిపారు. గ్రామంలోని పురాతన రామలింగేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం శివ పార్వతుల కళ్యాణ మహోత్సవానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నందిని దంపతులు హాజరు కానున్నారు. స్వగ్రామంలో జరగనున్న కళ్యాణ మహోత్సవానికి ప్రతి సంవత్సరం ఆనవాయితీగా భట్టి విక్రమార్క దంపతులు హాజరు అవుతారు. ఈ దృష్ట్యా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ మండలాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు జాతరకు తరలి రానున్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఎస్పి సునీల్ దత్ ఆదేశాల మేరకు ఇద్దరు ఏసిపిలు ఇద్దరు సిఐల పర్యవేక్షణలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూస్తామన్నారు. మొత్తం మూడు పార్కింగ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాసులు ఉన్నవారు పోలీస్ వారికి చూపించాలని, ప్రతి ఒక్కరూ జాతర నిర్వాహణకు సహకరించాలని కోరారు. అత్యవసర విభాగాలు, వైద్య శిబిరం, మంచినీటి సరఫరా తదితర ఏర్పాట్లతో పాటు జాతరలో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులపై డేగ కన్నుతో పరిశీలన ఉంటుందని, ఏటువంటి వ్యక్తులను వెంటనే అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతామని సిఐ సాగర్ తెలిపారు.

ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని ఎంపీకి వినతి



నవతెలంగాణ-తల్లాడ
ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని ,మార్కెడ్, నా ఫెడ్ సంస్థల ద్వారా క్వింటా మిర్చిని 25 వేల చొప్పున కొనుగోలు చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని, వ్యవసాయానికి కేంద్ర బడ్జెట్లో అధిక నిధులు కేటాయించాలని, తదితర సమస్యలపై పార్లమెంట్ బడ్జెట్ సమావేశంలో చర్చించాలని, కోరుతూ వినతి పత్రం అందజేసినట్లు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సేలం సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ కృష్ణయ్య, నల్లమోతు మోహన్ రావు, అయినాల రామలింగేశ్వర రావు, పైలూరి రామిరెడ్డి, కట్ట దుర్గారావు, కైలూరి సత్యనారాయణ రెడ్డి, బొగ్గుల లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లను బాధితులకు అందజేసిన ఎస్పీ

నవతెలంగాణ-కొత్తగూడెం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మొబైల్ ఫోన్లను పోగొట్టుకుని, పోలీసులకు ఫిర్యాదుచేసిన బాధితులకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి తిరిగి వారికి అందజేయడం జరుగుతుందని ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అందుకున్న ఫిర్యాదులతో బాధితులు కోల్పోయిన మొబైల్ ఫోన్లను కనిపెటినట్టు తెలిపారు. గత రెండు నెలల వ్యవధిలో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న 170 మంది బాధితులకు వారి ఫోన్లను మంగళవారం అప్పగించారు. మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్లో ఆన్‌లైన్ ద్వారా అడిగిన అన్ని రకాల వివరాలను కచ్చితంగా నమోదు చేసుకుంటే సంబంధిత పోలీస్ స్టేషన్ నుండి తిరిగి వారి మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి కనిపెట్టడం జరుగుతుందన్నారు. మొబైల్ దొంగిలించబడినా, పోగొట్టుకున్నా వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తిరిగి వారి మొబైల్ ఫోన్లను పొందవచ్చునని తెలిపారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను అవతల వ్యక్తి వినియోగించాలని ప్రయత్నించినప్పుడు మాత్రమే అట్టి మొబైల్‌ను ట్రేస్ చేయగలమని అన్నారు. ఈ సందర్భంగా బాధితుల మొబైల్ ఫోన్లను కనిపెట్టి వారికి అందజేయడంలో కృషి చేసిన జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఐటీ సెల్ ఇన్‌చార్జి సీఐ నాగరాజు రెడ్డి, ఐటీ సెల్ సభ్యులు విజయ్, నవీన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మార్చి 9న జననేత కాసాని సంస్మరణ సభ

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని

నవతెలంగాణ-కొత్తగూడెం



పీడిత ప్రజల ప్రియతమ నేత, అమరజీవి, కామ్రేడ్ కాసాని ఐలయ్య సంస్మరణ సభ మార్చి 9వ తేదీన ఏర్పాటు చేస్తున్నట్టు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేనీ సుదర్శన్ రావు తెలిపారు. స్థానిక మంచికంటి భవన్‌లో మంగళవారం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ అధ్యక్షతన జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించగా పోతినేని హాజరై మాట్లాడారు. నిరంతరం ప్రజల కోసం పరితపించిన వ్యక్తి కాసాని అని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జిల్లా నాయకుడిగా, పార్టీ నిర్మాణానికి విశేషమైన కృషి చేశారని తెలిపారు. ప్రత్యేకించి ఇళ్ల స్థలాల పోరాటాలు నిర్వహించి వేల మందికి ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో కాసాని కృషి మరువలేనిది అని కొనియాడారు. కామ్రేడ్ కాసాని జీవితం ఆయన వ్యక్తిత్వం కమ్యూనిస్టు నాయకుడిగా ఆదర్శ వంతమైన జీవితాన్ని గడిపిన జీవిత విశేషాలను నేటి తరానికి వివరించడం, భవిష్యత్‌లో కాసాని స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించడానికి సన్నద్ధం చేయడానికి సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సభకు అఖిలభారత, రాష్ట్ర నాయకత్వం హాజరవుతారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. అదేవిధంగా జిల్లాలో ఈదురుగాలులు, అకాల వర్షాలు కారణంగా పంట నష్ట పోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, అధికారులు క్షేత్ర స్థాయి సర్వే నిర్వహించి నష్ట పరిహారం అంచనా వేయాలని కోరారు. తిరిగి పంట వేయడానికి అవసరమైన పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వమే అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏజె.రమేష్, ఎం.జ్యోతి, ఎంబి.నర్సారెడ్డి, లిక్కి బాలరాజు, కారం పుల్లయ్య, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మ, కొండపల్లి శ్రీధర్, ఎస్ఏ.నబీ, దొడ్డా రవి, పద్మ, వీర్ల రమేష్, గడ్డం స్వామి, భూక్యా రమేష్, యాస నరేష్, సాంబశివ, మొరాంపూడి శ్రీవాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు వడదెబ్బకు గురికాకుండా చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



వడదెబ్బకు ప్రజల గురికాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులకు ఆదేశించారు. తీవ్రమైన ఎండ వడదెబ్బపై జిల్లా ట్రాన్స్‌ఫర్ట్ మీటింగ్ కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఎండ, వడదెబ్బలకు ప్రజలు గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎండాకాలంలో తీవ్ర ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అత్యవసరం ఉంటేనే తప్ప బయటకు రాకూడదని, ముఖ్యంగా 60 సంవత్సరాలు పైబడిన వృద్దులు బయటకు వెళ్లకూడదని సూచించారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశంలో గ్రీన్ షేడ్ నెట్స్ లేదా టెంట్స్ వేయించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశాలు ఇచ్చారు. ప్రతి ఆశా వర్కర్స్ వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లను తగినంత ఉంచుకొని ప్రజలకు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎండ తీవ్రతను ఎదుర్కొనుటకు తీసుకోవలసిన జాగ్రత్తలకు సంబంధించిన పోస్టర్స్ పాంప్లెట్స్‌లను ఆవిష్కరించారు. వీటిని సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎల్ భాస్కర్, డీడబ్ల్యుఓ లెనినా జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వి.మధువరన్, ఇతర జిల్లా స్థాయి ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

జామాయిల్ తోటను దోచుకెళ్లిన దుండగులు

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- దళారులకు అండగా పోలీసులు

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలోని గంగారం పంచాయతీలోని సంపత్ నగర్ గ్రామంనకు చెందిన సర్వేనెంబర్ 33/2/84, పట్టా నెంబర్ 670లో గల 20 ఎకరాల సాగు భూమిలో గత 60 సంవత్సరాల నుండి వ్యవసాయం చేసుకుంటూ పంటను పండిస్తున్నానని రైతు మద్దిపాటి వెంకటేశ్వరరావు మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. సంపత్ నగర్ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (78) తన సొంత వ్యవసాయ క్షేత్రంలో గత కొద్ది సంవత్సరాలుగా జామాయిల్ తోటను పండిస్తున్నాడని తెలిపారు. రైతు స్వగ్రామం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం రామన్న గూడెంకు చెందిన వ్యక్తిగా, ప్రస్తుతం మండలంలోని సంపత్ నగర్ నివాసం ఉంటూ, 20 ఎకరాల భూమిలో జామాయిల్ తోటను సాగు చేస్తున్నట్టు తెలిపారు. మొదటి పంటను మూడు సంవత్సరాల క్రితం నరికి, రెండో పంట చేతికి రావడంతో, కోతకు బేరగాళ్లను మాట్లాడుతున్న క్రమంలో తన తోటలో కొందరు తెలియని వ్యక్తులు జామాయిల్ తోటను నరికి ట్రాక్టర్లో తరలిస్తున్నారని, సమాచారం రావడంతో రైతు అక్కడికి వెళ్లి ట్రాక్టర్లను ఆపి విచారించినట్టు తెలిపారు. చింతోనిచెలక గ్రామానికి చెందిన ఏలూరు కోటేశ్వరరావు, సంపత్ నగర్‌కు చెందిన కొమరం చిట్టిబాబు అనే ఇద్దరు వ్యక్తులు తోట తమదే అని, శంకర అనే వ్యాపారితో బేరం మాట్లాడుకుని, కూలీల సాయంతో జామాయిల్ మొక్కలు నరికించి, రవాణా చేశారని తెలిపారు. ఈ విషయంపై కాంట్రాక్టర్ శంకర్‌కు ఫోన్ చేయగా, ఆ భూమి యజమానులు ఏలూరు కోటేశ్వరావు, చిట్టిబాబులు ఐదు లక్షలకు అమ్మారని సమాధానం చెప్పినట్లు తెలిపారు. చిట్టిబాబుకి ఫోన్ చేయగా మీ మీద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతామని, మీ అంత చూస్తామని, మీరు ఏమి చేయలేరని, మీరు ఎక్కడ నుంచో వచ్చి, ఏజెన్సీ ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్నారని, 170 యాక్ట్‌లో ఉన్న భూముల్లో, మీరు ఎలా వ్యవసాయం చేస్తారని, నాకు రౌడీ మాములు ఇవ్వకపోతే, మీ అంత తేలుస్తాయని, మీ భూములు కబ్జా చేస్తానని, బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై 100కి ఫోన్ చేయగా పోలీసులు స్పందించలేదని తెలిపారు. తమ తోటలో అక్రమంగా కలపను నరికి తీసుకెళ్తున్న వారిపై స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి వెళ్లినా పోలీసులు స్పందించలేదని, ఈనెల 21న సంఘటన జరిగిన, నేటి వరకు పోలీసులు కేసు నమోదు చేయకుండా ఆలస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీసులు తన తోటను ధ్వంసం చేసి, దోచుకుని వెళ్తున్న దొంగలపై కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

ఉద్యమ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి

- పాత్రికేయుల సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, టీపీటీఎఫ్ మాజీ నాయకులు రామాచారి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్/పాల్వంచ



ఈ నెల 27 తారీఖున జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో టీపీటీఎఫ్ ఇతర ఉద్యమ సంఘాలు బలపరుస్తున్న టీఎస్ యూటీఎఫ్ ఉద్యమ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి సీరియల్ నెంబర్ 4పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, టీపీటీఎఫ్ మాజీ నాయకులు రామాచారి కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం స్థానిక టీఎస్ యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం, పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజు మాట్లాడారు. 2019 మార్చి 22న జరిగిన ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలుపొందారని, గెలిచిన నాటినుండి ఉపాధ్యాయుల మధ్యనే ఉంటూ విద్యారంగ పరిరక్షణతో పాటు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యల పరిష్కారానికి పోరాట నిర్వహించి విజయాలు సాధించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ప్రకటించిన 7.5 పీఆర్‌సీని వ్యతిరేకిస్తూ 30% ఫిట్మెంట్లతో పీఆర్సిని అమలు చేయాలని కోరుతూ శాసనమండలిలో గొంతెత్తటమే కాకుండా ఇందిరాపార్క్ వద్ద నర్సిరెడ్డి నిరాహార దీక్ష సైతం చేశారని అన్నారు. పీఆర్‌సీ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఇవ్వాలని పోరాటం చేసిన ఏకైక వ్యక్తి నర్సిరెడ్డి అని స్పష్టం చేశారు. జూనియర్ డిగ్రీ కళాశాల కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణలో నర్సిరెడ్డి కృషి మరువలేని రాజు అన్నారు. ఉపాధ్యాయ ప్రమోషన్లు బదిలీలకు టెట్ సమస్య ప్రధాన అడ్డంకిగా ఉన్న సమయంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ఢిల్లీకి వెళ్లి యూసీటీ చైర్మెన్ అదేవిధంగా సెక్రటరీతో మాట్లాడి సమస్యను పరిష్కరించారని గుర్తు చేశారు. ఐదు రకాల గురుకులాల సమయ మార్పిడి, హెల్త్ కార్డులు, డిప్యూటీ వార్డుల పోస్టుల మంజూరు తదితర సమస్యల పరిష్కారానికి నర్సిరెడ్డి పోరాటాలు నిర్వహిస్తారని అన్నారు.

విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నర్సిరెడ్డిని గెలిపించాలి

విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం మండలి లోపల ప్రశ్నించే గొంతుక ప్రజాక్షేత్రంలో పోరాడే ఉద్యమ దీపిక అలుగుబెల్లి నర్సిరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతోనే గెలిపించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు రామాచారి కోరారు. నర్సిరెడ్డి పదవీకాలంలో ఆరు సంవత్సరాల పాటు అనేక ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారంతోపాటు విద్యారంగ పరిరక్షణకు కృషి చేశారని అన్నారు. ఆరు సంవత్సరాల కాలంలో తనకొచ్చిన నిధుల ఖర్చు వివరాలను డాక్యుమెంట్ రూపంలో బహిర్గతపరిచిన ఏకైక ప్రజాప్రతినిధి నర్సిరెడ్డి అని రామాచారి తెలిపారు. ఈ పాత్రికేయుల సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.మురళీమోహన్, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి, మండల అధ్యక్షులు కొమర శ్రీనివాస్, తదితరులు పాల్గొని మాట్లాడారు.
పాల్వంచలో జరిగిన విలేకర్ల సమావేశంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి వెంకటేశ్వర్లు, టీపీటీఎఫ్ సీనియర్ నాయకులు ఎం.రామాచారి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్కె పాషా, పాల్వంచ మండల అధ్యక్షులు ఏ.విజయభాస్కర్, టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఉమాదేవి, నాయకులు టి.బాలు, ఏ.రసింహారావు, ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీలో ప్రతిభ కనబరిచిన స్థానిక విద్యార్థి

- అభినందించిన ఎంజేపీ టీబీసీ బాలుర పాఠశాల ప్రిన్సిపాల్

నవతెలంగాణ-అశ్వారావుపేట



స్థానిక మహాత్మా జ్యోతి రావు పూలే వెనుకబడిన తరగతుల బాలుర గురుకుల పాఠశాలకు చెందిన కాట్రాల అశోక్ కుమార్ కబడ్డీలో రాష్ట్ర స్థాయి ప్రతిభ కనబరిచారు. ఖమ్మం జిల్లా, పెనుబల్లి మండలం, టేకులపల్లికి చెందిన కాట్రాల నాగరాజు, సత్యవతిల కుమారుడు అశోక్ ఈ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న కొత్తగూడెం కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్ మండలాల కబడ్డీ పోటీల్లో గెలుపొంది అంతర్ జిల్లా పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 20 నుండి 23 వరకు వికారాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 34వ బాల బాలిక సబ్ జూనియర్ చాంపియన్ షిప్ పోటీలను వికారాబాద్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న అశోక్ రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి విజయం సాధించాడు. వికారాబాద్ కబడ్డి అసోసియేషన్ చేత ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందుకున్నాడు.
క్రీడల్లో పాల్గొని విజయంతో పాఠశాలకు చేరిన అశోక్‌ను ప్రిన్సిపాల్ రేణుక రాణి మంగళవారం పాఠశాల అభినందన సభ ఏర్పాటు చేసి సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మా పాఠశాలకు చెందిన అశోక్ కుమార్ మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి, జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి వెళ్లడానికి ఎంతో కృషి చేశాడని, నిరుపేద కుటుంబానికి చెందిన అశోక్ కుమార్ క్రీడల పట్ల ఆశక్తి, చదువు పట్ల శ్రద్ధ చూపించడం గర్వకారణం అన్నారు. కష్టపడే వ్యక్తిత్వం, ఆ వ్యక్తిత్వమే ఈరోజు రాష్ట్రస్థాయిలో ఎంపిక అయ్యేలా చేసింది అన్నారు. అశోక్ కుమార్‌కు క్రీడలు పట్ల ఉన్న ఆసక్తిని గమనించిన పీఈటీ వసంత్ అశోక్ కుమార్‌కు క్రీడలకు సంబంధించిన నియమ నిబంధనలు, ఆడే విధానంలో లోటుపాట్లను చక్కగా వివరిస్తూ తన వంతు పాత్ర పోషించారని అన్నారు.



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన మెచ్చా

నవతెలంగాణ-దమ్మపేట

మండల పరిధిలోని దిబ్బగూడెం ఏర్పాటు చేసిన గ్రామ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. రిబ్బన్ కట్‌చేసి పోటీలను ప్రారంభించిన మెచ్చా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండలు విపరీతంగా ఉన్న నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ పోటీలను నిర్వహించు కోవాలని, క్రీడల వల్ల శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించి క్రీడాకారుల మధ్య స్నేహ బంధాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు దార యుగంధర్, అంకత ఉమామహేశ్వరరావు, మాజీ సర్పంచ్ కునుసోత్ చిట్టిబాబు, మహిళ నాయకురాలు వెంకమ్మ, నాగేంద్ర, కె బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణానికి ముస్తాబైన శైవ క్షేత్రాలు

- ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో '1008 బ్రహ్మసూత్ర లింగ దర్శనం'

నవతెలంగాణ-దుమ్ముగూడెం



నేటి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు శైవ క్షేత్రాలు శివపార్వతుల కళ్యాణానికి ముస్తాబయ్యాయి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో గల గంగా గౌరీ సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయం, చిన్న బండి రేవు గ్రామంలో గల పర్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంతో పాటు నరసాపురం గ్రామంలో గల ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం (చిన్న అరుణాచలం)లను మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శివరాత్రి సందర్భంగా ఉదయం నుండి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలతో పాటు విశేష పూజలు నిర్వహించనున్నారు. రాత్రి 9:30 గంటల నుండి అశేష భక్తజనం నడుమ శివపార్వతుల కళ్యాణాన్ని పురోహితులు శాస్త్రోక్తకంగా నిర్వహించనున్నారు.

'1008 బ్రహ్మసూత్ర లింగ దర్శనం':
మండలంలోని నర్సాపురం గ్రామంలో గల ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం (చిన్న అరుణాచలం)లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని తెల్లవారుజామున నాలుగు గంటల నుండి భక్తులచే విశేష అభిషేకాలు నిర్వహించుకునే అవకాశాన్ని కల్పించారు. దీంతోపాటు రాత్రి 8 గంటల నుండి లింగోద్భవ కాలం రాత్రి 12 గంటల వరకు 'మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటలకు శ్రీ అపీతకుచాంబిక సమేత అరుణాచలేశ్వర స్వామి వారి కళ్యాణం నిర్వహించనున్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్ర దర్శనం అరుణాచల ప్రతిఫలం



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం (చిన్న అరుణాచలం) స్వామివారి దర్శనం అరుణాచల దర్శనం ప్రతిఫలం కలిగిస్తుంది. ఈ ఆలయంలో భక్తులే స్వయంగా అభిషేకం చేసుకునే తృప్తి లభిస్తుంది. ఈ ఆలయంలో ప్రధాన లింగం సహస్ర లింగంతో పాటు 1007 లింగాలతో పాటు ప్రధాన లింగంతో కలిపి 1008 లింగాలు ఉంటాయి. ఈ ఆలయంలో ఉన్న సహస్ర లింగం కాశీ, శ్రీశైలం, శ్రీకాళహస్తి వంటి క్షేత్రాలలో మాత్రమే దర్శన భాగ్యం కలుగుతుంది. ఆలయంలో జ్యోతిర్లింగాలతో పాటు అష్టదిక్పాలక లింగాలు, సూర్య చంద్ర లింగాలు ఉండడం వలన అరుణాచలం వెళ్లలేని భక్తులు చిన్న అరుణాచలేశ్వర స్వామివారిని దర్శించుకోవడం వలన అరుణాచలం అరుణాచలం వెళ్ళిన భాగ్యం కలుగుతుందని ఆయన నవతెలంగాణకు తెలిపారు.

ఆలయ వ్యవస్థాపకులు శివ నాగ స్వామి

ప్రతిభ వెలికితీయడానికే ఎఫ్ఎల్ఎన్ పరీక్షలు

- బాలమేళా కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం సంతోష్

నవతెలంగాణ-ఇల్లందు



ప్రాథమిక విద్యార్థులలో ప్రతిభ వెలికితీయడానికే ఎఫ్ఎల్ఎన్ పరీక్షలు ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 21 ఫీట్ కాంప్లెక్స్ హెచ్ఎం సంతోష్ అన్నారు. కాంప్లెక్స్ లెవెల్‌లో మంగళవారం బాల మేళా పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ పరిధిలోని 11 పాఠ శాలల నుండి విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలకు ఐదుగురు చొప్పున విద్యార్థులు పాల్గొనగా వారందరికీ కాంప్లెక్స్ పద్ధతిలో తెలుగు, లెక్కలు, ఇంగ్లీష్ సబ్జెక్టులలో మల్టిపుల్ ఛాయస్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో కాంప్లెక్స్ బెస్ట్ స్కూల్‌గా 24 ఏరియా మండల పరిషత్ పాఠశాల నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసా పత్రం మెమోంటో అందించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, మిగతా పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులకు ప్రోత్సకా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇమ్మానియేల్, ఈశ్వరయ్య, రామకృష్ణ, రమేష్, లక్ష్మణ్, ఆదిలక్ష్మి లీలా ప్రసాద్, స్వరూప, వి.రమేష్, నీలిమ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్ పై 28న సదస్సు

- సీఐటీయూ, వ్యకాస

నవతెలంగాణ-ఇల్లందు




కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక బడ్జెట్ పై ఫిబ్రవరి 28న జరిగే ప్రజాసంఘాల సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా ఏలూరి భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ నబి, ఆలేటి కిరణ్ కుమార్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ మాయదారి బడ్జెట్ అని ఈ బడ్జెట్‌ను సవరణ ద్వారా ఫైనాన్స్ సపోర్టు కల్పించి రైతు వ్యవసాయ కూలీ, కార్మికులకు కనీస వేతనాలు, కూలీ రేట్ల పెంపు, కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. ఉపాధి హామీకి రెట్టింపు నిధులు, విద్య వైద్యానికి నిధులు పెంచాలని అన్నారు. సదస్సుకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే.రమేష్ ముఖ్య వక్తగా పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో తాళ్లూరి కృష్ణ, మరియా, ఎస్ కే ఫాతిమా, సీహెచ్ రాంబాయి, వెంకటమ్మ, జీ.ఉమాదేవి, ఈసం పద్మ, లక్ష్మి, సత్యనారాయణ కోరి, భాద్రు, పాషా తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి

నవతెలంగాణ-మణుగూరు

సమస్యలను పరిష్కరించాలని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకి మంగళవారం వినతి పత్రం అందజేసినట్టు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... లారీ ఓనర్స్ అసోసియేషన్ 2004లో ఏర్పాటు చేసుకున్నామని, మొదట్లో 780 లారీలు 425 మంది ఓనర్లు ఉన్నారన్నారు. నేడు 231 మంది లారీ యజమానులు 380 లారీలకు తగ్గిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. సింగరేణి యాజమాన్యం వారు ప్రతిరోజు 2500 టన్నుల నుండి 3500 టన్నుల వరకు రోడ్డు రవాణా ద్వారా పరిశ్రమలకు బొగ్గు తరలించేటట్టు మాకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లారీలకు ప్రతిరోజు 1500 నుంచి 3000 తన్నుల బొగ్గు తోలకం అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సింగరేణి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, లారీలకు లోడింగ్ కల్పించాలని సింగరేణి అధికారులు ఆదేశించారు.వ ఈ కార్యక్రమంలో లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బాల సత్యనారాయణ, సెక్రటరీ మేరెడ్డి సురేందర్ రెడ్డి, లారీ ఓనర్స్, తదితరులు పాల్గొన్నారు.



అటకెక్కిన 6 గ్యారెంటీలు

- తాగునీటి కష్టాలు తీర్చండి
- బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు

నవతెలంగాణ-చర్ల

ప్రజా ప్రభుత్వం అంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలను అటకెక్కి ఛ్చిందని మండల బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్, కో-కన్వీనర్ దొడ్డి తాతారావు, ఐనవోళ్ళపవన్ కుమార్‌లు ఘాటుగా విమర్శించారు. సూర్య నారాయణ రాజు అధ్యక్షతన సత్యనాం ాయణపురం పంచాయతీ శివలింగాపురం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామస్థాయి విస్తృతస్థాయి సమావేశం మంగళవారం నిర్వహించగా వారు పాల్గొని, మాట్లాడారు. అమలు చేయలేని 420 హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క పథకం కూడా పూర్తిగా అమచేయడం లేదన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ సైనికుడులా పని చేసి బీఆర్ఎస్ పార్టీ సర్పంచులను, వార్డు నెంబర్లను, ఎంపీటీసీలను గెలిపించి ప్రభుత్వానికి మన ఓటు ద్వారా నిరసన తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్‌చార్జి కుంజా నాగేశ్వరరావు, బీసీసెల్ అధ్యక్షుడు గోరంట్ల వెంకటేశ్వరావు, సీనియర్ నాయకులు తడికల బుల్లేబ్బాయి, అంబోజి సతీష్, పాయం తిరుపతి, మిడయం రాజు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మహిళ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

- పోలీసుల ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు
- క్రీడాకారులు తమ తమ టీం పేర్లు నమోదు చేసుకోండి
- సీఐ ఏ.రాజు వర్మ



నవతెలంగాణ-చర్ల

యువత క్రీడల పట్ల అమితమైన ఆసక్తి చూపాలని సీఐ ఏ.రాజు వర్మ అన్నారు. మంగళవారం నవతెలంగాణతో మాట్లాడుతూ మార్చి నెల 5, 6, 7 తేదీలలో చర్ల పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించే మండల స్థాయి వాలీబాల్ పోటీలలో పెద్ద ఎత్తున యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యువత చదువుతోపాటు క్రీడల పట్ల మక్కువను పెంచుకొని క్రమశిక్షణతో ఎదగాలని ఆయన సూచించారు. చర్ల పోలీస్ స్టేషన్లో నిర్వహించే ఈ క్రీడలలో చర్ల మండల క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని, సొంత టీములు మాత్రమే టోర్నీలో పార్టిసిపేట్ చేయాలని, ఒక టీంలో పాల్గొనే క్రీడాకారులు వేరే టీంలో ఆడుటకు అనుమతి ఉండదన్నారు. నేషనల్ ప్లేయర్స్ ఈ టోర్నీ ఆడకుండా ఉండి క్రీడాకారులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. నిర్వహణ కమిటీ నిర్ణయించిన నిబంధనలకు లోబడి టోర్నీలో క్రీడాకారులు పాల్గొనాలని, నిర్ణయించిన సమయానికి 10 నిమిషాలు ఆలస్యమైనా టీం క్రాస్ చేయబడుతుందని తెలిపారు. నిర్వాహక కమిటీ దే తుది నిర్ణయం అన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు మార్చి 4వ తారీఖు వరకు తమ తమ టీం పేర్లను నమోదు చేసుకోవాలని, ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదని ఆయన తెలిపారు. టోర్నీలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా నగదు, షీల్డ్, ద్వితీయ బహుమతిగా షీల్డ్, తృతీయ బహుమతిగా నగదు, షీల్డ్ అందించడంతోపాటు ఒక్క లీగ్ మ్యాచ్ గెలిచిన వారికి వాలీబాల్ నెట్ బాల్ బహుమతిగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సంప్రదించవలసిన పోలీస్ కానిస్టేబుల్స్ ఫోన్ నెంబర్లు టి.నాగరాజు : 9573780188, కె.రవీంద్ర :7095344143, ఎన్.నరేష్ :8179841633లను సంప్రదించాలని ఎస్ఐలు నర్సిరెడ్డి, కేశవ్‌లు వివరించారు.

పదోన్నతి కల్పించడంలో ఆపరేటర్లకు న్యాయం చేయాలి

నవతెలంగాణ-మణుగూరు

పదోన్నతి కల్పించడంలో ఆపరేటర్లకు న్యాయం చేయాలని ప్రాతినిధ్య సంఘం (ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో మంగళవారం ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కి వినతి పత్రం అందజేసినట్లు ఏరియా ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షులు వత్సవాయి కృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈపీ ఆపరేటర్ల డీ గ్రేడ్ పదోన్నతులకై గోదావరిఖని టీటీసీ వారి ఆధ్వర్యంలో గతవారం మణుగూరు ఏరియా పీకే ఓసిలో శిక్షణ పొందిన ఆపరేటర్లకు నిర్వహించిన ఫైనల్ టెస్ట్ (గ్రేడ్ టెస్ట్)లో డిస్ క్వాలిఫైడ్ అయిన ఐదుగురు ఆపరేటర్లకు న్యాయం చేయాలని తెలిపారు. వారిని కూడా అర్హులుగా ప్రకటించి డి గ్రేడ్ పదోన్నతి కల్పించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడారు. ఏరియా యాజమాన్యం పదోన్నతులు ఇచ్చి ప్రోత్సహించాల్సి ఉందని, అందుకు భిన్నంగా ఐదుగురిని డిస్ క్వాలిఫైడ్ చేయటం బాధాకరం అన్నారు. ఏరియా యాజమాన్యం కూడా సానుకూలంగా స్పందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఏరియా నాయకులు అబ్దుల్ రవూఫ్, రామారావు, అజిత్, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-సుజాతనగర్

దేశవ్యాప్తంగా క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 100 రోజుల నిక్షయ్ ఫీవర్ కార్యక్రమంపై మంగళవారం స్థానిక ప్రాథమిక వైద్యశాల నందు డాక్టర్ రమేష్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన వ్యాధి తీవ్రంగా ఉన్న 347 జిల్లాల్లో మన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒకటి అని, కాబట్టి క్షయ వ్యాధిపై సమాజంలోని ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని దానిని పూర్తిగా నిర్మూలించడంలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ పున్నమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గిర్దావర్లకు సన్మానం

నవతెలంగాణ-పినపాక

తహసీల్దార్ కార్యాలయంలో గిరిధావర్-1గా బాధ్యతలు చేపట్టిన గణపతిని జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గిర్దావర్లు రమేష్, గణపతిలను సంఘం ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే అధికారులు మండలంలో విధులు నిర్వహించడం తమకు ఎంతో సంతోషదాయకమని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొగ్గల రామకృష్ణ దొర, మండల అధ్యక్షులు కొమరం శీను అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కుర్సం సారయ్య, సంఘం నాయకులు పాల్గొన్నారు.



బంధు శారద 4వ వర్ధంతి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు సతీమణి బంధు శారద నాలుగవ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. స్థానిక ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా బందు శారద చిత్రపటానికి అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవీఎస్ఎస్ నారాయణ తదితరులు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... బంధు వెంకటేశ్వరరావు ఉపాధ్యాయ ఉద్యమంలో ఉద్యమం నిర్వహించేందుకు శారద అన్ని విధాల సహాయ, సహకారాలు అందించారని గుర్తు చేశారు. అనంతరం సరోజినీ వృద్ధాశ్రమంలో శారద నాలుగవ వర్ధంతి సందర్భంగా 150 మంది వృద్ధులకు, వికలాంగులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్వి ప్రసాద్, కృష్ణమూర్తి, ఆంజనేయ శాస్త్రి, ఎస్.రాంబాబు, సుబ్బయ్య చౌదరి, సత్యనారాయణ, పరిటాల సుబ్బారావు, నాలం సత్యనారాయణ, దుర్గ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలని వినతి

నవతెలంగాణ-టేకులపల్లి

గత రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలు వల్ల నష్టపోయిన రైతులకు పంట నష్టం చెల్లించాలని న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం మండల వ్యవసాయ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం మండల వ్యవసాయ అధికారి అన్నపూర్ణకు వినతి పత్రం అందజేశారు. మండలంలోని సింగ్యా తండా, లచ్చ తండా, మంగళ తండ, చుక్కాలబోడు, బద్దు తండా, సంద్యా తండా, బేతంపూడి, మద్దిరాల తండా, తుమ్మల చలక తదితర గ్రామాలలో మొక్కజొన్న పంట తీవ్రంగా నష్టపోయిందని తెలిపారు. ఈ గ్రామాలలో సర్వే నిర్వహించి, ఎకరానికి రూ.50వేలు రైతాంగానికి నష్ట పరిహారం చెల్లించాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్, ఎంఎల్ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భూక్య హర్జ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏట్టి నరసింహారావు, గుగులోతు రామచందర్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి రాయిపాడు గ్రామ సమస్యలు

నవతెలంగాణ-అశ్వాపురం



పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి ఆళ్ళపల్లి మండలంలోని రాయిపాడు గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి ఆ గ్రామ ప్రజలు తీసుకెళ్లారు. ఈ మేరకు రాయిపాడు గ్రామస్తులు మంగళవారం మణుగూరులో ఎమ్మెల్యే స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం రాయిపాడు గ్రామానికి చెందిన పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ ఎంపీపీ పెండెకట్ల పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వ్యక్తిగత ప్రమాద బీమా రూ.కోటి

- డ్యూటీలో మరణిస్తే రూ.1.25 కోట్లు
- బ్యాంక్ అఫ్ బరోడా సేవలను వినియోగించుకోవాలి : జీఎం



నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి సంస్థలో పనిచేసే ఉద్యోగులు బ్యాంక్ అఫ్ బరోడా సేవలను వినియోగించుకోవాలని జనరల్ మేనేజర్ వి.కృష్ణయ్య అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంక్ అఫ్ బరోడా నందు శాలరీ ఎకౌంటు కలిగి ఉన్న అధికారులకు, కార్మికులు, ఉద్యోగులకు బ్యాంక్ అఫ్ బరోడా వారు ప్రమాద బీమా కవరేజ్ పొడిగించారు. ఈ బీమా కవరేజ్‌లో భాగంగా ఉద్యోగి వ్యక్తిగత ప్రమాదంలో మరణించిన కవరేజీ రూ.1 కోటి (డ్యూటీలో మరణిస్తే 1.25 కోట్లు), యాక్సిడెంట్ డెత్ కవర్, జీతం ఖాతాకు లింక్ చేయబడిన రుపేయి డెబిట్ కార్డ్ పై కవరేజీ రూ.2 లక్షల వరకు, ప్రమాదంలో శాశ్వత వికలాంగుడు అయితే రూ.1 కోటి, తాత్కాలిక వికలాంగుడు అయితే 75 లక్షల వరకు అదే విధంగా ఎయిర్ యాక్సిడెంట్ డెత్ కవర్ (డ్యూటీ లో లేనివారికి రూ.2 కోట్లు అలాగే డ్యూటీలో ఉన్న వారికీ రూ.2.25కోట్లు) గ్రూప్ ప్రమాద బీమా కవరేజ్ రూ.15 లక్షల వరకు అందిస్తుంది. కావునా ఉద్యోగులు సద్వినియోగం చేసుకోగలరని తెలియజేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధం

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్



నవతెలంగాణ-పాల్వంచ

ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను మొత్తం 2022 మంది ఓటర్లు కాగా అందులో పురుషులు 1068 మంది మహిళలు 954 మంది ఉన్నారని తెలిపారు. ఓటు హక్కు కలిగిన ఉపాధ్యాయులు అందరూ 100% తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. 23 మండలాలకు గాను పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. రేపు కొత్తగూడెం శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాల నందు ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి సామగ్రిని తీసుకొని అధికారులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు ఖచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలోకి ఓటర్లను ఓటర్ రికగ్నైజేషన్ సెంటర్ ద్వారా నిశితంగా పరిశీలించిన తర్వాతనే లోపలికి అనుమతించాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఒక ఏఎన్ఎం అత్యవసర వైద్య సహాయం అందించేందుకుగాను అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ అనంతరం అధికారులు పోలింగ్ సామగ్రిని నిర్దేశిత పద్ధతి ప్రకారమే ప్యాకింగ్ చేసి నేరుగా నల్గొండ రిసెప్షన్ సెంటర్‌కు చేరవేయాలి అన్నారు. నల్గొండ రిసెప్షన్ సెంటర్లో ఎవరికైతే డ్యూటీ వేసిన అధికారులు 27వ తారీకు ఉదయమే అక్కడికి చేరుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల లోపు ఎవరిని అనుమతించరాదని, అంటే ఇష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించటం. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, ఎలక్షన్ సూపర్డెంట్ ధారా ప్రసాద్, ఎన్ఐసీ అధికారి సుశీల్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నియోజక వర్గంలో 186 మంది ఉపాధ్యాయ ఓటర్లు

నవతెలంగాణ - అశ్వారావుపేట



ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అశ్వారావుపేట నియోజక వర్గంలో మొత్తం 186 మంది ఓటర్లు కాగా అందులో పురుషులు 107, మహిళలు 79 మంది ఉన్నారు. 5 మండలాలకు 6 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసారు.

మండలం	పోలింగ్ కేంద్రం	ఓటర్లు
అన్నపురెడ్డిపల్లి	జెడ్పీ హెచ్ ఎస్	20
అశ్వారావుపేట	జెడ్పీ హెచ్ ఎస్	47
చంద్రుగొండ	జెడ్పీ హెచ్ ఎస్	17
దమ్మపేట	జెడ్పీ హెచ్ ఎస్	76
ములకలపల్లి	జూనియర్ కాలేజీ	26
మొత్తం		86

శాఖ గ్రంథాలయానికి కూలర్ల వితరణ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం పట్టణంలోని శాఖ గ్రంథాలయానికి ఐటీసీ బీపీఎల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పాకల దుర్గ ప్రసాద్, డాక్టర్ గోళ్ళ భూపతి రావులు రెండు కూలర్లను వితరణగా అందించారు. ఈ సందర్భంగా గ్రంథలయ పాలకులు జాని మాట్లాడుతూ... గ్రంథాలయంనకు దాతలు అందిస్తున్న సహాయ, సహకారాలు మరువలేనివి అని అడిగిన వెంటనే స్పందించిన వారిరువురికి ధన్యవాదాలు తెలిపారు. వీరు చేస్తున్నా సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగాలని కోరారు. అనంతరం డాక్టర్ గోళ్ళ భూపతి రావు మాట్లాడుతూ... రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు వేసవి తాపం ఆటంకం కాకూడదన్న లక్ష్యంతో కూలర్లు అందించామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఈ గ్రంథాలయానికి కావలసిన సహయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణార్జున రావు, భూషణ్ రావు, కడలి నాగరాజు, నాగేంద్ర ప్రసాద్, బీరు సుధాకర్, విజయ గోపాల్, విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాగన్లకు బీటీపీఎస్‌కు బొగ్గు సరఫరా తగ్గించాలి

- 250 లారీలకు సింగరేణి బొగ్గు అందించాలి
- ఆర్థిక ఇబ్బందుల్లో లారీ ఓనర్లు
- దశల వారి ఆందోళన సిద్ధం



నవతెలంగాణ-మణుగూరు

రైల్వే వ్యాగన్లకు బీటీపీఎస్ సరఫరా చేసే బొగ్గును తగ్గించాలని, మాకు బతుకులలో వెలుగులు నింపేందుకు రోజుకు 250 లారీల బొగ్గును సరఫరా చేస్తే సరిపోతుందని మణుగూరు లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.అయోధ్య చారి అసోసియేషన్ అధ్యక్షులు మొల్లేటి బాలసత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మేరెడ్డి సురేందర్ రెడ్డి, కోశాధికారి పిన్నపురెడ్డి, జైపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షులు ఎల్అండ్‌టీ రవి, సరెడ్డి రాఘవరెడ్డి విలేకరులతో మాట్లాడారు. గత వారం రోజుల నుండి లారీలకు బొగ్గు సరఫరా నిలిచిపోయిందన్నారు. ప్రపంచానికి వెలుగులు నింపేందుకే బీటీపీఎస్‌కు మరి ఇతర ప్రాంతాలకు బొగ్గును సరఫరా చేస్తున్నామని సింగరేణి అధికారులు సమస్యను దాటవేస్తున్నారని అన్నారు. మాకు బతుకులు కావాలి కానీ వెలుగులు మాకెందుకు అని యజమానులు బాధలు తెలిపారు. అన్ని అనుమతులు ఉన్నప్పటికీ బొగ్గు కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని నాయకులు తెలిపారు. స్థానిక జీఎం దుర్గం రామచందర్ పరిమితులు తెచ్చుకోమని, బొగ్గును సరఫరా చేస్తామని అనుమతి ఇచ్చారన్నారు. 9 టన్నులకు పర్మిషన్ తెచ్చుకున్నా బొగ్గు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది అన్నారు. సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా 9 నెలల బొగ్గు సరఫరా లేదన్నారు. ఈఎంఐ చెల్లించలేని పరిస్థితిలో ఫైనాన్స్ యజమానులు లారీలను లాకెళ్తున్నారని వాపోయారు. కొందరు యజమానులు లారీలను స్క్రాప్ కింద అమ్ముకునే పరిస్థితి దాపురించిందన్నారు. స్థానిక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుకు సమగ్ర రిపోర్ట్స్ ఇచ్చామన్నారు. గతంలో జిల్లా మంత్రికి తమ సమస్యలు వివరించామన్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు పదివేల మంది ప్రజలు బొగ్గు ట్రాన్స్ పోర్ట్‌పై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు. ఈ సమావేశంలో 100 మంది లారీ యజమానులు పాల్గొన్నారు.

ధృవతారలుగా వెలగాలి...

- ఫేర్‌వెల్ డే వేడుకలలో మున్సిపల్ కమిషనర్, డీఎస్పీ



నవతెలంగాణ-ఇల్లందు

బాగా చదువుకుని ఉన్నత శిఖరాల అధిరోహిస్తూ సమాజానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తెస్తూ ధృవతారలుగా వెలగాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్, డీఎస్పీ ఎన్.చంద్రభాను పేర్కొన్నారు. పట్టణంలోని సాహితి కళాశాలలో మంగళవారం ఫేర్ వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వారు హాజరై మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని తెలిపారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ఎన్నో ఆశలు పెట్టుకుంటారని వారిని దృష్టిలో ఉంచుకొని ఆశలు వమ్ము కాకుండా ముందడుగు వేయాలని అన్నారు. సివిల్స్ వైపు దృష్టి పెట్టమని సూచించారు. సమయం అందరికీ ఒకేలా ఉంటుందని, సమయం వృధా చేయకుండా చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామలింగేశ్వర రావు మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదివి, పరీక్షలో మంచి మార్కులు పొందాలని అన్నారు. కళాశాల డైరెక్టర్లు ఎంసి.నాగిరెడ్డి, కెవిఎస్ సుధాకర్, ఎం.శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గుజ్జర్లపూడి రాంబాబు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

మహాశివరాత్రి శుభాకాంక్షలు : పీఓ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఆదివాసీ గిరిజన గ్రామాలలో పనిచేయుచున్న ఉద్యోగులకు, గిరిజనులకు, గిరిజన కుటుంబాలకు, గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు మహాశివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలుపుతున్నట్టు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆ పరమ శివుని కరుణాకటాక్షాలతో ఉద్యోగులు, ఆదివాసీ గిరిజన కుటుంబాలు సుభిక్షంగా ఉండాలని కోరినట్టు తెలిపారు.

వసతి గృహాల్లో కొరవడిన పర్యవేక్షణ

- నాణ్యమైన ఆహారం అందించాలి
- సీపీఐ(ఎం), టీఏజీఎస్



నవతెలంగాణ-ఇల్లందు

పట్టణం, మండలంలోని వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం అందక విద్యార్థినీ, విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపంతోనే ఈ విధంగా జరుగుతోందని సీపీఐ(ఎం), టీఏజీఎస్ నాయకులు ఎస్.కె ఖాదర్, వజ్జా సురేష్‌లు తెలిపారు. వసతి గృహాల్లో ఆహార నాణ్యతను మెరుగు పర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఇల్లందు ఏటీడీఈఓ అధికారి అందుబాటులో లేని కారణంగా కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ బంక కృష్ణకు వినతిపత్రం ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాడిపోయిన, ఎండిపోయిన కూరగాయలు, ఆకు కూరలు నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు ఉపయోగిస్తున్నారని తెలిసిందన్నారు. దీనికి తోడు వసతి గృహాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత లోపించిందన్నారు. పౌష్టిక ఆహారం అందడానికి అధికారులు పర్యవేక్షణ నిరంతరం జరుపుతూ వసతి గృహలని సందర్శించాలని కోరారు.

కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి : ఎమ్మెల్యే

నవతెలంగాణ-టేకులపల్లి



విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని రోళ్ళపాడు ప్రభుత్వ పాఠశాలను కోరం మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. అనంతరం పాఠశాల మెనూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణం అంతా పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోరం సురేందర్, ఇది గణేష్, బద్రు, ఖానా, లక్ష్మీనారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

మహిళా అభివృద్ధికి కొల్లి ఫౌండేషన్ చేయూత

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి



మండలంలోని రేగళ్లలో జరిగిన అదునాతన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్పనా చౌదరి పాల్గొని ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి మహిళలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్పనా చౌదరి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందు ఉండాలని, అభివృద్ధి పథంలో వెళ్లాలని, ఆర్థికంగా బలోపేతం చేస్తూ మహిళా సాధికారిత దిశగా అడుగులు వేయాలని అందుకు అన్ని రకాలుగా కొల్లి ఫౌండేషన్ సహకరిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ రూప్లానాయక్, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మూడు సురేష్, బొబ్బల రమేష్, కిషన్, కొల్లి ఫౌండేషన్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిజియోథెరఫీ సేవలు తిరిగి ప్రారంభం అభినందనీయం

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు ఏరియా సింగరేణి ప్రగతి కోసం కష్టించి పని చేసే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య శ్రేయస్సు పట్ల స్థానిక జీఎం దుర్గం రామ చందర్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయం అని ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెళ్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. టీబీజీకేఎస్ చేసిన విజ్ఞప్తి మేరకు యాజమాన్యం స్పందించిందన్నారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి 12.30 నిమిషాల వరకు, తిరిగి సాయంత్రం 3 గంటల నుంచి 5.30 నిమిషాల వరకు వైద్య నిపుణుల సేవలు అందుబాటులో ఉండనున్నట్టు తెలిపారు. కార్మిక వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక వైద్యనిపుణులు సేవలు అందుబాటులోకి తీసుకరావడానికి అదేశాలు ఇచ్చిన ఏరియా జీఎం దుర్గం రామచందర్, హాస్పిటల్ వైద్య అధికార బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకే టాలెంట్ టెస్ట్

నవతెలంగాణ-మణుగూరు

విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకే టాలెంట్ టెస్ట్ నిర్వహించామని ఏఐఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు సుధాకర్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ టెన్త్ క్లాస్ టాలెంట్ టెస్ట్ పేపర్‌ను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వరక అజిత్ పాల్గొని మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న ప్రతి విద్యార్థికీ కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో నాయకులు పవన్ సాయి, నాగేంద్రబాబు, మాజీ విద్యార్థి సంఘ నాయకులు, ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం వెంకటేశ్వర్లు, రాయల బిక్షం, మాజీ వార్డు మెంబర్ వెంకటేశ్వర్లు, పాఠశాలల అధ్యాపక బృందం పాల్గొన్నారు.



ప్లాస్టిక్ నివారణతోనే పర్యావరణ పరిరక్షణ

- భారజల కర్మాగార జీఎంహెచ్‌కె శర్మ
- వీధి నాటకాలు వేసిన ఉద్యోగులు

నవతెలంగాణ-అశ్వాపురం

ప్లాస్టిక్ నివారణ తోటే పర్యావరణకు మేలు జరుగుతుందని బారజల కర్మాగార జీఎం హెచ్ కె శర్మ అన్నారు. కేంద్ర ప్రభుత్వం పిలుపులో భాగంగా మంగళవారం నిర్వహించిన స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో ఆయన పాల్గొని పర్యావరణ పై అవగాహన కల్పిస్తూ ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. తొలిత ఈ కార్యక్రమం కాలనీ గేటు నుండి స్థానిక పోలీస్ స్టేషన్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా వీధి నాటక ప్రదర్శనను ఉద్యోగులు చేపట్టారు. అలాగే పోలీస్ స్టేషన్ ఎదుట సుమారు గంటపాటు పర్యావరణం స్వచ్ఛతపై వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ క్రమేపి ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గిస్తేనే రానున్న రోజుల్లో మానవాళి మనుగడకు మేలు జరుగుతుందని తెలిపారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ రఫీక్ అహ్మద్, సీఏఓ జి.వేణు, ఏపీవోలు పాడ్య కేశవరావు, ఎ.పని శేఖర్, రమణ బాబు భారజల ఉద్యోగులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- రాయిగూడెంలో విషాదఛాయలు



నవతెలంగాణ-ఆళ్ళపల్లి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని రాయిగూడెం గ్రామానికి చెందిన పూనెం బాలకృష్ణ (25)కు రక్తపు విరోచనాలు అవుతున్న కారణంగా చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు గత కొన్ని రోజుల క్రితం ఖమ్మం ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడి వైద్యులు చికిత్స అందిస్తున్న నేపథ్యంలో బాలకృష్ణ ఆరోగ్య పరిస్తితి విషమించడంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. దాంతో కుటుంబ సభ్యులు మంగళవారం స్వగ్రామమైన రాయిగూడెంకు మృతదేహాన్ని తీసుకొచ్చి, అంత్యక్రియలు జరిపారు. మృతుడికి భార్య అనుష, ఇద్దరు కుమారులు కలరు. చిన్న వయసులోనే బాలకృష్ణ మృతి చెందడంతో అతని భార్య, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతం అయ్యారు. రాయిగూడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆదర్శ రైతుగా సుధాకర్ రెడ్డి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని తూరుబాక గ్రామానికి చెందిన రైతు మందపాటి సుధాకర్ రెడ్డికు అరుదైన పురస్కారం లభించింది. మంగళవారం భద్రాచలం మండలం లక్ష్మీపురంలో జరిగిన ఐటీసీ పీఎస్‌పీడీ లిమిటెడ్‌లో రైతుల వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిపిఎల్ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. జామాయిల్ తోటలలో అధిక దిగుబడి సాధించినందుకు గాను తూరుబాక గ్రామానికి చెందిన రైతు మందపాటి సుధాకర్ రెడ్డికు డివిజన్ స్థాయిలో పురస్కారం అందజేశారు. రైతు సుధాకర్ రెడ్డి అధిక దిగుబడి సాధించిన విధానంపై పలువురు రైతులకు వివరించారు. అనంతరం డివిజన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాజేష్ పొన్నోనూరు చేతుల మీదుగా ప్రశంసా పత్రం జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ డీసీఈ రాజేష్ పున్నారి, యూనిట్ హెడ్ శైలేంద్ర సింగ్, ప్లాంటేషన్ హెడ్ డాక్టర్ జగదీష్, అకౌంట్ హెడ్ రాజశేఖర్, డీజీఎం ఉషారాణి, హెచ్ఆర్ శ్యాం కుమార్, ప్లాంటేషన్ ఇన్‌చార్జి సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | ఫిబ్రవరి 26, 2025 | www.navatelangana.com

ఈ విన్, యూ విన్ యాప్‌ల అప్‌డేట్‌పై శిక్షణ



నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లాలో పని చేయుచున్న వైద్యాధికారులు, ఫార్మాసిస్టులకు, ఆరోగ్య సిబ్బందికి ఈ విన్, యూ విన్ యాప్‌ల అప్‌డేట్‌పై, సాధారణ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.కళావతి బాయి మాట్లాడుతూ ఈ విన్ యాప్స్ ఎప్పటికప్పుడు ఫార్మాసిస్ట్, ఏఎన్ఎంలు అప్ డేట్ చేస్తూ వ్యాధి నిరోధక టీకాలు అందించాలని, వాటిలో ఏదైనా సమస్య ఉంటే ఎస్ఎంఓని అడిగి అనుమానలు నివృత్తి చేసుకొని కార్యక్రమాన్ని నూరు శాతం విజయవంతం చేయాలని కోరారు. అలాగే అసంక్రమణ వ్యాధులు నియంత్రణ కార్యక్రమం, మాతా శిశు సంక్షేమం, లెప్రసీ నివారణ కార్యక్రమం ఇచ్చిన లక్ష్యాలను మార్చి నెలాఖరు వరకు సాధించాలని ఆమె తెలిపారు. అనంతరం రాష్ట్ర అధికారిని డాక్టర్ జోష్ని, ఎస్ఎంఓ డాక్టర్ మురారీ శిక్షణ కార్యక్రమం అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సైదులు, డాక్టర్లు చందునాయక్, రామారావు, వెంకటరమణ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీ చైతన్య గ్లోబల్ విస్తాలో ఎడ్యూ ఫెస్ట్

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

శ్రీ చైతన్య గ్లోబెల్ విస్తా పాఠ శాలలో ఎడ్యూ ఫెస్ట్ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమం గురించి పాఠశాల డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ చక్కనైన విద్యను రాష్ట్రస్థాయిలో కాక అంతర్జాతీయ స్థాయిలో అందించగల సత్తా ఉన్న ఏకైక పాఠశాల గ్లోబెల్ విస్తా అన్నారు. అన్ని రకాల సౌకర్యాలతోపాటు విద్యార్థులు అన్ని రంగాలలో ప్రపంచ స్థాయిలో పోటీ పడగల విద్యను అందించడమే లక్ష్యం అని తెలిపారు. డైరెక్టర్ శ్రీ విద్య మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు ఆడుతూ పాడుతూ ఆనందంతో విద్యను నేర్చుకుం టారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయసుధ, ఏజీఎం చేతన్ తదితరులు పాల్గొన్నారు.

కస్తాల రాధాకృష్ణ కుటుంబానికి ఎంపీ పరామర్శ

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని తెలగవరం గ్రామంలో ఇటీవల మరణించిన కస్తల రాధాకృష్ణమూర్తి, బొగ్గరపు రామయ్య చిత్రపటాలకు మంగళవారం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, తెలంగాణ ఇరిగేషన్ డెవలప్మెంట్ సంస్థ చైర్మన్ మువ్వ విజయ్‌బాబులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో సీడీసీ కమిటీ చైర్మన్ కస్తాల నరేంద్ర, టెలికం కమిటీ సభ్యులు యసా రామకృష్ణ, ఏనుగు సత్యం, మట్టూరు జనార్ధన్, బత్తుల రాము, కే వి, గ్రామ పెద్దలు, పొంగులేటి, మువ్వా అభిమానులు పాల్గొన్నారు.

రాచమళ్ల కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ ఆర్ఆర్ఆర్

నవతెలంగాణ-సత్తుపల్లి

ఇటీవల మరణించిన మండలంలోని గంగారం మాజీ సర్పంచ్, రిటైర్డ్ పీఈటీ రాచమళ్ల కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రాఘురాంరెడ్డి టీఐడీసీ చైర్మెన్ మువ్వా విజయబాబుతో కలిసి మంగళవారం గంగారంలోని వారి గృహానికి వెళ్లి పరామర్శించారు. కృష్ణమూర్తి చిత్రపటానికి పూలుజల్లి నివాళులర్పించారు. కృష్ణమూర్తి కుమారులు దిలీప్ నవీన్‌కుమార్‌ను, రామారావును (రాము) పరామర్శిస్తూ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాచమళ్ల సత్యనారాయణ రాచమళ్ల నాగేంద్రరావు, వందనపు వెంకటేశ్వరరావు, వంకదారు వాసు, హెూటల్ రాంబాబు, కాకర్ల మాణిక్యాలరావు, దొడ్డా అమ్ములు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎంపీ

నవతెలంగాణ-వేంసూరు

వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొర్ల వెంకటప్పరెడ్డి కుమార్తె వివాహం ఇటీవల కందుకూరులో జరిగింది. మంగళవారం ఎంపీ రఘురామిరెడ్డి, ఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబులు వధూవరులను ఆశీర్వదించి విందులో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శించారు. కల్లూరు గూడెంలో వివిధ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. మార్చి నెలలో కందుకూరు వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహెూత్సవానికి రావలసిందిగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అట్లూరి సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రావి సత్యనారాయణ, భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అశోక్, బండి శ్రీనివాసరెడ్డి, గోపి, ఈశ్వర చారి, శివ తదితరులున్నారు

ప్రతి ఆడపిల్ల చాకచాక్యంగా ప్రమాదాల నుండి తప్పించుకోవాలి

నవతెలంగాణ-కల్లూరు

ప్రతి ఆడపిల్ల తమకు ప్రమాదం జరుగుతుందని గ్రహించి ముందస్తుగా తప్పించుకునేందుకు చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్‌ను 1098 సహకారంతో తప్పించుకునేందుకు ధైర్యంగా నిలబడాలని మహిళా సాధికారత జిల్లా సమన్వయ కర్త ఎస్‌డి సమ్రీన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక గురుకుల పాఠశాలలో భేటీ బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ కనకదుర్గ అధ్యక్షత వహించారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ కళాశాల ప్లేస్ మెంట్స్ సెల్ -తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సౌజన్యంతో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా తెలిపారు. మొత్తం 426 మంది హాజరు కాగా, 198 మంది, 8 కంపెనీలకు ఎంపికయ్యారని వెల్లడించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ చింతా సుధాకర్, టీ.ఎస్.కే.సి కోఆర్డినేటర్ ఎం.మాధవి, మెంటార్ ఈ.వేలాద్రి, మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వై.రమేష్, బి.వెంకన్న, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషకాహారంపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ సిహెచ్ కమలప్రియ మాట్లాడుతూ చదువు యొక్క ప్రాముఖ్యతతో పాటు, యుక్త వయసులో ఉన్న పిల్లలు తీసుకునే ఆహారం గురించి వివరించారు. బాల్య దశలో వివాహాలు చేసుకోరాదన్నారు. నేరాలు, మానవ అక్రమ రవాణా, మాదకద్రవ్యాలు, మారణాయుధాలు, సైబర్ మోసాలు సమాజాన్ని పట్టిపీడిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం కె.శాంతికుమారి, ఉపాధ్యాయని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారేపల్లి క్రికెట్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-కారేపల్లి

మహాశివరాత్రిని పురస్కరించుకొని కారేపల్లి బీసీ కాలనీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షులు మేదరి వీరప్రతాఫ్(టోనీ) ప్రారంభించారు. ఈ పోటీలలో విజేతలకు మేదరి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్ధం వారికుమారుడు ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మేదరి వీరప్రతాఫ్(టోనీ) బహుమతులు అందజేయనున్నారు. ఈసందర్భంగా టోనీ మాట్లాడుతూ కిక్రెట్ పోటీలు క్రీడా స్ఫూరితో జరుపుకోవాలని, విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. యువకులు ఆటలతో పాటు గ్రామాభివృద్ధి భాస్వాములు కావాలి ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో యువకులు జంగ వెంకటేశ్వర్లు, చింత కృష్ణ, టంటం వెంకన్న, జంగ నరేష్, ఎస్‌కె.యాకూబ్‌పాషా, విలియం కేరి, తెలకలపల్లి శ్రీనివాస్, రాఠోత్ రమేష్, జాన్‌వెస్లీ, దుర్గా ప్రసాద్, తెలకలపల్లి నాగరాజు, రాకేష్, ఉదయ్ పాల్గొన్నారు.

50 ఆకుల తూనికాకు కట్టకు రూ.6 సాధనకై పోరాడుదాం

నవతెలంగాణ-కామేపల్లి

50 ఆకుల తునికాకు కట్టకు రూ.6 సాధనకై పోరాడుదాం అని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు అన్నారు. కామేపల్లి మండలం కెప్టెన్ బంజారా, శ్రీరాంపురం, అడవి మద్దులపల్లి గ్రామాల్లో ఆదివాసి లంబాడి గిరిజన బిడ్డలు సమావేశం జర్పుల రాంసింగ్ అధక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ అడవిని నమ్ముకుని జీవిస్తున్న ఆ గ్రామ వాసులు సుమారు 4000 మందికి తునికాకుల సీజన్ ఒక పంట సీజన్ అని, తక్షణమే ఫారెస్ట్ అధికారులు అడవిలో తునికాకుల మోడాలు కొట్టించాలన్నారు. ఈ మేరకు రైతుల వద్ద కరపత్రం విడుదల చేయడం జరిగింది. సమావేశంలో జరపలా రామ్ సింగ్ అధ్యక్షత వహించారు ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు భూక్య శివ నాయక్ రామ్మూర్తి కోటేశ్వరరావు వినోద్ ఆర్ ఎం పుల్లయ్య భాస్కరరావు నాగులు రాంబాబు మహేందర్ గోపాలరావు అశోక్ పుట్టయ్య బాపన్న తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం నర్సిరెడ్డిని గెలిపించండి

టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి



నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి ఎమ్మెల్సీగా గెలిపించాలని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి కోరారు. మండలంలోని సాయిప్రభాత్ నగర్‌లో టీఎస్ ఈటిఎఫ్, టిపిటిఎఫ్ నాయకులతో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చావా రవి మాట్లాడుతూ...కొందరు ఎమ్మెల్సీ అభ్యర్థులు దిగజారి ఉపాధ్యాయ ఓటర్లకు మద్యం, నగదు, చీరలు పంపిణీ చేస్తూ ఉపాధ్యాయులను అవినీతి పరులను చేస్తున్నారని, అలాంటి వారిని చిత్తు చిత్తుగా ఓడించాలని ఓటర్లను కోరారు. ఈ నెల 27 న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థి, నీతి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డిని అత్యధిక మెజార్టీతో మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిపించి ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని

అవినీతిపరులకు, అవకాశవాదులకు ఈ నియోజకవర్గంలో స్థానం లేదని నిరూపించాలన్నారు. నర్సిరెడ్డి గెలిస్తేనే ఓటర్ గెలిచినట్లని, ఇంకెవరు గెలిచినా వారు వెంటనే అధికార పార్టీలో చేరిపోయే అవకాశవాదులేనని అన్నారు. నర్సిరెడ్డి గత ఆరేళ్ళుగా నిజమైన ఉపాధ్యాయ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని అన్నారు.నిత్యం నియోజకవర్గంలో పర్యటిస్తూ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని, నర్సిరెడ్డి చొరవతోనే టెట్ వివాదం పరిష్కారమైందని, పండితులు, పిఈటిలు సహా వేలాది మంది ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు వచ్చాయని అన్నారు. తనకు మంజూరైన నియోజకవర్గ అభివృద్ధి నిధులను 100 శాతం పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి కేటాయించారని, ముఖ్యమంత్రి సహాయనిధి నుండి పేదలకు వైద్య సహాయం కోసం నాలుగున్నర కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. గత ప్రభుత్వ నియంతృత్వానికి వ్యతిరేకంగా యుయస్పీసి ఆధ్వర్యంలో ఉధృతంగా పోరాడామని, ఈ ప్రభుత్వం సమస్యలను పరిష్కరిస్తుందనే నమ్మకం ఉందని లేకపోతే పోరాడటానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. నెల మొదటి తేదీన వేతనాలు ఇస్తామన్న హామీ, మోడల్ స్కూల్స్, గురుకులాలు, కెజిబివిల్లో అమలు జరగడం లేదన్నారు. రెండేళ్ళుగా ఉపాధ్యాయుల సప్లిమెంటరీ బిల్లులు, సెలవు జీతాలు, మెడికల్ రీయింబర్స్ మెంట్, జీపిఎఫ్, జీఎల్ఐ తదితర బకాయిలు ట్రెజరీలో ఆమోదం పొందినప్పటికీ ఇకుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని, రిటైర్ అయిన ఉద్యోగుల గ్రాట్యుటీ, కమ్యుటేషన్ తదతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ సంవత్సర కాలంగా విడుదల కాక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సర్వీసు నిబంధనలు రూపొందించి డిఈఓ, డిప్యూటీ ఇఓ, ఎంఈఓ, డైట్, బిఈడి కళాశాల అధ్యాపకుల పదోన్నతులు చేపట్టాలని, గురుకులాల పనివేళలను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అనుకూలంగా శాస్త్రీయంగా నిర్ణయించాలని, కెజిబివి ఉద్యోగులకు పే-స్కేల్ ఇవ్వాలని, కేర్ టేకర్లను నియమించాలని, 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్, టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ.వి. నాగేశ్వరరావు, టీఎస్ యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ ఉద్దండు షరీఫ్, పూర్వ అధ్యక్షులు గడ్డం రాజశేఖర్, పూర్వ కార్యదర్శి ప్రసాద్, రూరల్ మండల ప్రధాన కార్యదర్శి పి.మహేష్, సతీష్, సీనియర్ నాయకులు రంగయ్య, బుచ్చయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, పీవీఆర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పెట్రోల్ అందించడమే మా లక్ష్యం....

పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరప్రగడ రంగనాథ్



నవతెలంగాణ-ఖమ్మంరూరల్

వాహనదారులకు ఎటువంటి కల్తీ లేకుండా నాణ్యమైన పెట్రోల్ అందించడమే తమ లక్ష్యమని ఖమ్మం జిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరప్రగడ రంగనాథ్ అన్నారు.మండలంలోని బైపాస్ రోడ్డు వద్ద గల సింహాద్రి నగర్ లో డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ 20 ఇథనాల్ బ్లండెడ్ పెట్రోల్‌పై బీపీసీఎల్, హెచ్పీసీఎల్, ఐఓసీఎల్ డీలర్లకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడారు.ఈ-ట్వంటీ పెట్రోల్ లో 20% ఇథానాల్ పెట్రోల్‌తో పాటు బ్లెండ్ అయి ఉంటుందని,కొంచెం నీళు కలిసిన 20 శాతం ఉన్న ఇథానాల్ నీళ్లగా మారిపోతుందని తెలిపారు.పెట్రోల్, డీజిల్ క్వాలిటీని ఫిల్టర్ పెపర్మ డెన్సిటీతో ఎలా పరీక్షిస్తారో ఐదు లీటర్ల క్యాన్‌తో చెక్ చేసి చూపెట్టారు. పెట్రోల్ క్వాలిటీ విషయంలో ఎక్కడ రాజీ పడేది లేదని తెలిపారు.వాహనదారులు ఎటువంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని తెలిపారు. కొంతమంది పనికట్టుకొని సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు చేస్తున్నారని అటువంటి అబద్ధాలు నమ్మవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్ చందన్ కుమార్, జనరల్ సెక్రెటరీ కూరపాటి మంజుల, ట్రెజరరీ వజనేపల్లి శ్రీనివాస రవికుమార్, వైస్ ప్రెసిడెంట్ సన్నే ఉదయ్ ప్రతాప్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మోత్కూరి గోపాలరావు, జిల్లా సలహాదారులు నాగబత్తిని రవి, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాసరావు, దమ్మలపాటి నగేష్, ఈసీ మెంబర్స్ అద్దంకి విప్లవ్ కుమార్, బానోత్ రామ్మూర్తి, ఎం.దిలీప్ రెడ్డి, డీలర్స్ దోరేపల్లి రవికుమార్, రాయపూడి పవన్, దాసరి డేనియల్, పొదిల వంశీ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో కష్ట జీవులకు ఒరిగిందేమీలేదు

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె రమేష్



నవతెలంగాణ-పాల్వంచ

కేంద్ర బీజేపీ దృష్టిలో దేశమంటే అంబానీ, అదానీలే తప్ప, సామాన్య ప్రజలు కాదని, కేంద్ర ప్రభుత్వం తరపున 8వ సారి పార్లమెంట్‌లో పెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చేదిగా ఉన్నదని, కష్టజీవులకు ఏమాత్రం ఉపయోగపడదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ అన్నారు. పాల్వంచలో సీఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మచికంటి భవన్ నందు సదస్సు సీఐటీయూ పట్టణ కన్వీనర్ కె.సత్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సుకి ముఖ్య అతిథిగా హాజరైన ఏజె రమేష్ మాట్లాడుతూ నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశ పెడుతూ దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అన్న గురుజాడ సూక్తిని ఉటంకిస్తూ మాట్లాడారని, కానీ సమాజ సంపదలో సృష్టికర్తలుగా ఉన్న కార్మికులు, వ్యవసాయ కూలీల, రైతాంగానికి ఊరట ఇచ్చే విధంగా కానీ, కొత్త పథకాలు ప్రకటన కానీ, వారి కొనుగోలు శక్తి పెంచే నిర్ణయాలు కానీ ఈ బడ్జెట్ లో లేవన్నారు. పైగా అనేక రూపాలలో పరోక్ష పన్నులను భారీగా విధించారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే సంపదని నగరాలకు తరలిస్తున్నారని, పట్టణాల్లో ప్రజలకు ఇచ్చే మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయం ఈ బడ్జెట్‌లో ఉన్నాదని అన్నారు. ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థల మార్గ దర్శకత్వంలో విధానాలు పాలకులు రూపకల్పన చేస్తున్నారని, ఈ విధానాలు కాకులని కొట్టి గద్దలకు వేసే విధంగా ఉన్నాయని అన్నారు.

కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను ఏప్రిల్ నుండి అమలుకు పూనుకున్నారని అన్నారు. మరో పక్క కార్మిక వర్గం తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సామాజిక భద్రత చట్టాలను అమలు చేయాలని పెద్ద ఎత్తున సమ్మెలు, పోరాటాలు చేస్తుంటే పరిగణన లోనికి తీసుకోలేదని అన్నారు. ధరల స్థిరీకరణకు ఎటువంటి ప్రతిపాదనలు లేవన్నారు. ప్రజా వ్యతిరేఖ నిర్ణయాల అమలుకు ఈ బడ్జెట్ ఉతమిస్తున్నదని, బడ్జెట్ లో సవరణలు చేసి తగిన విధంగా కేటాయింపులు చేసేందుకు ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలని ఏజె రమేష్ అన్నారు. ఈ సదస్సు లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్, పట్నం నాయకులు పి.తులసి రామ్, ఆవాజ్ నాయకులు రహీమ్ నిరంజన్, ఐద్వా నాయకులు కాంతి మాధవి, సీఐటీయూ నాయకులు గుగ్రం రాములు, పాల్గొన్నారు.

పోలీస్ అధికారులతో న్యాయమూర్తి సమీక్ష సమావేశం



నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్

జిల్లా కోర్టు సమావేశం మందిరంలో జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశంను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మెన్ పాటిల్ వసంత్ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేసుల పురోగతిపై వివిధ పోలీస్ అధికారులతో పోలీస్ స్టేషన్‌ల వారీగా అడిగి తగిన సలహాలు ఇచ్చారు. వారంట్ పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరతగతిగా అమలు పరచాలని, నిందితులు దొరకని వారికి సంబంధించిన జామిన్ దార్లకు నోటీసులు ఇచ్చి కోర్టుకు పిలిపించాలని సూచించారు. కేసులలో సాక్ష్యం షెడ్యూల్ ఇచ్చిన కేసులలో కేసు ప్రాపర్టీని షెడ్యూల్ ప్రారంభించక ముందే కోర్టులో సమోదు /డిపాజిట్ చేయవలసి ఉంటుందని, రిపోర్టు వచ్చిన తదుపరి మాత్రమే అటు రిపోర్టుతో పాటు ఛార్జిషీట్‌లు దాఖలు చేయాలని సూచించారు. పోలీస్ అధికారులు స్టేషన్ల వారీగా చార్జీషట్లు నెలలో మొదటి వారం నుండి దాఖలు చేయాలని ఆఖరి వారంలో దాఖలు చేస్తే అదే నెలలో వెరిఫికేషన్‌కు సమయం సరిపోదని తెలిపారు. ఆర్అండ్‌బి అధికారులతో జిల్లా కోర్టులో కట్టుబడి కట్టే అకౌంట్ ఆఫీసర్ రూము, చాంబర్, నూతన కోర్టులను వారంలో పూర్తి చేయాలని, మణుగూరు కోర్టు రేనివేషన్, కోర్టు కాంపౌండ్, రోడ్డు పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈనెల 8న జరగనున్న జాతీయ లోకాదాలత్ లో అత్యధిక కేసులను పరిష్కరించుటకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జి. భానుమతి, న్యాయమూర్తులు బత్తుల రామారావు, ఏ.సుచరిత, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ కొత్తగూడెం డీఎస్పి ఎండి. అబ్దుల్ రెహమాన్, ఇల్లందు మణుగూరు డిఎస్పీలు జిల్లాలోని సర్కిల్ ఇన్స్పెక్టర్లు, భద్రాచలం, ఇల్లందు జైలు సూపరింటెండెంట్‌లు, ఎస్సైలు, కలెక్టర్ ఆఫీస్ సూపరింటెండెంట్ (తహసీల్దార్) శ్రీనివాస్, ఆర్అండ్‌బి అధికారులు, కోర్టు పిసిలు, నోడల్ ఆఫీసర్ జి. ప్రవీణ్ కుమార్ లైజాన్ ఆఫీసర్లు వీరబాబు అబ్దుల్ ఘని తదితరులు హాజరయ్యారు.



కేసుల పరిష్కారం కోసం కృషి చేయండి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి

నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్

జిల్లా కోర్టులో మార్చి 8న జరిగే జాతీయ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారం కోసం కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి మంగళవారం ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులతో జరిగిన సమీక్ష సమావేశంలో తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు తమ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలని తెలిపారు. మోటార్ వాహన ప్రమాద బాధితుల కేసులలో కక్షిదారులకు న్యాయం జరగాలని సూచించారు. లోక్ అదాలత్‌లో రాజీపడటం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు వృథా కాజాలదని తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీ వారిగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి సూచించారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, మనోవర్తి, మోటార్ వాహన ప్రమాద కేసులు, బ్యాంకు కేసులను పరిష్కరించుకొనుటకు కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో కొత్తగూడెం మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఏ.నీరజ, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.సుచరిత, కొత్తగూడెం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్కినేని సత్యనారాయణ, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.నిరంజన్ రావు, ఇన్సూరెన్స్ కంపెనీకు సంబంధించి సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బాలికల జూనియర్ కళాశాల వార్షికోత్సవం

- సీనియర్ ఇంటర్ విద్యార్థినుల వీడ్కోలు సభ

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుక, ఇంటర్ సెకండియర్ విద్యార్థినుల వీడ్కోలు సభ మంగళవారం కళాశాలలో ఆనందోత్సవాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థినులు, అధ్యాపకులు ఈ రెండు కార్యక్రమాలను అట్టహాసంగా జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ క్రమశిక్షణను అనుసరిస్తూ కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకొని ఉన్నత స్థాయికి విద్యార్థినులు ఎదగాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో సైతం పాలుపంచుకుంటూ అభాగ్యులకు చేయూతను అందించాలన్నారు. వార్షికోత్సవం, ఇంటర్ సెకండియర్ విద్యార్థినుల వీడ్కోలు అభినందన సభ సందర్భంగా విద్యార్థినులు ఆటపాటలతో ఆహుతులను అలరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు లలితమ్మ, ప్రమీల, వనజారాణి, కల్పన, సత్యనారాయణ, కృష్ణవేణి, వెంకటేశ్వరరావు, జబీన, సంధ్యారాణి, ప్రియాంక, వెంకటేశ్వర్లు, సీత పాల్గొన్నారు.

ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం

నవతెలంగాణ-ఖమ్మం

ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ అటానమస్ కళాశాలలో భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని పలు విభాగాలలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. క్విజ్, వన్ మినిట్ షో, ఇన్నోవేటివ్ ఐడియాస్, వక్తృత్వ, పోస్టర్ ప్రదర్శన అంశాలలో జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో జిల్లా నుండి వివిధ ప్రభుత్వ ప్రైవేటు డిగ్రీ కళాశాలలు, జూనియర్ కళాశాల నుండి విద్యార్థులు, ప్రతి విభాగంలో పోటీలో పాల్గొన్న విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌తో పాటు మొదటి రెండవ విజేతలకు బహుమతులు ఇవ్వనున్నామని భౌతిక శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ పి.అనిత తెలిపారు. ఐదు విభాగాల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కళాశాల వివిధ విభాగాల ఆచార్యులు పాల్గొన్నారు. సుమారుగా వివిధ డిగ్రీ కళాశాలలు, జూనియర్ కళాశాల నుండి 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎండి జకీరుల అభినందించారు. ఇటువంటి పోటీలలో పాల్గొనడం వలన విద్యార్థులు అన్ని విధాల వారి కెరియర్‌కు ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు. అదే విధంగా పోటీలను ఉన్నతంగా ప్రదర్శించాలని అన్నారు. కళాశాల భౌతికశాస్త్ర అధిపతి డాక్టర్ పి అనిత మాట్లాడుతూ విద్యార్థుల సహజ నైపుణ్యాలను వెలికి తీయటంలో కళాశాల భౌతికశాస్త్ర విభాగం ముందుంటుందని, జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా నిర్వహిస్తున్న పోటీలలో పాల్గొంటున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఇటువంటి కార్యక్రమాలు మునుముందు భౌతిక శాస్త్ర విభాగం నుండి నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం కన్వీనర్‌గా సూరంపల్లి రాంబాబు వ్యవహరించారు.పోటీలో పాల్గొన్న విద్యార్థులకు ఫిబ్రవరి 28న కళాశాలలో జరిగే జాతీయ సైన్స్ దినోత్సవ వేడుక కార్యక్రమంలో సర్టిఫికెట్లు బహుమతులు ప్రదానం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర విభాగ ఆచార్యులు బి.శ్రీనివాస్, కె.కిరణ్ కుమార్, బి.రాజశేఖర్, ధర్మయ్య, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నేడు వల్లాపురంలో మహాశివరాత్రి జాతర ప్రారంభం

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో వల్లాపురం మున్నేరు నది సమీపాన మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద మహాశివరాత్రి తిరునాళ్లమహెూత్సవం బుధవారం ప్రారంభం కానుందని దేవాలయ ఇన్చార్జి ఈవో రెంటాల సమత తెలిపారు. ఈశివరాత్రి జాతర మూడు రోజులుపాటు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆమె పేర్కొన్నారు.ఆలయ పూజారి మాధవశర్మ మొక్కులు తీర్చుకొని దేవాలయాన్ని సందర్శించే ప్రజలు,భక్తులకు ఆలయ పూజారి మాధవశర్మ పూజలు నిర్వహిస్తారని రెంటాల సమత చెప్పారు.

ఆటోను ఢీకొట్టిన కారు...10 మంది కూలీలకు గాయాలు

నవతెలంగాణ -కూసుమంచి



మండలంలోని నాయకన్ గూడెం గ్రామం వద్ద మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నాయకన్ గూడెం గ్రామం నుంచి మిరపతోటకు కూలీలతో వెళ్తున్న ప్యాసింజర్ ఆటోను అదే ప్రాంతంలో అతివేగంగా వస్తున్న ఓ కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు అవ్వగా.... మరో పది మందికి స్వల్పగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి అంబులెన్స్ లో తరలించారు.

మద్దెల శివకుమార్ సతీమణి ఎస్తేర్ రాణి మృతి

పలువురి నివాళులు

నవతెలంగాణ-కొత్తగూడెం

ప్రముఖ సినీ గేయ రచయిత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మద్దెల శివకుమార్ సతీమణి ఎస్తేర్ రాణి మృతి చెందారు. ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైద్రాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని చుంచుపల్లి మండలంలోని విద్యానగర్‌లోని వారి ఇంటికి తీసుకు వచ్చారు. ఎస్తేరు రాణి మరణ వార్త తెలుసుకున్న పలువురు రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు ఆమె భౌతికాయాన్ని సందర్శించి, పూలమాలవేసి నివాళులర్పించారు. మద్దెల కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, అమ్మవరపు సత్యనారాయణ, లిక్కి బాలరాజు, భూక్య రమేష్, సీపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.షాబీర్ పాష, ఇతర పార్టీల నాయకులు, ఐఎన్‌టీయుసి కేజీఎం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్, పట్టణ ప్రముఖులు, డాక్టర్లు, కవులు, రచయితలు సందర్శించారు.

సర్వశక్తులూ ఒడ్డుతాం

(మొదటిపేజీ తరువాయి)

11 కిలోమీటర్ల తర్వాత నీరు ఉందన్నారు. అయినప్పటికీ 11.5 కిలోమీటర్ల దూరం వరకు వివిధ ఏజెన్సీల రక్షణ బృందాలు వెళ్లగలిగాయని చెప్పారు. 13.50 కిలోమీటర్ల వద్ద టన్నెల్ బోరింగ్ మిషన్ (టీ.బీ.ఎం) ఉందని, అక్కడికి వెళ్లే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నామన్నారు. ఇక్కడి నుంచి ఎయిర్ సప్లై పైప్‌లైన్ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైనదని తెలిపారు. సొరంగంలో ఎంత దూరం వరకు బురద, నీరు ఉందనేది జీఎస్ఐ, ఎంజీఆర్ఐ అధ్యయనం చేస్తున్నాయని వెల్లడించారు. చివరి 40 మీటర్లలో నీరు, బురద మట్టి ఉందని, రాళ్లు ఉన్నా కనిపించడం లేదని అన్నారు. 15 అడుగుల ఎత్తులో 200 మీటర్ల వరకు ఈ బురద ఉందని ప్రతినిధులు, అధికారులు వివరించారు. ప్రస్తుతం టన్నెల్‌లో 10 వేల ఘనపుటడుగుల (క్యూబిక్ మీటర్లు) బురద ఉందని ప్రాథమికంగా అంచనా వేశామని, దాన్ని బయటికి తీయడమే ప్రధాన సవాలుగా ఉందని అన్నారు. కన్వేయర్ బెల్ట్‌కు బుధవారం సాయంత్రం లేదా ఎల్లుండిలోగా మరమ్మతులు పూర్తవుతాయని తెలిపారు. ఈ కన్వేయర్ బెల్ట్ ద్వారా గంటకు 800 టన్నుల బురదను బయటికి తీయొచ్చన్నారు. వీటిని మరింత త్వరితగతిన వెలికి తీయడానికి అక్కడికి వెళ్లగలిగే జేసీబీలను తీసుకుపోయేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. టన్నెల్‌లో గంటకు 3600 నుంచి 5వేల లీటర్ల ఊట నీరు వస్తుందని తెలిపారు. లోపలి నుంచి నీటితోపాటు, బురదను కూడా బయటికి తీయడానికి ఒకే పైప్‌లైన్ వినియోగించనున్నామని స్పష్టం చేశారు. వాటర్ ఫ్లోటింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు రెస్క్యూ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని చెప్పారు. ఇంజినీరింగ్ అధికారులతోపాటు సహాయక చర్యలు చేపట్టిన వారితో ఎప్పటికప్పుడూ సమీక్షిస్తున్నట్టు చెప్పారు. ప్రధాని మోడీ, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని చెప్పారు.

పదేండ్లపాటు పెండింగ్‌లో పెట్టి ఇప్పుడు విమర్శలా : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

పదేండ్లపాటు ఎస్ఎల్‌బీసీని పెండింగ్‌లో పెట్టి.. ఇప్పుడు జరిగిన టన్నెల్ ప్రమాదంపై బీఆర్ఎస్ నేతలు రాజకీయ విమర్శలు చేస్తున్నారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. గత పాలకులు నిర్లక్ష్యం చేయడం కూడా ఈ ప్రమాదానికి కారణమై ఉండొచ్చన్నారు. ఏ టన్నెల్ నిర్మాణం జరిగినా లీకేజ్‌లు సర్వసాధారణం అని, సొరంగం తవ్వకాల సమయంలో ఏర్పడిన లీకేజ్ ప్రమాదానికి కారణం అయి ఉండొచ్చని చెప్పారు. ఎనిమిది మంది కార్మికులను రక్షించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆర్మీ, నేవీ, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, ఇతర ఏజెన్సీలు సమిష్టిగా పని చేస్తున్నాయని, వేగంగా, సురక్షితంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. డీ వాటరింగ్ ప్రక్రియ ప్రారంభమైందని, టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికుల కోసం నిరంతరం ఆక్సిజన్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాహుల్ గాంధీ మంగళవారం స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి తాజా సమాచారం కోరగా, ప్రధాని మోడీ ఇప్పటికే సీఎంకు ఫోన్ చేసి అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రమాద స్థలంలో పరిస్థితి తీవ్రంగా ఉందని, నీటి ప్రవాహం సహాయ చర్యలకు ఆటంకం కలిగిస్తోందని చెప్పారు. టన్నెల్‌లోని మట్టి దిబ్బలను తొలగించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలిస్తున్నా మని వివరించారు. టన్నెల్‌లోని సహజ రాతి నిర్మాణాలు సడలడంతో అకస్మాత్తుగా నీరు, మట్టి ప్రవహించా యన్నారు. ఇది అత్యంత క్లిష్టమైన పరిస్థితి, దీనిని పరిష్కరించేందుకు సాంకేతిక నిపుణులు రాత్రింబవళ్లు కృషి చేస్తున్నారని చెప్పారు.

ఈ సమీక్షా సమావేశంలో సీఎండీ ముషరాఫ్ అలీ, స్పెషల్ ఆఫీసర్ ఈ.శ్రీధర్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, టన్నెల్ రంగనిపుణులు క్రిస్ కూపర్, రాబిన్స్ కంపెనీ ప్రతినిధి గ్రేన్ మేకర్డ్, ఉత్తరాఖండ్ దుర్ఘటన రెస్క్యూ ఆపరేషన్ నిపుణుల బృందం, జేపీకి చెందిన పంకజ్ గౌర్, నేవీకి చెందిన మరికోస్, ప్రసాద్, ఆర్మీ కల్నల్ వికాస్, కల్నల్ సురేష్, మోర్త్ డైరెక్టర్ అన్షు కల్యు, కమాండెంట్ ప్రసన్న, అగ్నిమాపక శాఖ రీజినల్ ఫైర్ ఆఫీసర్ సుధాకర్ రావు, హైడ్రాకు చెందిన పాపయ్య, అధికారి సదానందం, ఉత్తరకాశీ టన్నెల్ రెస్క్యూ ర్యాట్ మైనర్స్ గ్రూప్ ప్రతినిధి ఫిరోజ్ కురేషి, నవయుగకు చెందిన కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కుల గణన సర్వేలో వివరాలు చెప్పండి

- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్



నవతెలంగాణ-ఓయూ

కుల గణన సర్వేలో పాల్గొనని వారు ఇప్పుడు మళ్లీ జరుగుతున్న సర్వేలో పాల్గొనాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ జి.నిరంజన్ అన్నారు. కుల గణన సర్వేలో భాగంగా మంగళవారం సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని బౌద్ధనగర్, సీతాఫల్ మండి తదితర డివిజన్లలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కుల గణన సర్వే వివరాలు ప్రజల నుంచి తెలుసుకున్నారు. అనంతరం వారాసిగూడలోని జడ్ఎం ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల గణన సర్వేలో పాల్గొనని వారు ఇప్పుడు తప్పకుండా సర్వేలో వివరాలు తెలపాలని కోరారు. ఆన్‌లైన్‌లో, ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు గానీ వివరాలు తెలిపి సర్వేలో పాల్గొనాలని సూచించారు. కాంగ్రెస్ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క కుటుంబం కుల గణన సర్వేలో పాల్గొనాలని, అందుబాటులో లేని వారు 040 21111111 నెంబర్‌కి ఫోన్ చేసి వివరాలు తెలపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మాజీ ఉపాధ్యక్షులు సజన్ కుమార్, మాదిరెడ్డి జలంధర్ రెడ్డి, షకీల్ ఖాన్, జామ అనిల్ కుమార్, వాహిదుద్దీన్ లడ్డు, ప్రతాప్, చక్రధర్, బబ్లు, కుద్దూస్, శేఖర్, శోభ, రాధ, కల్పన, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావహుల్లో నిరాశ..!

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఎన్నికలపై సందిగ్ధం
- 34 జీపీలను 3 మున్సిపాల్టీలుగా మార్చే యోచనలో సర్కార్
- ఇప్పటికే ఎన్నికలకు సిద్ధమైన గ్రామస్థాయి నేతలు

పల్లె పోరుకు మరింత సమయం

నవతెలంగాణ-సిటీబ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడటంతో ఆశావహుల్లో నిరాశ నెలకొంది. త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని మొన్నటి వరకు ప్రభుత్వం ప్రకటించడంతో గ్రామీణ ప్రాంతాల్లో నేతలు పదవులపై ఆశతో ఉన్నారు. అధికారులు సైతం ఓటర్ల జాబితాతోపాటు పోలింగ్ బాక్సులు, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు తదితర పనులు పూర్తి చేశారు. అయితే మరోసారి కులగణన చేపట్టడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించడంపై.. ప్రభుత్వం ప్రకటన చేసిన నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలకు మరికొంత కాలం పట్టే అవకాశం ఉంది. ఇదే సమయంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పల్లె పోరుపై సందిగ్ధం నెలకొంది. జిల్లాలో ఉన్న 61 గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే కొన్నింటినీ సమీప మున్సిపాల్టీల్లో విలీనం చేయగా.. మిగిలిన 34 జీపీలను 3 మున్సిపాల్టీలుగా ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంతో ఎన్నికలు జరుగుతాయా..? లేదా..? అనే సందేహంలో ఆశావహులు ఎదురుచూడక తప్పని పరిస్థితి నెలకొంది.

పంచాయతీల పదవీకాలం ముగిసి ఏడాదిపైనే..



గ్రామ పంచాయతీల పాలక కమిటీల కాలపరిమితి ముగిసి ఏడాది దాటిపోయింది. గత ఆగస్టులో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం ముగిసింది. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడంతో జిల్లాలోని 34 గ్రామపంచాయతీల్లో ఆశావహులు అన్నీ సిద్ధం చేసుకునే పనుల్లో ఉన్నారు. ఇదే క్రమంలో ప్రాదేశిక ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడంతో 19 ఎంపీటీసీలు, 3 జెడ్పీటీసీ స్థానాలకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆయా పార్టీల నాయకులు కూడా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలంటూ పై నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఏ రిజర్వేషన్ అయితే ఎవరు పోటీ చేయాలనే విషయంలో గ్రామాల్లో నేతలు చర్చించుకున్నారు. ఈ నెల 15 నాటికి షెడ్యూల్ వెలువడుతుందని అంతా భావించారు. కానీ, బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఇప్పట్లో ఎన్నికలు జరగవని తేలిపోయింది.

ఓటరు జాబితా, రెండు మండల పరిషత్‌లు రద్దు

సమీప మున్సిపాల్టీల్లో విలీనమైన గ్రామ పంచాయతీల ఓటరు జాబితాను రద్దు చేస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని 7 మున్సిపాల్టీల్లో 28 గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయి. పంచాయతీ ఎన్నికల సన్నద్ధంలో భాగంగా గతేడాది సెప్టెంబర్‌లో పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాను ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాల్టీల్లో విలీనమైన గ్రామాలను గత నెల 4న ప్రభుత్వం రాష్ట్ర గెజిట్‌లో ప్రకటించింది. సదరు పంచాయతీల ఉన్నతీకరణ కారణంగా పంచాయతీరాజ్ చట్టం 2018లో సవరణ చేసి ఆ శాఖ పరిధిలో నుంచి తొలగించారు. ఈ అంశాలను ఉదహరిస్తూ 28 విలీన గ్రామాల్లో ఓటరు జాబితాలు చెల్లవని ఎన్నికల సంఘం ప్రకటించింది. దీనికితోడు ఇటీవల ఘట్‌కేసర్, కీసర మండలాల్లోని గ్రామాలన్నీ సమీప మున్సిపాల్టీల్లో విలీనం కావడంతో ఈ రెండు మండల పరిషత్‌లను ఇటీవల రద్దు చేశారు.



34 జీపీలు.. 3 మున్సిపాల్టీలు

పల్లెలను పట్టణాలుగా మార్చేందుకు రాష్ట్ర సర్కార్ చర్యలు చేపట్టింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఆ దిశగా సన్నాహాలను వేగవంతం చేసింది. జిల్లాలో 34 గ్రామ పంచాయతీలతో మూడు కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. 3 మున్సిపాల్టీలను ప్రతిపాదిస్తూ ప్రతిపాదనలు కలెక్టర్ ద్వారా పంచాయతీ రాజ్‌కు అక్కడి నుంచి రాష్ట్ర పురపాలక సంచాలకుల కార్యాలయం (సీడీఎంఏ), ఆ తర్వాత సర్కార్‌కు చేరాయి. ఈ ప్రతిపాదనలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. త్వరలోనే వీటిపై సర్కార్ నిర్ణయం తీసుకోనుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కాగా గత పంచాయతీ ఎన్నికల నాటికి జిల్లాలో 61 గ్రామ పంచాయతీలు, 5 గ్రామీణ మండలాలు ఉండేవి. వీటిలోంచి ఔటర్ రింగ్ రోడ్డు లోపల, బయట ఉన్న 28 గ్రామాలను గతేడాది సెప్టెంబర్‌లో 7న మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. విలీనం వల్ల 33 గ్రామాలు మాత్రమే మిగిలి ఉండగా, కొత్తగా మరో గ్రామ పంచాయతీని ఏర్పాటు చేశారు.

ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి

- నేడు ప్రధాని మోడీతో భేటీ
- ఏఐసీసీ అగ్రనేతలతోనూ సమావేశం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ప్రధాని మోడీతో భేటీ కానున్నారు. రాష్ట్రానికి సంబంధించిన పలు సమస్యలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లనున్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన రేవంత్ బుధవారం ప్రధాని మోడీతో.. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించేలా బడ్జెట్‌ను సవరించాలని కోరనున్నారు. ఇప్పటికే రాష్ట్రానికి రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేయనున్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచిన పలు పెండింగ్ సమస్యలను సీఎం...ప్రధాని ముందుంచనున్నారు. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలకు నిధులు ఇవ్వాలని కోరనున్నారు. భేటీ సందర్భంగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటన గురించి ప్రధానికి వివరించనున్నట్టు తెలిసింది.

ఏఐసీసీ అగ్రనేతలతోనూ...

తన ఢిల్లీ పర్యటన సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులపై వారితో ఆయన చర్చించనున్నారు. ఈ కోటాలో దాదాపు పది మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. సీపీఐ, ఎంఐఎం పార్టీలు కూడా ఒక్కొక్కటి చొప్పున ఎమ్మెల్సీ సీటును కోరుతున్నాయి. ఈ విషయాన్ని సీఎం అధిష్టానం దృష్టికి తీసుకెళ్లనున్నారు. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న బెర్తుల గురించి ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించనున్నారు. సీఎం ఢిల్లీ పర్యటన నేపథ్యంలో కొత్త మంత్రివర్గ విస్తరణపై ఈసారైనా క్లారిటీ వస్తుందా? రాదా? అనేది చూడాలి.

నర్సిరెడ్డి గెలిస్తేనే ఓటరు గెలిచినట్టు..

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి



మాట్లాడుతున్న చావ రవి

నవతెలంగాణ-వైరాటౌన్

ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి కోరారు. నర్సిరెడ్డి గెలిస్తేనే ఓటర్ గెలిచినట్లని, ఇంకెవరు గెలిచినా వారు వెంటనే అధికార పార్టీలో చేరిపోయే అవకాశవాదులేనని, అప్పుడు ఓటర్ ఓడిపోతారని అన్నారు. ఖమ్మం జిల్లా వైరాలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో చావా రవి మాట్లాడారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి గత ఆరేండ్లుగా.. నిత్యం నియోజకవర్గంలో పర్యటిస్తూ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ నిజమైన ఉపాధ్యాయ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని అన్నారు నర్సిరెడ్డి చొరవతోనే టెట్ వివాదం పరిష్కారమైందని, వేలాది మంది ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు వచ్చాయని తెలిపారు. తనకు మంజూరైన నియోజకవర్గ అభివృద్ధి నిధులను 100 శాతం పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి కేటాయించారని, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పేదలకు వైద్య సహాయం కోసం నాలుగున్నర కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. మోడల్ స్కూల్స్, గురుకులాలు, కేజీబీవీల్లో నెల మొదటి తేదీనే వేతనాలు ఇస్తామన్న హామీ అమలు కావడం లేదని అన్నారు. రెండేండ్లుగా ఉపాధ్యాయుల సప్లిమెంటరీ బిల్లులు, సెలవు జీతాలు, మెడికల్ రీయింబర్స్ మెంట్, జీపీఎఫ్, జీఎల్ఐ తదితర బకాయిలు ట్రెజరీలో ఆమోదం పొందినప్పటికీ ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రిటైరైన ఉద్యోగుల గ్రాట్యుటీ, కమ్యుటేషన్ తదతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ సంవత్సర కాలంగా విడుదల కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీసు నిబంధనలు రూపొందించి డీఈఓ, డిప్యూటీ ఈవో, ఎంఈఓ, డైట్, బీఈడీ కళాశాల అధ్యాపకుల పదోన్నతులు చేపట్టేందుకు కృషి చేస్తారని తెలిపారు. గురుకులాల పని వేళలను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అనుకూలంగా శాస్త్రీయంగా నిర్ణయించాలని, కేజీబీవీ ఉద్యోగులకు పే స్కేల్ ఇవ్వాలని, కేర్ టేకర్లను నియమించాలని, 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలన్న సమస్యలపై పోరాడుతున్నామని తెలిపారు. నర్సిరెడ్డి మళ్లీ ఎమ్మెల్సీగా గెలిస్తే ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్, టీపీటీఎఫ్ బాధ్యులు ఎంవీ నాగేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు షమీ, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ ఉద్దండు షరీఫ్, జిల్లా పూర్వ కార్యదర్శి జి.రాజశేఖర్, వైరా మండల బాధ్యులు జి.రామకృష్ణ, ఎ.సుధాకర్, బి.అనితదేవి, విశ్రాంత ఉపాధ్యాయులు సీహెచ్.వీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

48 గంటల్లో ఏడుగురు రైతుల ఆత్మహత్య : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"రాష్ట్ర వ్యాప్తంగా గత 48 గంటల్లో ఏడుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికుల జాడ దొరకడం లేదు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను పలకరించే తీరిక, ప్రమాద ఘటనను సందర్శించే ఓపిక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేదు. ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉంటూనే ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎంపై విమర్శలు గుప్పించారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు వెంకటేశ్వర్లు, మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డితో పాటు 500 మంది కార్యకర్తలు మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రోజుకు ఒక రైతు చొప్పున ఇప్పటివరకు 450 మంది రైతులు చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. 36వ సారి రేవంత్ ఢిల్లీకి వెళ్లినా కనీసం మంత్రివర్గ విస్తరణ కూడా చేసుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. 15 నెలల స్వల్ప కాలంలోనే అధికార కాంగ్రెస్ పార్టీని వదిలి ప్రతిపక్ష బీఆర్ఎస్‌లో చేరుతున్నారంటే రేవంత్ పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు. ఒక్క స్టేషన్ ఘన్‌పూర్ మాత్రమే కాదనీ, సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని అన్నారు. సుంకిశాల రిటైనింగ్ వాల్, ఎస్ఎల్‌బీసీ, ఖమ్మం పెద్దవాగు ప్రమాదాలు జరిగినా బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం పిల్లర్ పగిలినప్పుడు హడావుడి చేసిన ఎన్‌డీఏ, ఈ ప్రమాదాల విషయంలో మౌనంగా ఎందుకుందని నిలదీశారు. తాము గత పదేండ్లలో ఏటా రూ.40 వేల కోట్ల అప్పులు చేస్తే, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 14 నెలల్లో 1,50,000 కోట్ల అప్పు చేసి ఒక్క ఇటుకైనా పేర్చలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతుబంధుకు రామ్ రామ్ అవుతుందని కేసీఆర్ ముందే హెచ్చరించారని గుర్తు చేశారు. ఏడాది కాలంలో చేసిన రూ. లక్షన్నర కోట్ల అప్పుతో ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీని నడిపిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తాటి కొండ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

హిందూ, ముస్లింలని రెచ్చగొట్టడమేంటి?

- బండి సంజయ్ వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ప్రతి ఎన్నికల సమయంలోనూ హిందూ, ముస్లింలని రెచ్చగొట్టడమేంటి? బండి సంజయ్ నోరు తెరిస్తే హిందూస్తాన్..పాకిస్తాన్..హిందూ..ముస్లిం మాటలు తప్ప వేరేవి రావా?' అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) ప్రశ్నించారు. "భారతీయులంతా నా సోదరులే. భారత రాజ్యాంగాన్ని కాపాడతాను" అని ప్రమాణం చేసిన మీరు.. అధికారం కోసం విద్వేష ప్రసంగాలు చేయడం అవసరమా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే అభివృద్ధి ప్రాతిపదికపై ఎన్నికల ప్రచారానికి రండి అని సవాల్ విసిరారు. అన్ని రంగాల్లోనూ వెనుకబడ్డ పాకిస్తాన్‌తో పదేపదే పోల్చి మన దేశాన్ని గొప్పతనాన్ని తగ్గించొద్దని బండి సంజయ్‌కు సూచించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 11 ఏండ్లుగా యువకులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలని చెప్పి జిల్లాకు 200 ఉద్యోగాలైనా ఇచ్చారా? తెలంగాణలో ఎంతమందికి ఉద్యోగాలిచ్చారు? ఎంత మందికి ఉపాధి కల్పించారు? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేశ ప్రయోజనాల కోసం నెలకొల్పిన ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ సర్కారు అమ్ముకుంటూ పోతున్నదనీ, ప్రయివేటీకరణ పేరుతో ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్నదని విమర్శించారు. నిరుద్యోగులకు, యువకులకు జవాబు చెప్పుకోక మత రాజకీయాలకు బండి సంజయ్ పాల్పడుతున్నారని ఆరోపించారు. బీజేపీ పాలనలో చెప్పుకోవడానికి అభివృద్ధి లేదు..ఆయనలో సబ్జెక్టు అంతకన్నా లేదు అని విమర్శించారు. రాష్ట్రంలోని పట్టభద్రులకు కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు బీజేపీ నేతలకు లేదని తెలిపారు. దేవుని పేరుతో రాజకీయాలు చేసే బీజేపీ అగర్‌బత్తీలపై మీద కూడా జీఎస్టీ వేసిందని విమర్శించారు. ఉన్నత విద్యపై 18 శాతం జీఎస్టీ ఏంటని నిలదీశారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు ఇచ్చిన హామీల మాట ఏమైందని ప్రశ్నించారు. ట్రైబల్ యూనివర్సిటీ పనులు కూడా మొదలుపెట్టని అసమర్థ స్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు.

మాది ఇండియా టీం.. కాంగ్రెస్‌ది పాకిస్తాన్ టీం

ఎమ్మెల్సీ ఎన్నికల మ్యాచ్‌లోనూ కాంగ్రెస్ టీంను చిత్తుగా ఓడిస్తాం : కేంద్ర మంత్రి బండి సంజయ్ వివాదాస్పద వ్యాఖ్యలు

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'మా పార్టీ ఇండియా టీం.. కాంగ్రెస్‌ది పాకిస్తాన్ టీం.. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల మ్యాచ్‌లో కాంగ్రెస్ టీంను చిత్తుగా ఓడిస్తాం' అని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. '14 నెలల కాంగ్రెస్ పాలనపై ఎమ్మెల్సీ ఎన్నికలే రెఫరెండంగా తీసుకుందాం?.. ఉద్యోగాల కల్పన, నిధుల ఖర్చుపై బహిరంగ చర్చకు సవాల్ విసిరితే సీఎం తోకముడిచారు' అని ఆయన విమర్శించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సంజయ్ మాట్లాడారు.



గుజరాత్, మధ్యప్రదేశ్‌లోనే కాదు.. తెలంగాణలోనూ ఎప్పటి నుంచో దూదేకుల వంటి సామాజిక తరగతులకు రిజర్వేషన్లు అమలవుతున్నాయని, దానికి తాము ఏనాడూ అభ్యంతరం పెట్టలేదని చెప్పారు. 12.5 శాతం ముస్లిం జనాభాలో 10.8 శాతం మందిని బీసీల్లో కలుపుతామంటే ఎందుకు ఒప్పుకుంటామని అన్నారు. నూటికి 88 మందికిపైగా ముస్లింలను బీసీల్లో కలిపి బీసీల పొట్టకొడితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్ పాలనలోనే ఫోన్ ట్యాపింగ్ దొంగలు విదేశాలకు పారిపోయింది నిజం కాదా? అని, సీబీఐ విచారణ కోరితే హైకోర్టు ముందే తమ అడ్వకేట్ జనరల్ ఒప్పుకోని మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం, డ్రగ్స్, ఫార్ములా ఈ రేస్ కేసుల్లో కేసీఆర్ కుటుంబాన్ని టచ్ చేసే దమ్ము మీకు లేదా? అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పాయల శంకర్, కాటేపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప పాల్గొన్నారు.

పోలింగ్ రోజు ప్రయివేటు స్కూల్స్, కాలేజీలకు సెలవివ్వండి

బండి సంజయ్ కుమార్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి

ఈ నెల 27న గ్రాడ్యుయేట్స్ ఎన్నికలకు సంబంధించి విలువైన ఓటు హక్కును వినియోగించు కునేందుకు పట్టభద్రులు అందరికీ అవకాశాన్ని కల్పిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను మంజూరు చేసింది. చాలా కళాశాలల్లో, పాఠశాలల్లో ఓటు హక్కు కలిగిన సిబ్బందికి కొన్ని గంటలు మాత్రమే పర్మిషన్ ఇస్తామని చెబుతున్నట్టు మా దృష్టికి వచ్చింది. కచ్చితంగా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు యాజమాన్యాలు ఓటు కలిగిన సిబ్బందికి రోజంతా సెలవు దినాన్ని ప్రకటించాలి. వారికి ఏడాదిలో అందిం చే సీఎల్‌లకు వీటికి సంబంధం లేకుండానే అదనంగా పోలింగ్ రోజు సెలవు దినంగా అవకాశాన్ని ఇవ్వాలి.

బండి సంజయ్.. దిగజారుడు మాటలు మానుకో..

- ప్రతి అంశంలో ముస్లిములు, పాకిస్తాన్‌ను ముడిపెట్టడం సరికాదు
- ప్రతి ఎన్నికల్లోనూ మతవిద్వేషాలను రెచ్చగొట్టడం అలవాటైంది
- అభ్యర్థిని పెట్టకుండా బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు : టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి



'ప్రతి అంశంలోనూ.. దేశానికి, పాకిస్తాన్‌కు, హిందువులకు-ముస్లిములకు ముడిపెట్టడం.. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ మతవిద్వేషాలు రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఇకనైనా పద్ధతి మార్చుకో.. దిగజారుడు మాటలు మానుకో..' అని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తన అభ్యర్థిని పెట్టకుండా బీజేపీకి మద్దతుగా నిలుస్తోందని, పదేండ్లుగా ఆ రెండు పార్టీల మధ్య ఉన్న చీకటి లోపాయికారి ఒప్పందం మరోమారు బయటపడిందని అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ బిడ్డగా తమరికి కేంద్రంలో స్థానం రావడం తమకు సంతోషంగా ఉందని, ఆ బాధ్యతను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వర్తించాల్సింది పోయి.. మళ్లీ పాత పద్ధతిలోనే హిందూ ముస్లిం, ఇండియా- పాకిస్తాన్ అంటూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. దుబాయ్‌లో పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో ఇండియా గెలిస్తే.. అది బీజేపీ గెలిపించినట్టు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పట్టభద్రుల ఎన్నికలు అంటేనే రాష్ట్ర స్థితిగతులు, రాష్ట్ర అంశాలను అవగాహన చేసుకుని ఓటు వేసే అంశమని చెప్పారు. 'మీరెన్ని కుట్రలు పన్నినా.. ఎన్ని మత విద్వేషపు మాటలు మాట్లాడినా మా అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపును ఆపలేరు.. సీఎం నాయకత్వంలో ఏడాదిలో చేసిన అభివృద్ధి, తీసుకొచ్చిన సంక్షేమాలు.. మీరు పది సంవత్సరాల్లో చేసిన దానిపై చర్చకు సిద్ధం' అని సవాల్ విసిరారు. పదేండ్లలో కనీసం 50వేల ఉద్యోగాలు భర్తీ చేయలేదని, తాము వచ్చిన ఏడాదిలోనే 55వేల ఉద్యోగాలు భర్తీ చేశామని వివరించారు. ఇంకా ఖాళీగా ఉన్న ఉద్యోగాలనూ భర్తీ చేస్తామని తెలిపారు. ఫార్ములా ఈ రేసులో కేటీఆర్ అవినీతి చేశారన్న దానిపై తాము నోటీసులు ఇవ్వలేదంటున్న సంజయ్.. ఫోన్ ట్యాపింగ్ కేసులో తేల్చాల్సింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని గుర్తు చేశారు.

గుజరాత్ గురించి మాట్లాడే బండి సంజయ్ తెలంగాణ అభివృద్ధి గురించి ఎందుకు మాట్లా డరని ప్రశ్నించారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి కేంద్రం నుంచి రావాల్సిన మెట్రో రైల్ నిధులు, ఫోర్త్ సిటీ అంశం తదితర వాటిపై ఎప్పుడైనా ప్రధానిని అడిగారా? కనీసం పార్లమెంట్‌లో ప్రశ్నించారా? అని అన్నారు.

ఈ రోజు ఏ మొఖం పెట్టుకుని ఓట్లు అడుగు తున్నారంటూ విమర్శించారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కాంగ్రెస్ అభ్యర్థిని ఆదరించాలని కోరారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

ప్రతిఘటనకు ఓ సాధనంగా..

మారా కలెక్టివ్... హింసకు గురైన మహిళల స్వరాన్ని ప్రపంచానికి వినిపిస్తోంది. బాధిత అందునా దళిత మహిళలు తమ కథలను తిరిగి రాయడానికి అవసరమైన శక్తినిస్తోంది. గ్రామీణ మధ్యప్రదేశ్‌లో లైంగిక, కుల ఆధారిత హింస నుండి బయటపడినవారు దళిత మహిళా నాటక రచయితలు మారారు. నాటకాన్ని తమ ప్రతిఘటనకు ఒక సాధనంగా మలుచుకున్నారు. ఇప్పటి వరకు వినని తమ మనసులోని వేధనను ధైర్యంగా సమాజానికి చాటిచెబుతున్నారు.



మారా లైంగిక హింస, అత్యాచారానికి గురైన మొదటి వ్యక్తి కథలను వివరిస్తుంది. 'మీలో చెప్పలేని కథను మోయడం కంటే గొప్ప వేదన మరొకటి లేదు' అంటారు తన 'ఐ నో వై ది కేజ్డ్ బర్డ్ సింగ్స్' (1969) అనే కవితా సంపుటిలో ప్రముఖ రచయిత్రి మాయా ఏంజెలో. 2018లో గ్రామీణ భారతదేశంలోని దాదాపు వంద మంది మహిళలు లైంగిక, లింగ ఆధారిత హింస అనుభవాలను వివరించారు. వాటిని విన్న తర్వాత అంగారికా గుహ, అనుషి అగర్వాల్ ఓ ఆలోచన చేశారు. బెంగళూరుకు చెందిన 'మారా' అనే సంస్థ ఆధ్వర్యంలో ఆ బాధిత మహిళల అనుభవాలను 'చు కర్ దేఖో' (టచ్ అండ్ సీ) అనే నాటకాన్ని రూపొందించారు.

సామూహిక ప్రతిధ్వని

మారా కలెక్టివ్ సభ్యులలో మమతా సోలంకి ఒకరు. ఊహించలేని హింసకు గురైన తర్వాత సోలంకి నిశ్శబ్దంలోకి నెట్టబడింది. భర్త ఆమెను విడిచిపెట్టి వెళ్లిన తర్వాత ఇండ్లలో వంట చేసుకుంటూ బతికింది. అనేక కష్టాలు అనుభవించింది. ఒక రోజు క్యాటరింగ్ ఆర్డర్ ఇస్తామని చెప్పి ఆమెను సుదూర గ్రామానికి తీసుకెళ్లారు. అక్కడ ఆధిపత్య కులానికి చెందిన వ్యక్తుల బృందం ఆమెను బంధించి రెండు రోజులు లైంగికంగా వేధించింది. కానీ పోలీసులు ఆమె చెప్పిన విషయాన్ని నమ్మలేదు. నిందితులపై చర్య తీసుకోవడంలో ఆలస్యం చేశారు. చివరికి నేరస్థులను అరెస్టు చేసినా కోర్టు వారికి వెంటనే బెయిల్ ఇచ్చేసింది. విడుదలయ్యాక ఆమెపై మళ్లీ దాడి చేసి బెదిరించడం మొదలుపెట్టారు. దాంతో సోలంకి తన గ్రామంలో ఇక జీవించడం కష్టమని నిర్ధారించుకున్నారు. గుహ, అగర్వాల్‌లను మొదటిసారి కలిసినప్పుడు ఆమె వారితో మాట్లాడలేక పోయింది. బయటకు అడుగు పెట్టడానికి కూడా భయపడింది. కానీ 'చు కర్ దేఖో' చూసిన తర్వాత సోలంకిలో ఏదో మార్పు వచ్చింది.

ప్రేక్షకులకు వేరే మార్గం లేదు

'వేదికపై మా కథలు చూసినప్పుడు చలించిపోయాను. కానీ నేను ఒంటరిగా లేను, నా చుట్టూ ఉన్న చాలా మంది మహిళలు కూడా ఏడుస్తున్నారు. ఆ క్షణంలో, మేమందరం కోలుకోవడం ప్రారంభించామని నేను అనుకుంటున్నాను. చాలా కాలంగా సమాజం నన్ను నమ్మడానికి, నా బాధను అంగీకరించడానికి నిరాకరించింది. కానీ ఇప్పుడు, నేను ప్రపంచం ముందు నిలబడి నా సొంత మాటలలో నా కథను చెప్పాను. నేను వేదికపై ఉన్నప్పుడు ప్రేక్షకులకు వినడం తప్ప వేరే మార్గం లేదు. వారు అసౌకర్యంతో కూర్చోవాలి, వారి మనసులలో, శరీరాలలో దానిని అనుభవించాలి, దానిని అంగీకరించాలి. ఎందుకంటే నేను ఇకపై కనిపించను' అంటూ ఆమె గుర్తు చేసుకున్నారు.

ధైర్యంగా చెప్పడానికి

సమాజంలో చాలా మంది మహిళలు చదవలేరు, రాయలేరు. అందుకే వారు స్కెచ్‌లు గీయడం ప్రారంభించారు. అవి స్టోరీబోర్డులుగా మారాయి. ఈ మహిళలు థియేటర్‌ను ప్రతిఘటన రూపంగా మలుచుకున్నారు. తమలోని బాధను, నిజాలను సమాజానికి ధైర్యంగా చెప్పడానికి ఈ వేదికను ఉపయోగించుకుంటున్నారు. సమాజంలో తమను తాము ఓ శక్తిగా నిలబెట్టుకుంటున్నారు. దీని నుండి రూపుదిద్దుకున్న మొదటి నాటకం 'నజర్ కే సామ్నే' (ఇది ఇప్పుడు బ్యాంకాక్‌లో 50 ప్రదర్శనలు పూర్తి చేసింది). ఈ నాటకం మహిళల జీవిత అనుభవాల ద్వారా హింసలోని గతిశీలతను అన్వేషిస్తుంది. అయితే ఇది హింసను ఒక ఏకైక సంఘటనగా చూడటాన్ని తిరస్కరిస్తుంది. దీనికి బదులుగా బాధిత మహిళలు స్వేచ్ఛగా, ఇష్టంగా, ఎలాంటి భయం లేకుండా ఇంటి నుండి బయటకు అడుగు పెట్టే హక్కును అన్వేషిస్తుంది. డ్రాయింగ్, ఇంప్రూవైజేషన్, కదలికల ద్వారా స్క్రిప్ట్‌ను రూపొందించారు.



ఇది వ్యక్తిగత చరిత్రల నుండి ఉద్భవించిన నజర్ కే సామ్నే మాదిరిగా కాకుండా, మహిళలు వారి సొంత అనుభవాల నుండి బయటపడటానికి, విస్తృత అధికార వ్యవస్థలను విమర్శించడానికి థియేటర్‌ను ఉపయోగించడానికి ఈ నాటకం వీలు కల్పిస్తుంది.

అవమానంగా భావించారు

మరొక సభ్యురాలైన వర్ష మాల్వియా.. ఆమె శరీరం, మనసు భరించిన హింసను వివరిస్తుంటే ఇప్పటికీ ఆమె వణికిపోతుంది. అగర్వాల్, గుహతో మొదటిసారి తన కథను పంచుకోమని అడిగినప్పుడు ఆమె అపరాధ భావన, సిగ్గుతో కుంగిపోయింది. 'నన్ను నా ఇంటి నుండి కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసి, డెహ్రాడూన్‌లో అమ్మేశారు. నేను తప్పించుకుని తిరిగి ఇంటికి వెళితే కుటుంబ సభ్యులు నన్ను నిరాకరించారు. నన్ను వాళ్లు అవమానంగా భావించారు. చాలా కాలం పాటు నేను కూడా దాన్ని నమ్మాను. జరిగిన ప్రతిదానికీ నన్ను నేను నిందించుకున్నాను' అని ఆమె పంచుకున్నారు. మారా బృందంతో రోజుల తరబడి కూర్చున్న తర్వాతే ఆమె అవగాహన మారిపోయింది. 'ఇది నేను భరించాల్సిన అవమానం కాదని, అసలైన నిజం ఏమిటో స్పష్టంగా కనిపించడానికి వారు నాకు సహాయం చేసారు' అంటూ జత చేశారు. తర్వాత ఆమె పంచాయితీ హాళ్లు, కమ్యూనిటీ స్థలాలు, గ్రామాలలో ప్రదర్శన ఇవ్వడం ప్రారంభించారు. ఇక్కడ పితృస్వామ్య, కుల ఆధారిత హింస రోజువారీ వాస్తవికత. కొన్నిసార్లు ప్రేక్షకులలోని ఆధిపత్య కుల పురుషులు నాటకం ఇతివృత్తాలను తోసిపుచ్చారు. కొన్ని సార్లు భద్రతా కారణాల రీత్యా ప్రదర్శనలను తరలించాల్సి వచ్చింది. అయినప్పటికీ మహిళలు చూడటానికి వచ్చారు.

థియేటర్ ఉపయోగించుకుంటూ...

ఈ బృందం ఇప్పుడు మార్జ్ బౌర్ మోయినా కి కహానీ అనే కొత్త నాటకాన్ని విడుదల చేసింది. ఇది ఇద్దరు యువతులు తమ భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్న అవినీతిపరుడైన రాజు, మంత్రిపై పోరాడే కథ. అయితే ఇది వ్యక్తిగత చరిత్రల నుండి ఉద్భవించిన నజర్ కే సామ్నే మాదిరిగా కాకుండా, మహిళలు వారి సొంత అనుభవాల నుండి బయటపడటానికి, విస్తృత అధికార వ్యవస్థలను విమర్శించడానికి థియేటర్‌ను ఉపయోగించడానికి ఈ నాటకం వీలు కల్పిస్తుంది. ప్రదర్శన ఈ మహిళలకు చలనశీలత, స్వాతంత్ర్యం, కొంతమందికి ఆర్థిక స్థిరత్వాన్ని కూడా ఇచ్చింది. ఒకప్పుడు గ్రామాలకే పరిమితమైన వారు ఇప్పుడు ప్రదర్శనల కోసం నెలకు 15-20 రోజులు ప్రయాణిస్తారు. నగరాల్లో, స్త్రీవాద సమావేశాలలో, అంతర్జాతీయ ప్రదేశాలలో ప్రదర్శనలు ఇచ్చారు. మారా చేస్తున్న కృషికి స్త్రీవాదులు, వ్యక్తిగత దాతలు మాత్రమే మద్దతు ఇస్తున్నారు. అయితే నిధులు పొందడం వీరికి ఎప్పుడూ ఒక సవాలే. ■

గర్భిణీలకు ఆహార జాగ్రత్తలు

పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా జన్మించాలన్నా.. ఆమె హెల్తీగా ఉండాలన్నా గర్భిణీలు చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆహారం తీసుకునే విషయంలో కొన్ని సూచనలు పాటించాలి. గర్భిణీ సమయంలో తల్లి ఆరోగ్యానికి, బిడ్డ పెరుగుదలకు సరిపోయేంత ఆహారం కొంచెంకొంచెంగా ఎక్కువ సార్లు తినాలి. కాల్షియం, ఇనుము అధికంగా ఉన్న ఆహారం తీసుకోవాలి. వీటితో పాటు పుల్లటి పండ్లు తీసుకోవాలి. పాలు, మాంసం, గుడ్లు, చేపలు, కొవ్వు పదార్థాలు ఎక్కువగా తీసుకోవటం మంచిది. అలాగే సరైన విశ్రాంతి తీసుకోవాలి. గర్భిణీలలో ముఖ్యంగా రక్తహీనత సమస్య ఉంటుంది. దీని వలన బరువు తక్కువ ఉన్న బిడ్డలు పుట్టడం, తల్లికి అధిక రక్తస్రావం కావడం జరుగుతుంది. కాబట్టి ఇనుము ఎక్కువగా ఉన్న ఆహారం అంటే ఆకుకూరలు,



బెల్లం, రాగులు, ఎండిన పండ్లు (కర్జూరం, ద్రాక్ష), నువ్వులు, చెరుకురసం, ఉలవలు తీసుకోవాలి.

రోజుకు ఒకటి చొప్పున ఐరన్ మాత్రలు వేసుకోవాలి. కొన్ని రకాల పండ్లు, ఆహార పదార్థాలు తినడం వల్ల సమస్యలు వస్తాయన్న అపోహలు ఉన్నాయి. బొప్పాయి తినడం వల్ల గర్భస్రావం అవుతుందనడం ఎంత మాత్రం నిజం కాదు. ఇందులో అధిక కేలరీలు ఉంటాయి. అందుకే తొందరగా జీర్ణం కాదు. కొబ్బరి నీళ్లలో ఎక్కువ మోతాదులో పొటాషియం, లవణాలు ఉంటాయి. బీట్‌రూట్‌లో ఇనుము, బీటా కెరోటిన్లు... క్యారెట్ కన్నా ఎక్కువ మోతాదులో ఉంటాయి. అందువల్ల బీట్‌రూట్ కన్నా క్యారెట్ కొంత వరకు మంచిదే. అరటిపండు తినడం వల్ల పిల్లలు నల్లగా పుట్టరు. జున్ను తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిది. దీనిలో ఎక్కువగా కొవ్వు పదార్థాలు ఉంటాయి. అందువల్ల ఎక్కువ తింటే అజీర్ణం చేయవచ్చు . అందుకే మిరియాలను కలుపుకొని తినాలి. దానివల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు.



ఇరాన్ షాడో ట్యాంకర్లపై
అమెరికా ఆంక్షలు
భారత కంపెనీలపైనా ప్రభావం

వాషింగ్టన్ : ఇరాన్ నుంచి చమురును ఎగుమతి చేయకుండా అడ్డుకొనేందుకు అమెరికా చర్యలు చేపట్టింది. ఇరాన్ షాడో ట్యాంకర్లు, వాటి ఆపరేటర్లు, మేనేజర్లను లక్ష్యంగా చేస్తూ అమెరికా తాజాగా ఆంక్షలు విధించింది. వివిధ దేశాలకు చెందిన 30మంది వ్యక్తులు, కంపెనీలు, ట్యాంకర్లు ఈ జాబితాలో ఉన్నాయి. ఇందులో భారతీయుల పేర్లు కూడా చేర్చినట్లు సమాచారం. వీరంతా ఇరాన్ చమురు విక్రయాలు, బ్రోకరేజీల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. హాంకాంగ్, యుఎఇలోని చమురు బ్రోకర్లు, నేషనల్ ఇరానియన్ అయిల్ కంపెనీలు ఉన్నాయి. 'ఇరాన్ తరచూ లక్షల పీపాల చమురును ఎగుమతి చేయడానికి రహస్య ట్యాంకర్లు, షిప్పింగ్ కంపెనీలు, బ్రోకర్లపై ఆధారపడుతోంది. ఇలా వచ్చిన నిధులను ఇతర దేశాలను అస్థిరపరిచే చర్యలకు వాడుతోంది. ఇరాన్ చమురు సరఫరా గొలుసుకట్టు వ్యవస్థలను దెబ్బతీయడానికి అమెరికా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగిస్తోంది. ఎవరైనా ఇరాన్‌తో ఆయిల్ డీల్స్ చేస్తే తమ ఆంక్షల పరిధిలోకి వస్తారు" అని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సాంట్ తెలిపారు.ఈ తాజా ఆంక్షల పరిధిలోకి భారత్‌లోని కొన్ని కంపెనీలు రానున్నాయి. బిఎస్ఎం మారిటైమ్ లిమిటెడ్ లైబిలిటీ పార్టనర్‌షిప్, ఆస్టిన్‌షిప్ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్, కాస్మోస్ లైన్స్ ఐఎన్‌సీ సంస్థలు ఉన్నాయి. ఇవన్నీ ఉద్దేశపూర్వకంగానే ఇరాన్‌తో కలిసి చమురు రవాణా, కొనుగోలు, మార్కెటింగ్ వంటి కార్యకలాపాలకు పాల్పడినట్లు అమెరికా చెబుతోంది. అలాగే, ఫ్లక్స్ మారిటైమ్ ఎల్ఎల్‌పీ సంస్థ ఓ నౌకకు టెక్నికల్ మేనేజర్‌గా పనిచేసింది. ఆ ఓడ లక్షల టన్నుల ఇరాన్ ముడి చమురును రవాణా చేసిందని అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ పేర్కొంది. ఇరాన్‌పై వీలైనంత ఆర్థికఒత్తిడిని పెంచాలని ట్రెజరీ సెక్రటరీని ఆదేశిస్తూ ఈనెల ప్రారంభంలో ట్రంప్ ఓ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను జారీ చేశారు. అలాగే, విదేశాంగ శాఖను కూడా ఆయన ఆదేశించారు. ఇరాన్ నుంచి చమురు ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయేలా చూడాలన్నారు.

అలుపెరుగని పోరాటం చేస్తా

(మొదటిపేజీ తరువాయి)

మినిమమ్ బేసిక్ పే, కేర్ టేకర్ పోస్టు మంజూరు, హెల్త్ కార్డులు, ఉద్యోగ భద్రత సాధించాలని తెలిపారు. గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పండిట్, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్, సీఆర్టీలకు మినిమమ్ బేసిక్ పే, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు పోస్టుల మంజూరు, తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. వీటితోపాటు ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

డాలర్ దెబ్బ.. రూపాయి వామ్మో

న్యూఢిల్లీ : అమెరికా టారిఫ్ యుద్ధ అనిశ్చిత్తులకు తోడు దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడంతో రూపాయి విలువ భారీగా పతనమయ్యింది. స్టాక్ మార్కెట్ల వరుస పతనం.. ఎఫ్ఐఐలు తరలిపోవడంతో రోజు రోజుకు ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 51 పైసలు క్షీణించి 87.23కు దిగజారింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్సేంజీలో డాలర్‌తో రూపాయి విలువ 86.83 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో ఏకంగా 87.23కి పడిపోయింది. తుదకు 51 పైసలు కోల్పోయి 87.23 వద్ద ముగిసింది.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై తలోదారి!

న్యూయార్క్ : సోమవారం జరిగిన ఐరాస సర్వసభ్య సమావేశంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సమావేశం రెండు తీర్మానాలను ఆమోదించగా ఓటింగుకు భారత్ గైర్హాజరు అయింది. వీటిలో ఒక దానికి ఉక్రెయిన్, యూరోపియన్ యూనియన్ మద్దతు ఇవ్వగా మరో తీర్మానాన్ని అమెరికా ప్రతిపాదించింది. అయితే అట్లాంటిక్ దేశాలు కొన్ని సవరణల ద్వారా తీర్మానాల్లో మార్పులు చేశాయి. ఉక్రెయిన్ యుద్ధంపై చర్చించేందుకు అమెరికా, ఫ్రాన్స్ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, ఇమ్మానుయేల్ మాక్రాన్ వాషింగ్టన్‌లో సమావేశమైన సమయంలోనే పశ్చిమ దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం గమనార్హం. కాల్పుల విరమణ ఏ మేరకు విజయం సాధించిందన్న విషయంపై ఇరువురు నేతలు పరస్పర విరుద్ధంగా స్పందించారు. రష్యాకు ఉక్రెయిన్ శాశ్వతంగా భూమిని కోల్పోవాల్సిందేనని అమెరికా అంటోంది. దీనిపై మాక్రాన్ స్పందిస్తూ 'శాంతి అంటే ఉక్రెయిన్ లొంగిపోవడం కాదు. గ్యారంటీలు లేకుండా కాల్పుల విరమణ పాటిస్తున్నట్లు అర్థమూ కాదు' అని స్పష్టం చేశారు.

సర్వసభ్య సమావేశంలో...

యుద్ధంపై రష్యాకు వ్యతిరేకంగా ఈయూ, ఉక్రెయిన్ తీర్మానాన్ని ప్రతిపాదించగా అమెరికా, రష్యా, బెలారస్, ఉత్తర కొరియా వ్యతిరేకంగా ఓటేశాయి. తీర్మానానికి అనుకూలంగా 93 ఓట్లు, వ్యతిరేకంగా 18 ఓట్లు వచ్చాయి. 65 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయాయి. రష్యా ప్రతిపాదించిన సవరణ కూడా వీగిపోయింది. ఇక అమెరికా ప్రతిపాదించిన తీర్మానానికి యూరోపియన్ దేశాలు భారీగా సవరణలు ప్రతిపాదించాయి. ఇవన్నీ ఉక్రెయిన్‌కు అనుకూలమైనవే. అమెరికా తీర్మానాన్ని ఐరాస సమావేశం ఆమోదించినప్పటికీ చివరికి దానిని ట్రంప్ ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. సవరణలకు 93 దేశాలు అనుకూలంగా ఓటేయగా కేవలం 8 దేశాలు మాత్రమే వ్యతిరేకించాయి. 73 దేశాలు ఓటింగుకు గైర్హాజరు అయ్యాయి.

ఓటింగుకు దూరంగా భారత్

అందరూ భావించినట్లుగానే రెండు తీర్మానాలపై జరిగిన ఓటింగుకు భారత్ దూరంగా ఉంది. రష్యాను విమర్శిస్తూ ఈయూ ప్రతిపాదించిన తీర్మానంపై జరిగిన ఓటింగులో భారత్ పాల్గొనలేదు. గత మూడు సంవత్సరాల కాలంలో భారత ప్రభుత్వం ఇంత బహిరంగంగా ఎన్నడూ తన వైఖరిని బహిర్గతం చేయలేదు. అమెరికా ప్రతిపాదించిన తీర్మానంలో కఠినమైన భాషను వాడకపోవడంతో దానికి మద్దతుగా భారత్ ఓటింగులో పాల్గొంటుందని అందరూ అనుకున్నారు. అయితే రష్యా ఆక్రమణను వ్యతిరేకిస్తూ సవరణ ప్రతిపాదించగానే భారత్ ఓటింగుకు దూరమైంది. ఐరాసలో ఉక్రెయిన్‌పై గతంలో చేసిన తీర్మానాల విషయంలో ఎలా వ్యవహరించిందో ఇప్పుడూ అదే వైఖరి తీసుకుంది. ఐరాస సమావేశంలో అమెరికా ప్రతిపాదించిన తీర్మానానికి ఫ్రాన్స్ తెచ్చిన మూడు కీలక సవరణలు ఆమోదం పొందాయి.

భద్రతా మండలిలోనూ...

సోమవారం మధ్యాహ్నం జరిగిన ఐరాస భద్రతా మండలి సమావేశంలో ఉక్రెయిన్‌పై అమెరికా, ఈయూ మధ్య మరోసారి విభేదాలు బయటపడ్డాయి. రష్యాను సమర్థించేలా అమెరికా తీర్మానాన్ని ప్రవేశపెట్టగా దానికి ప్రతిపాదించిన సవరణలు వీగిపోయాయి. తీర్మానాన్ని 10 దేశాలు సమర్థించగా యూరోపియన్ కౌన్సిల్ దేశాలైన ఫ్రాన్స్, బ్రిటన్, గ్రీస్, స్లొవేనియా, డెన్మార్క్ గైర్హాజరు అయ్యాయి. దీంతో ఉక్రెయిన్‌పై భద్రతామండలి మొట్టమొదటిసారిగా తీర్మానాన్ని ఆమోదించింది. గతంలో రెండుసార్లు ఆ ప్రయత్నం జరిగినప్పటికీ రష్యా వీటో చేసింది.

విభేదాలకు బీజం

అట్లాంటిక్ ప్రాంతంలో విభేదాలకు ఈ నెల ప్రారంభంలోనే బీజం పడింది. ట్రంప్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో చర్చించారు. యుద్ధాన్ని ఆపేందుకు చర్చలు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ పరిణామంపై యూరోపియన్ యూనియన్ దేశాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. యూరోపియన్ నేతలను పట్టించుకోకుండా ట్రంప్ ఏకపక్షంగా వ్యవహరిస్తారేమోనని అవి భావించాయి. అమెరికా రక్షణ మంత్రి హెగ్‌సేథ్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బ్రెజెల్స్, మ్యూనిచ్‌లో పర్యటన జరిపిన తర్వాత ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏదేమైనా రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై పశ్చిమ దేశాల మధ్య నెలకొన్న విభేదాలు ఐరాస సర్వసభ్య సమావేశంలోనూ, భద్రతా మండలిలోనూ బయటపడ్డాయి. మండలిలో శాశ్వత సభ్య దేశాలైన అమెరికా, రష్యాలు యూరోపియన్ యూనియన్ మద్దతిచ్చిన తీర్మానాన్ని వ్యతిరేకించాయి.

సర్వసభ్య సమావేశంలో చైనా ఓటింగుకు దూరంగా ఉండగా బ్రిటన్, ఫ్రాన్స్ ఆ తీర్మానానికి మద్దతు ఇచ్చాయి. హంగరీ మినహా మిగిలిన ఈయూ దేశాలన్నీ రెండు తీర్మానాలకూ అనుకూలంగా ఓటేశాయి. నాటో సభ్య దేశాల విషయానికి వస్తే అమెరికా, హంగరీ మాత్రమే ఈయూ కూటమితో విభేదించాయి. జీ-77లోని 134 దేశాల మధ్య కూడా ఏకాభిప్రాయం కన్పించలేదు. ఆసియా, ఆఫ్రికా దేశాల మధ్య ఈ విభేదాలు మరింత ఎక్కువగా ఉన్నాయి. దక్షిణాసియా దేశాల్లో మిశ్రమ స్పందన కన్పించింది. భారత్, పాకిస్తాన్, శ్రీలంక దేశాలు రెండు తీర్మానాల ఓటింగుకూ దూరంగానే ఉన్నాయి. నేపాల్, మాల్దీవులు, భూటాన్ దేశాలు ఈయూ తీర్మానానికి అనుకూలంగా ఓటేయగా దానికి బంగ్లాదేశ్ దూరంగా ఉండిపోయింది. కానీ ఆ తర్వాత అమెరికా తీర్మానానికి చేసిన సవరణలకు మద్దతు ఇచ్చింది.

కిం కర్తవ్యం ?

కెనడా వీసా ని'బంధనాల'తో భారతీయుల ఇబ్బందులు



న్యూఢిల్లీ : వలసలను నివారించేందుకు కెనడా ప్రభుత్వం చేపట్టిన తాజా చర్యల కారణంగా వేలాది మంది విదేశీ విద్యార్థులు, కార్మికులు సమస్యల వలయంలో చిక్కుకొని విలవిలలాడుతున్నారు. వీరిలో భారతీయులు కూడా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. పని, నివాస పర్మిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిపై కూడా కెనడా నిర్ణయం ప్రతికూల ప్రభావం చూపుతోంది. కెనడా ప్రభుత్వం విధించిన తాజా వీసా నిబంధనలు ఈ నెల ప్రారంభం నుండే అమలులోకి వచ్చాయి. విద్యార్థులు, కార్మికులు, వలసవాదుల వీసా హోదాను ఏ సమయంలో అయినా మార్చేసే అధికారాన్ని సరిహద్దు అధికారులకు కట్టబెడుతూ కెనడా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే ఈ గందరగోళానికి కారణమైంది. నూతన ఇమ్మిగ్రేషన్-రెఫ్యూజీ ప్రొటెక్షన్ నిబంధనల ప్రకారం తాత్కాలిక నివాస పత్రాలను నిరాకరించే లేదా తిరస్కరించే అధికారం కెనడా సరిహద్దు సిబ్బందికి ఉంటుంది. అంటే దీనర్థం సరిహద్దు అధికారులు అలాంటి పత్రాలను రద్దు చేయవచ్చు. వీటిలో వర్క్ పర్మిట్లు, స్టూడెంట్ వీసాలు కూడా ఉన్నాయి. అయితే పర్మిట్లు, వీసాలు రద్దు చేసేందుకు కొన్ని మార్గదర్శకాలను రూపొందించారు. నూతన నిబంధనలు అనిశ్చితికి దారితీసే అవకాశం ఉన్నదని, వేలాది మందిపై ప్రభావం పడుతుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కెనడాలో నివసిస్తున్న విదేశీ విద్యార్థులు, ఉద్యోగుల్లో భారతీయుల సంఖ్యే అధికం. భారతీయ విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు, చట్టబద్ధమైన వలసవాదులకు కెనడా అనువైన ప్రదేశం. కెనడాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్యే 4.2 లక్షలకు పైగా ఉంటుంది.

విద్యార్థి, కార్మికుడు, ఉద్యోగి లేదా వలసదారుడు...ఎవరైనా సరే తిరస్కరణకు గురైతే దేశంలో ప్రవేశించే చోటే నిలిపివేసి స్వదేశానికి పంపుతారు. ఒకవేళ పర్మిట్ రద్దయిన వ్యక్తి అప్పటికే అక్కడ నివసిస్తున్నా చదువుకుంటున్నా నిర్దిష్ట సమయం లోగా దేశం విడిచి వెళ్లాల్సిందిగా నోటీసు ఇస్తారు. విద్యార్థులు, ఉద్యోగులే కాదు. పర్యాటకులు కూడా అధిక సంఖ్యలో కెనడా వెళుతుంటారు. వారందరికీ తాత్కాలిక పర్మిట్లు జారీ చేస్తారు. ఎంత కాలం నివసించవచ్చో నిర్దేశిస్తారు. గత సంవత్సరం తొలి ఆరు నెలల కాలంలో కెనడా 3.6 లక్షల మందికి పైగా భారతీయులకు పర్యాటక వీసాలు జారీ చేసింది. కాగా ఒకవేళ పర్మిట్లు, వీసాలు రద్దయితే అప్పటికే మదుపు చేసిన సొమ్ము గతి ఏమిటన్నది ఇంకా తెలియడం లేదు. విద్యకో, రుణానికో, తనఖాకో, అద్దె రూపంలోనో చెల్లించిన డబ్బు బూడిదలో పోసిన పన్నీరేనా అనే ఆందోళన వ్యక్తమవుతోంది.

అన్ని బడుల్లో
'తెలుగు' తప్పనిసరి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోనూ తెలుగు సబ్జెక్టును తప్పనిసరిగా బోధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సహా ఇతర బోర్డు పాఠశాలల్లో కూడా తెలుగు సబ్జెక్టును అమలు చేయాల్సిందేనని ఆదేశించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. 2025-26 విద్యాసంవత్సరంలో తొమ్మిదో తరగతి, 2026-27 విద్యాసంవత్సరంలో పదో తరగతి విద్యార్థులకు తెలుగు సబ్జెక్టును తప్పనిసరిగా బోధించాలని కోరారు. సీబీఎస్ఈ సబ్జెక్టు జాబితా ప్రకారం సింగిడి (ప్రామాణిక తెలుగు) స్థానంలో వెన్నెల (సులభమైన తెలుగు)ను ప్రవేశపెట్టామని తెలిపారు. మాతృభాష తెలుగును రాష్ట్రంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్‌తోపాటు గుర్తింపు పొందిన సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ, ఇతర బోర్డు యాజమాన్యాల్లోని పాఠశాలల్లో కూడా తెలుగును తప్పనిసరిగా బోధించాలని ఆదేశించారు. 2018, మార్చి 30న చట్టం 10 ద్వారా ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం వివిధ కారణాల వల్ల తెలుగు భాషను పూర్తిస్థాయిలో పాఠశాలల్లో అమలు చేయలేదని తెలిపారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం తెలుగు భాషను రాష్ట్రంలో తప్పనిసరిగా అమలు చేయాలనే సంకల్పంతో చర్యలను చేపట్టిందని వివరించారు. అందులో భాగంగానే సీబీఎస్ఈ యాజమాన్యాల బోర్డుతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరంలో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు తెలుగు బోధించి పరీక్షలను నిర్వహించామని నిర్ణయించామని పేర్కొన్నారు. తెలుగును సరళీకృత విధానంలో బోధించి చదువుకునే వారి అభిరుచి పెంచుతూ చదువును కొనసాగించడానికి సులభతర తెలుగు వాచకం వెన్నెలను పాఠ్యాంశంగా తొమ్మిది, పదో తరగతి సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ యాజమాన్యాల్లో పరీక్షలను నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారని తెలిపారు. సులభమైన తెలుగును అమలు చేయడం ద్వారా మాతృభాషేతర విద్యార్థులకు అలాగే ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్రంలో విద్యను అభ్యసించడానికి వచ్చిన విద్యార్థులకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. సులభమైన తెలుగును అమలు చేయడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులకు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ ఇతర బోర్డు పాఠశాలల్లోని విద్యార్థులకు తొమ్మిది, పదో తరగతుల్లో రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందని వివరించారు. 2025-26 విద్యాసంవత్సరం ఆయా యాజమాన్యాల్లో విధిగా తెలుగు భాషా బోధనా, పరీక్షల నిర్వహణ ఒకటి నుంచి పదో తరగతి వరకు జరగాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు.

పైసా.. కైసా...?

(మొదటిపేజీ తరువాయి)

కూడా ఇప్పుడు భరించే స్థితిలో లేం కాబట్టి, కొత్త పింఛన్ల జోలికి కూడా పోవటం లేదని ఓ అధికారి తెలిపారు. ఈ రకంగా ఉన్న పింఛన్లను రెట్టింపు చేయలేక, కొత్త పింఛన్లు ఇవ్వలేకా ప్రభుత్వం సతమతమవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోపాటు అంగన్‌వాడీల్లోని టీచర్లకు ఇచ్చే వేతనాన్ని అధికారులు భావిస్తున్నారు. ఇప్పుడున్న పింఛన్లకు అదనంగా వీటిని ఇవ్వాలనుకుంటే నెలకు అదనంగా రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకూ కావాల్సి ఉంటుందంటూ ఆర్థికశాఖ లెక్కలేసింది. ఈ మొత్తాన్ని కూడా ఇప్పుడు భరించే స్థితిలో లేం కాబట్టి, కొత్త పింఛన్ల జోలికి కూడా పోవటం లేదని ఓ అధికారి తెలిపారు. ఈ రకంగా ఉన్న పింఛన్లను రెట్టింపు చేయలేక, కొత్త పింఛన్లు ఇవ్వలేకా ప్రభుత్వం సతమతమవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.దీంతోపాటు అంగన్‌వాడీల్లోని టీచర్లకు ఇచ్చే వేతనాన్ని రూ.18 వేలకు పెంచుతామనీ, పీఎఫ్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ హామీనిచ్చింది. టీచర్లతోపాటు హెల్పర్లకు ఇచ్చే రిటైర్మెంట్ బెనిఫిట్లను రెట్టింపు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం వాగ్దానం చేసింది. ప్రస్తుతం టీచర్లకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.50 వేలను బెనిఫిట్లుగా ఇస్తున్నారు. ఇందుకోసం ప్రతీయేటా బడ్జెట్‌లో రూ.20 కోట్లను కేటాయిస్తున్నారు. వీటిని రెట్టింపు చేయాలంటే రూ.40 కోట్లు అవసరమవుతాయి. 'ఖజానా' కష్టాల నేపథ్యంలో సంబంధిత దస్త్రం కూడా పక్కకు పోయినట్టు సమాచారం.



చిక్కుల్లో లక్ష్యసేన్!

ఏజ్ ఫ్రాడ్ కేసులో విచారణకు ఆదేశం

బెంగళూర్ : భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ చిక్కుల్లో పడ్డాడు. తప్పుడు వయసు ధ్రువీకరణ పత్రాలను సృష్టించిన కేసులో లక్ష్యసేన్ సహా కుటుంబ సభ్యులు, కోచ్ విమల్ కుమార్‌పై క్రిమినల్ విచారణకు ఆదేశిస్తూ కర్నాటక హైకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. జూనియర్ సర్క్యూట్‌లో పోటీపడేందుకు లక్ష్యసేన్, అతడి సోదరుడు చిరాగ్ సేన్ బర్త్ సర్టిఫికేట్లను రెండున్నర సంవత్సరాలు తగ్గించి ఫోర్జరీ చేసిన కేసులో లక్ష్యసేన్, చిరాగ్ సేన్ తల్లిదండ్రులు ధీరేంద్ర సేన్, నిర్మల సేన్ సహా విమల్‌కుమార్‌పై 2022లోనే ఎఫ్‌ఐఆర్ నమోదు కాగా.. విచారణపై న్యాయస్థానం స్టే విధించింది. 'ఏజ్ ఫ్రాడ్ అంశంలో స్పష్టమైన పత్రాలు ఉన్నాయి. పలుమార్లు అవకాశాలు ఇచ్చినా పిటిషనరు తరఫు న్యాయవాది వాదనలు వినిపించకుండా వాయిదాలు కోరుతున్నారు. ఇక ఈ కేసులో విచారణ నిలిపివేయడానికి ఎటువంటి కారణాలు లేవు. క్రిమినల్ ప్రొసీడింగ్స్ మొదలుపెట్టండి అని క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ జస్టిస్ ఎం.జీ ఉమ ఆదేశాలు జారీ చేశారు. ఏజ్ ఫ్రాడ్ అంశంలోనే చిరాగ్ సేన్‌పై భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) 2016లో వేటు వేసింది.

ఆసీస్, సఫారీ పోరు వర్షార్పణం

- టాస్ పడకుండానే కీలక మ్యాచ్ రద్దు
- ఆసక్తికరంగా గ్రూప్-బి సెమీస్ రేసు

అగ్ర జట్లు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సమరానికి వరుణుడు అడ్డుపడ్డాడు. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్ తర్వాత ఆసీస్, సఫారీలు తలపడుతున్న తొలి మ్యాచ్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. రావల్పిండి స్టేడియంలో నిలకడగా వర్షం కురవటంతో మ్యాచ్ సాధ్యపడలేదు. మ్యాచ్ రద్దు కాగా ఇరు జట్లు పాయింట్లను పంచుకున్నాయి.

నవతెలంగాణ-రావల్పిండి

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో అభిమానులు ఎదురు చూసిన మ్యాచుల్లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా ఢీ ఒకటి. ఐసీసీ ఈవెంట్లలో ఈ రెండు జట్లు ఎప్పుడు తలపడినా ఆఖరు బంతి వరకు ఉత్కంఠ ఖాయం. ఇటు ఆసీస్, అటు సఫారీలు తొలి మ్యాచ్‌లో మెరుపు విజయాలు నమోదు జోరుమీదుండగా.. మంగళవారం రావల్పిండి స్టేడియంలో జరగాల్సిన గ్రూప్-బి మ్యాచ్ వర్షం కారణంగా సాధ్యపడలేదు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలు చెరో పాయింట్ పంచుకున్నాయి. ఐసీసీ ఈవెంట్లలో దక్షిణాఫ్రికాపై ఆసీస్‌కు పైచేయి ఉంది. ఈ రెండు జట్లు తలపడిన తొమ్మిది మ్యాచుల్లో కంగారూలు నాలుగింట గెలుపొందగా, దక్షిణాఫ్రికా మూడు మ్యాచుల్లో గెలుపొందింది. 1999 వరల్డ్‌కప్ మ్యాచ్ టై కాగా.. తాజా మ్యాచ్ వర్షం కారణంగా రద్దుగా ముగిసింది.

ముందుగానే నిర్ణయం

ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు ఆరంభం కావాల్సింది. మ్యాచ్ ఆరంభం కావాల్సిన సమయం నుంచి సరిగ్గా మూడు గంటల 10 నిమిషాల తర్వాత ఫీల్డ్ అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. వర్షం అంతరాయం కలిగించినా.. కనీసం 20 ఓవర్ల మ్యాచ్ కోసం రాత్రి 7.32 గంటల వరకు వేచి చూడవచ్చు. అయినా, మరో రెండు గంటల 22 నిమిషాల సమయం ఉండగానే అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేశారు. నిలకడగా వర్షం కురవటం, సాయంత్రం తర్వాత సైతం వర్షం తగ్గే సూచనలు లేకపోవటంతో అంపైర్లు ఈ నిర్ణయానికి వచ్చారు. టాస్ పడకపోవటంతో ఆసీస్, సఫారీలు తుది జట్లను ప్రకటించాల్సిన అవసరం రాలేదు.

రేసు ఆసక్తికరం

గ్రూప్-బి సెమీఫైనల్ రేసు ఆసక్తికరంగా మారింది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మ్యాచ్ రద్దు కావటంతో నేడు



ఇంగ్లాండ్, అఫ్గనిస్థాన్ మ్యాచ్ నాకౌట్‌గా మారింది. ఇంగ్లాండ్, అఫ్గాన్‌లు తొలి మ్యాచ్‌లో పరాజయం పాలయ్యాయి. నేడు మ్యాచ్‌లో నెగ్గిన జట్టుకు మాత్రమే సెమీఫైనల్ ఆశలు సజీవంగా నిలుస్తాయి. ఓడిన జట్టుకు మరో మ్యాచ్ ఉన్నప్పటికీ.. సెమీఫైనల్స్‌కు చేరుకునే అవకాశాలు ఉండవు. ఆస్ట్రేలియా గ్రూప్ దశ మూడో మ్యాచ్‌లో అఫ్గనిస్థాన్‌తో ఆడనుండగా.. ఇంగ్లాండ్‌తో దక్షిణాఫ్రికా ఢీకొట్టనుంది. గ్రూప్-బి టాప్-2 స్థానాలు ఈ మ్యాచుల్లోనే తేలనున్నాయి.


సఫారీలకు ఊరట!

ఆస్ట్రేలియాతో మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావటంతో నిరాశపరిచినా.. సఫారీలకు మాత్రం ఒకింత మేలు చేయనుంది. ఆ జట్టు కీలక బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ ఎల్బో గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. అందుకే, అఫ్గనిస్థాన్‌తో తొలి మ్యాచ్‌కు క్లాసెన్ దూరమయ్యాడు. గ్రూప్ దశలో దక్షిణాఫ్రికా చివరి మ్యాచ్ ఇంగ్లాండ్‌తో ఆడనుంది. ఈ మ్యాచ్ శనివారం షెడ్యూల్ చేశారు. మరో మూడు రోజుల సమయం ఉండటంతో హెన్రిచ్ క్లాసెన్ పూర్తిగా కోలుకునేందుకు వీలుంది. బలమైన ఇంగ్లాండ్‌తో పోరుకు క్లాసెన్ అందుబాటులోకి వస్తే.. సఫారీలకు కొండంత ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగే అవకాశం చిక్కుతుంది.

సారథ్యానికి సిద్ధమే!

నైట్‌రైడర్స్ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్

ముంబయి : ఈ ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో అందరి దృష్టిని ఆకర్షించనున్న ఆటగాళ్లలో మధ్యప్రదేశ్, కోల్‌కత నైట్‌రైడర్స్ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్ ఒకరు. ఐపీఎల్ ఆటగాళ్ల వేలంలో వెంకటేశ్ అయ్యర్ రూ.23.75 కోట్ల రికార్డు ధరను దక్కించుకున్నాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను వేలంలోకి వదిలేసిన కోల్‌కత నైట్‌రైడర్స్.. వెంకటేశ్ అయ్యర్‌ను తిరిగి సొంతం చేసుకుంది. ఫ్రాంచైజీకి మూడో టైటిల్ అందించిన కెప్టెన్‌ను తర్వాతి సీజన్‌ను అట్టిపెట్టుకోని కోల్‌కత నైట్‌రైడర్స్ 2025 ఐపీఎల్‌కు కొత్త కెప్టెన్‌ను ఇంకా ప్రకటించలేదు. భారత సీనియర్ క్రికెటర్ అజింక్య రహానెతో పాటు ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్ సైతం కెప్టెన్సీలో రేసులో ఉన్నాడు. శ్రేయస్ అయ్యర్ పంజాబ్ కింగ్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనున్న సంగతి తెలిసిందే. దేశవాళీ క్రికెట్‌లో మధ్యప్రదేశ్‌ను నాయకుడిలా ముందుండి నడిపిస్తున్న అయ్యర్.. కోల్‌కత నైట్‌రైడర్స్ సారథ్యం దక్కితే తప్పకుండా సిద్ధంగా ఉన్నానని వెల్లడించాడు. 'డ్రెస్సింగ్‌రూమ్‌లో ఆటగాళ్లను నడిపించేందుకు కెప్టెనే అవసరం లేదు. మధ్యప్రదేశ్ డ్రెస్సింగ్‌రూమ్‌లో ఈ గౌరవం పొందుతున్నాను. ఓ రోల్‌మోడల్‌గా సహచరులు నన్ను చూశారు. కెప్టెన్ కాకపోయినా.. ఓ ఆటగాడి అభిప్రాయాలను గౌరవించటం మంచిగా అనిపించింది. కోల్‌కత నైట్‌రైడర్స్ డ్రెస్సింగ్‌రూమ్‌లోనూ ఓ ఆటగాడు ధర 20 లక్షలు, 20 కోట్లు అనే వ్యత్యాసం లేకుండా.. అందరికీ సమ ప్రాధాన్యం ఉండాలని అనుకుంటున్నాను. నాకు కెప్టెన్సీ అవకాశం వస్తే.. కచ్చితంగా తీసుకుంటాను. అందులో ఎటువంటి సందేహం లేదు' అని వెంకటేశ్ అయ్యర్ తెలిపాడు.



సాధన షురూ : ఐపీఎల్ డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కత నైట్‌రైడర్స్ రానున్న సీజన్‌కు సన్నాహకం మొదలుపెట్టింది. కోల్‌కత నైట్‌రైడర్స్ ఆటగాళ్లు ముంబయిలో వారం రోజుల పాటు సాధన చేయనున్నారు. సహాయక సిబ్బందితో పాటు అందుబాటులోని ఆటగాళ్లు మంగళవారం నుంచి ముంబయిలో సాధన షురూ చేశారు. వారం రోజుల శిక్షణ శిబిరం అనంతరం నేరుగా కోల్‌కతకు చేరుకోనున్నారు. మార్చి 22న కోల్‌కత ఈడెన్‌గార్డెన్స్‌లో కోల్‌కత నైట్‌రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మ్యాచ్‌తో ఐపీఎల్ 2025 సీజన్ ఆరంభం కానున్న సంగతి తెలిసిందే.

బాక్సింగ్ గందరగోళం

ఐఓఏ అడ్‌హాక్ కమిటీపై వ్యతిరేకత

న్యూఢిల్లీ : అంతర్గత సమస్యలనే పరిష్కరించుకోలేని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) జాతీయ క్రీడా సమాఖ్యల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ వివాదాలకు కేంద్రంగా నిలుస్తోంది. భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) ఎన్నికలు ఫిబ్రవరి 2న జరగాల్సి ఉండగా.. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాలేదు. దీంతో బాక్సింగ్ సమాఖ్య పర్యవేక్షణకు అడ్‌హాక్ సంఘాన్ని నియమిస్తూ ఐఓఏ అధ్యక్షులు పిటి. ఉష నిర్ణయం తీసుకున్నారు. దీనిపై ఐఓఏ కోశాధికారి సహదేవ్ యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'ఐఓఏ పేరిటి అడ్‌హాక్ కమిటీ వేశారు. కానీ ఆ అంశంపై ఐఓఏ ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ)లో చర్చ చేయలేదు. ఇది పూర్తిగా పిటి ఉష ఏకపక్ష నిర్ణయం. జాతీయ క్రీడా సమాఖ్యలపై ఐఓఏలకు ఎటువంటి అధికారం లేదు. ఈ అంశంలో బాక్సింగ్ సమాఖ్య న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే అందుకు అయ్యే ఖర్చులను ఐఓఏ నుంచి భరించాల్సిన అవసరం లేదని' సహదేవ్ యాదవ్ తెలిపారు. రాజేశ్ భండారి, డిపి భట్, బాక్సర్ శివ థాప, వీరేంద్ర సింగ్ ఠాకూర్‌లు అడ్‌హాక్ కమిటీలో ఉన్నారు.

కేరళ కొట్టేనా?

- ఊరిస్తోన్న రంజీ ట్రోఫీ తొలి టైటిల్
- టైటిల్ పోరులో విదర్భ, కేరళ అమీతుమీ
- రంజీ ట్రోఫీ ఫైనల్ నేటి నుంచి షురూ


నవతెలంగాణ-నాగ్‌పూర్

దేశవాళీ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ రంజీ ట్రోఫీ. సహజంగా టైటిల్ పోరులో ముంబయి, తమిళనాడు, గుజరాత్, కర్నాటక వంటి జట్లను చూడటం అలవాటైన అభిమానులకు.. ఈ ఏడాది సరికొత్త అనుభూతిని తీసుకొచ్చింది. అభిమానులు, సినిమా తారలు సైతం రంజీ ట్రోఫీ ఫైనల్ గురించి చర్చిస్తున్నారు. అందుకు కారణం, కేరళ తొలిసారి రంజీ ట్రోఫీ ఫైనల్‌కు చేరటం. 2018-19లో కేరళ టైటిల్ పోరుకు చేరే అవకాశం చేజార్చుకోగా.. ఈసారి వదిలిపెట్టలేదు. ఉత్కంఠభరిత మ్యాచుల్లో పైచేయి సాధించిన కేరళ చరిత్రలో తొలి రంజీ ట్రోఫీ టైటిల్‌ను వేటాడుతూ నేడు నాగ్‌పూర్‌లో బరిలోకి దిగుతోంది. రెండు సార్లు చాంపియన్ విదర్భ సొంతగడ్డపై రెట్టించిన ఉత్సాహంతో మూడో టైటిల్‌పై కన్నేసి మైదానంలో అడుగుపెడుతోంది. విదర్భ, కేరళ రంజీ ట్రోఫీ ఫైనల్ సమరం నేటి నుంచి ఆరంభం.


విదర్భ, కేరళ అమీతుమీ :

భారత క్రికెట్ సర్క్యూట్‌లో పెద్దగా వినిపించని పేర్లు విదర్భ, కేరళ. ఇటీవల కాలంలో విదర్భ దేశవాళీ క్రికెట్‌ను శాసించే స్థాయికి ఎదుగుతోండగా.. కేరళ ఇప్పుడిప్పుడే తొలి కేక వినిపించేందుకు సిద్ధమవుతోంది. జూనియర్ క్రికెట్‌ను స్ఫూర్తిదాయక రీతిలో నడిపించటమే ఈ రెండు జట్ల విజయ రహస్యం కావటం గమనార్హం. గ్రూప్ దశలో విదర్భ ఎదురులేని విజయాలు సాధించగా.. కేరళ ఆ స్థాయిలో ఆధిపత్యం చూపించలేదు. క్వార్టర్స్‌లో తమిళనాడు, సెమీస్‌లో ముంబయి వంటి అగ్రజట్లను ఓడించిన విదర్భ సహజంగానే నేడు ఫైవరేట్‌గా బరిలోకి దిగుతోంది. గ్రూప్ దశలో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాలతో గట్టెక్కిన కేరళ.. గుజరాత్‌ను నాటకీయ రీతిలో సెమీస్‌లో 2 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో వెనక్కి నెట్టింది. ప్రతికూల పరిస్థితుల్లోనూ నిలదొక్కుకుని పైచేయి సాధించిన అనుభవం కేరళ సొంతం కాగా.. విదర్భ దండయాత్ర ప్రదర్శనల అండతో కవ్వించనుంది. కరుణ్ నాయర్, యశ్ రాథోడ్, హర్ష్ దూబె, అథర్వ , ధ్రువ్ శోరెలు విదర్భకు కీలకం కానున్నారు. సచిన్ బేబి, జలజ్ సక్సేనా, మహ్మద్ అజహరుద్దీన్, అక్షయ్ చంద్రన్, వరుణ్ నయనర్‌లు కేరళకు కీలకం కానున్నారు. కేరళ, విదర్భ సెమీఫైనల్ మ్యాచ్ నేడు ఉదయం 9.30 గంటల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం కానుంది.









నిధి అగర్వాల్, పవన్ కళ్యాణ్

'కొల్లగొట్టినాదిరో'.

పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'హరి హర వీరమల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'. నిర్మాత ఎ.ఎం.రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావు నిర్మిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన 'మాట వినాలి' గీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.
ఇప్పుడు ఈ సినిమా నుంచి రెండవ గీతంగా విడుదలైన 'కొల్లగొట్టినాదిరో' పాట అద్భుతంగా ఉంది. ఈ పాట సినిమాపై అంచనాలను మరోస్థాయికి తీసుకెళ్ళింది. పాట ప్రారంభం నుంచి ముగింపు వరకు.. ఎంతో వినసొంపుగా, శ్రోతలను కట్టిపడేసేలా సాగింది. ఇక పవన్ కళ్యాణ్ స్క్రీన్ ప్రెజెన్స్ లిరికల్ వీడియోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవన్ కళ్యాణ్ సరసన జంటగా నటించిన నిధి అగర్వాల్ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. తెరపై ఈ జోడి చూడముచ్చటగా ఉంది. అలాగే ఈ పాటలో అనసూయ భరద్వాజ్, పూజిత పొన్నాడ మెరిసి తమ నృత్యంతో అదనపు ఆకర్షణగా నిలిచారు. కీరవాణి స్వరపరిచిన ఈ గీతం సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేస్తోంది. బహుళ భాషల్లో విడుదలైన ఈ గీతాన్ని ప్రతిభగల గాయనీ గాయకులు మంగ్లీ, రాహుల్ సిప్లిగంజ్, రమ్య బెహరా, యామిని ఘంటసాల, ఐరా ఉడిపి, మోహన భోగరాజు, వైష్ణవి కన్నన్, సుదీప్ కుమార్, అరుణ మేరీ ఆలపించి పాటకు మరింత మాధుర్యం తీసుకొచ్చారు తెలుగులో చంద్రబోస్, తమిళంలో పా. విజయ్, మలయాళంలో మంకొంబు గోపాలకృష్ణన్, కన్నడలో వరదరాజ్, హిందీలో

నవచిత్రం

అబ్బాస్ టైరేవాలా సాహిత్యం అందించారు.
ఈ చిత్రానికి జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

అర్జున్ సర్కార్ విశ్వరూపం

నాని నటిస్తున్న హైలీ యాంటిసిపేటెడ్ క్రైమ్ థ్రిల్లర్ 'హిట్ 3 : ది థర్డ్ కేస్'. శైలేష్ కొలను దర్శకత్వంలో 'హిట్' సిరీస్‌లో మూడవ భాగంగా రాబోతున్న చిత్రమిది. వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై ప్రశాంతి తిపిర్నేని, నాని యూనిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. నాని పుట్టినరోజు సందర్భంగా సర్కార్స్ లాఠీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886